ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 4 | సంచిక 3 జులై-సెప్టెంబర్ 2024

మమత-సమత-మానవత
www.gurajada.org






# ప్రకాశిక

సమగ్ర సాహిత్య సామాజిక పత్రిక

## ప్రకాశిక - పరిచయం

ఆధునిక కవితకు అడుగుజాడ అయిన మహాకవి **శ్రీ గురజాడ వేంకట అప్పారావు గారు** తలపెట్టిన పత్రిక 'ప్రకాశిక'. ఆ పత్రికని పునరుద్ధరించి ఆయన స్మృతికి ఘన నివాళి ఇవ్వాలనే ఉద్దేశంతో **గురజాడ ఫౌండేషన్ (అమెరికా)** 'ప్రకాశిక'ను అంతర్జాల, డిజిటల్ పత్రికగా గత మూడు సంవత్సరాలుగా ప్రచురిస్తోంది. యావత్ తెలుగు జాతికీ అలనాటి భాష సంస్కృతి, సంప్రదాయం, వ్యావహారికాలను, సమకాలీన సాహితీ ప్రక్రియలను పరిచయం చేస్తూ, నేటి సమాజపు స్థితిగతులకు అద్దం పట్టే ఒక వేదికగా ప్రకాశికను రూపుదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. **ప్రకాశిక త్రైమాస పత్రిక**గా వెలువడుతోంది.

గురజాడ కలంనుండి జాలువారిన అక్షర మాలికలు ఎన్నో గురజాడ వేంకట అప్పారావు గారికి 'మహాకవి శ్రీ గురజాడ అప్పారావు'గా గుర్తింపు తెచ్చాయి. ఆయన రచనలు ఆణి ముత్యాలు, సరస సరాగాలు, ముత్యాల సరాలు. పరిసరాలని పరిశీలిస్తూ, ప్రభావితమవుతూ, మంచి అన్నది పెంచమంటూ, భాష భావ వ్యక్తీకరణకు సాధనమే కానీ పదడాంబిక ప్రదర్శనకు సూచిక కాదని నమ్మి తెలుగు భాషని తేటగా, తీయగా, సరళంగా, సరసంగా పండిత పామరులకు చేరువ చేయడంలో ఆయన సలిపిన కృషి అజరామరం, చిర స్మరణీయం.



సాంఘిక దురాచారాలని వ్యావహారిక భాషలో ఎత్తిచూపి, వ్యంగ్యాయుధంతో వాటిని కూకటివేళ్లతో సహా పెకిలించిన అరుదైన భాషావేత్త, సంఘ సంస్కర్త, మహాకవి గురజాడ వేంకట అప్పారావుగారు. అక్షరాయుధంతో మరెన్నో సాధించాలనుకున్నారో ఏమో, **'ప్రకాశిక'** పత్రికను ఆయన స్థాపించారు. అయితే, ఆ పత్రిక ఎంతోకాలం సాగిన దాఖలాలు లేవు. తొలి రాత ప్రతి దొంగిలించబడిందని ఆయన వంశీకుల ఆవేదన. ప్రకాశిక పత్రిక పర హస్తగతమైనా, అందులోని భావ తరంగాలు శతాబ్దానికి పైగా ఎన్నో తరాలను ఉత్తేజ పరుస్తునే ఉన్నాయి.





ఆ మహాకవి కాలంలో ఉన్న దురాచారాలు, మూఢవిశ్వాసాలు ఈ కాలంలో కూడా ఆధునిక



















పరిజ్ఞానంతోపాటు, ఏదో ఒక రూపంలో విరివిగా, విస్తృతంగా కొనసాగుతున్నాయి. మనుషుల లోని భయాలనీ, ఆందోళనలనీ ఆసరాగా తీసుకుని, అరకొర జ్ఞానంతో, శాస్త్రాలకి వక్రభాష్యాలతో అమాయకులని మోసంచేసే నవయుగ గిరీశాలు కోకొల్లలుగా, ఖండాంతరాలుగా వ్యాపించి ఉన్నారు. సమాజంలో, ముఖ్యంగా యువతలో హేతుబద్ధ ఆలోచనలు పెంచే ప్రయత్నం ప్రకాశిక ద్వారా చేద్దాం. గురజాడ వ్యక్తిత్వ స్ఫూర్తితో, ఆయన ఆలోచనలకు అనుగుణంగా, భాషోద్దీపన, సమాజ శ్రేయస్సులను కాంక్షిస్తూ '**ప్రకాశిక**'ని నడపాలని గురజాడ ఫౌండేషన్ (అమెరికా) సంకల్పం.

సమాజాన్ని తట్టి, కుదిపి, ఆలోచింపచేసే రచనలూ, వెన్నుతట్టి దారిచూపే దార్శనికుల వ్యాసాలు, మస్తిష్కానికి పదును పెట్టే శీర్షికలతో '**ప్రకాశిక**'ను అందంగా ముస్తాబు చేసి పాఠకులకు గత మూడు సంవత్సరాలుగా అందిస్తున్నాం. ప్రకాశికలో ప్రచురణ కోసం తెలుగు మాండలిక శోభతో వ్రాసిన రచనలని ప్రోత్సహిస్తాం. హాస్యం, వ్యంగ్యం తెలియనివాడు, నచ్చనివాడు తెలుగువాడు కాదేమో అనిపిస్తుంది! కన్యాశుల్కం ఒక ప్రభావవంత నాటకంగా నిలిచిందంటే, హాస్యం, వ్యంగ్యం, వెటకారాలని అనుపానంగా పెట్టి నిష్ఠూరాన్ని నిబ్బరంగా చెప్పడం వలనే కదా! హాస్య, వ్యంగ్యభరిత, రచనలు పంపిస్తే కళ్ళకద్దుకొని తీసుకుంటాం.

కథ, కవిత, వ్యాసం, అనువాద రచన మొదలైన సాహిత్య ప్రక్రియలకీ, సాహిత్య, సామాజిక అంశాల మీద రాసిన పరిశోధనా పత్రాల ప్రచురణకీ '**ప్రకాశిక**' ఒక విలక్షణమైన వేదికగా కొనసాగుతుంది. ముఖ్యంగా ఏ ప్రక్రియలనైనా యువతరం చేసే రచనలను ప్రకాశిక ప్రోత్సహిస్తుంది.

'**ప్రకాశిక**'ను ప్రకాశవంతంగా శోభాయమానంగా తీర్చిదిద్దడంలో సాహితీ మిత్రులు, రచయితల అండదండలు, సహకారం మాకు సదా అవసరం. '**ప్రకాశిక**'లో ప్రచురణకు రచనలు పంపమని ప్రసిద్ధ రచయితలకు, కొత్త రచయితలకు ఆహ్వానం పలుకుతున్నాం.

**ఈ పత్రిక మనందరిదీ. కలిసి పెంచుదాం.**

మీ రచనలను సులువుగా ప్రకాశిక వెబ్‌సైట్‌లో సమర్పించవచ్చు. www.prakasika.org



**ప్రధాన సంపాదకులు**

editor@prakasika.org

## సంపాదక వర్గం



**కీ.శే. శ్రీ గురజాడ అప్పారావు**
వ్యవస్థాపక సంపాదకులు

**ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ**
ప్రధాన సంపాదకులు

**ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు**
వరిష్ఠ సంపాదకులు

**ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి**
సంపాదకులు

**డా. సుంకర గోపాలయ్య**
సంపాదకులు

**శ్రీ మండలి బుద్ధప్రసాద్**
ప్రధాన సలహాదారు

సలహాదారులు
**ఆచార్య మాడభూషి సంపత్ కుమార్**
**డా.వి.ఆర్.రాసాని**
**శ్రీ విహారి**
**శ్రీ గురజాడ రవీంద్రుడు**
**శ్రీమతి అరుణ గురజాడ**

**ISSN 2766-0168**
అంతర్జాల త్రైమాస పత్రిక
www.prakasika.org
editor@prakasika.org

– సంపాదకీయం –

# దేశం, భక్తి, దేశభక్తి

భారతదేశంలో నివసిస్తున్న, ప్రపంచమంతటా విస్తరించి విరాజిల్లుతున్న భారతీయులకి 78వ స్వాతంత్ర్య దిన శుభాకాంక్షలు. గడచిన ఏడున్నర దశాబ్దాలలో భారత దేశం సాధించిన ప్రగతి, పలు రంగాలలో జరిగిన అభివృద్ధి ఎంతో గణనీయమైనదన్న విషయం కాదనలేనిది. ఈ ప్రగతికి ఎన్నో కారణాలు ఉండవచ్చు కానీ, దేశం ఎంచుకున్న ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రజల శాంతికాముక జీవన ఆకాంక్ష, ముఖ్యకారణాలు. ప్రస్తుతం పొరుగు దేశాలలో నెలకొని ఉన్న పరిస్థితులు గమనిస్తే భారత దేశ సుస్థిరత వెనక ఉన్న కారణాలు స్పష్టంగా అవగతం అవుతాయి. ఈ ప్రగతికి కారణమైన అన్ని రాజకీయ పార్టీలనీ, నాయకులనీ, ప్రజలనీ అభినందించాలి.

78 సంవత్సరాల వయస్సు ఉన్న యువ దేశం సాధించవలసినది ఇంకా చాలా ఉంది. 25 సంవత్సరాల లోపు వయసు ఉన్న ప్రజల సంఖ్య భారతదేశంలో అధికం. వేగంగా పెరుగుతున్న జనాభాకి తగిన వసతుల కల్పన, యువతీయువకుల, శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోగల పథకాల రూపకల్పన, అభివృద్ధికి అవసరమైన దీర్ఘకాల ప్రణాళికల రూపకల్పన ఎంతో అవసరం.

వ్యవసాయ ప్రధానమైన ఆర్థిక వ్యవస్థ ఉన్న భారతదేశంలో రైతులకి సరైన ప్రోత్సాహం, ఆసరా ఇవ్వడం చాలా అవసరం; ఇది అధికారంలో ఉన్న ప్రభుత్వాల బాధ్యత. ఋణ మాఫీ వంటి దయాగుణ ప్రదర్శన కంటే, రైతు ఋణగ్రస్తుడు కాకుండా ఉండేలా ప్రభుత్వాలు ప్రణాళికలు

రూపొందించడం చాలా అవసరం. పండించిన పంటకి అవసరమైన గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ కనీస కర్తవ్యం. పండించిన పంట ఎండా వానల తాకిడికి, ఈనగాసి నక్కల పాలు అన్న చందాన నాశనం అవుతోంటే రైతు గుండె తరుక్కు పోవడమే కాకుండా, పండించడానికి వెచ్చించిన ఎన్నో వనరులు, ముఖ్యంగా రైతు, వ్యవసాయ కార్మికుల శ్రమ, వృధా కావడం గర్హనీయం. రైతులు పంటలని నిలవ ఉంచుకునే విధంగా గిడ్డంగులను నిర్మించి సరసమైన ధరకి అందుబాటులో ఉండేలా చేయడం ఎంతో ముఖ్యం.

ఎదుగుతున్న దేశం పెక్కు సవాళ్లను ఎదుర్కొంటోందన్నది సత్యం. ముఖ్యంగా యువత ఎదుర్కొంటున్న సవాళ్లు క్లిష్టమైనవి. బతుకు తెరువుకి అవసరైన నైపుణ్యం ఇవ్వని డొల్ల పట్టాలు యువత భవితకి గొడ్డలిపెట్టు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఏటా వెలువరించే నివేదికల ప్రకారం దేశంలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుండి పట్టాలు పొందినవారిలో అధిక శాతం వేర్వేరు ఉద్యోగాలకి అవసరమైన కనీస అర్హతలు లేనివారట. డిగ్రీలు, హోదాలకి పట్టం కట్టే భారతదేశంలో నిత్య జీవితంలో అవసరమైన నైపుణ్యానికి ప్రాముఖ్యత ఇవ్వం. సంభాషణా నైపుణ్యం మొదలు కలిసి పనిచేసే తత్వం వరకు యువతకి అవసరమైన నైపుణ్యాల సముపార్జనకు అవసరమైన శిక్షణ కాళాశాల విద్యలో చేర్చవలసిన అవసరం ఉంది. ఉత్తమ భవిష్యత్ పట్ల ఆశ కలిగించే సాహిత్య పరిచయం యువతకి అవసరం.

బహుళ సంస్కృతులు, బహు జాతుల సమాహారమైన భారతదేశ మనుగడకి ప్రజాస్వామ్యయుత పాలన, అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల ప్రజల ఆకాంక్షలకి అనుగుణంగా తీసుకునే నిర్ణయాల ఆధారంగా చేసే పరిపాలన ఎంతో అవసరం. నిష్టూరంగా వినిపించినా కొన్ని విషయాలు నిక్కచ్చిగా ప్రస్తావించడం మేధావి వర్గ బాధ్యత. కొన్ని దశాబ్దాల క్రితం వరకూ కుల, మత రహిత, సమ సమాజ స్థాపన మేధావుల ఆశయంగానూ, సామాన్యుల ఆశగానూ ఉండేది. దేశంలో నెలకొని ఉన్న ప్రస్తుత పరిస్థితులు చూస్తే, ఈ ఆశయాలు ఎంతవరకు

నెరవేరాయన్న ప్రశ్నకి సమాధానం అంత సులభం కాదేమో. సమాజం కులోపకులాలుగా, వర్గోపవర్గాలుగా, ప్రాంతోపప్రాంతాలుగా చీలి, సమష్టి మేలు కంటే వ్యక్తి మేలుకి ప్రధాన్యతనిచ్చే ఆలోచనలు విస్తరిల్లుతున్నాయి. రాజకీయ నాయకులూ అదే ఆశిస్తున్నారు, ప్రజలూ అదే కోరుకుంటున్నారు అనిపిస్తోంది. కులవ్యవస్థని నిరసించిన కాలం నుంచి, కుల బల ప్రదర్శన స్థాయికి సమాజం పరిణామం చెందిందా? మేధావులు నిష్పక్షంగా, నిస్పాక్షికంగా ఆలోచించాలి. ఆరోగ్యకరమైన దేశ ప్రగతికి యువతే భవిత. యువతకి మార్గదర్శనం చేసే బాధ్యత మేధావి వర్గానిదే.

సిరివెన్నెల సీతారామశాస్త్రి గారి పాటలోని ఐక్యతని ఆకాంక్షించే మాటలు సమాజాన్ని ఆలోచింపచేస్తాయని ఆశిద్దాం.

"ఎగిరే జండా మన జనని: ఏమంటున్నది మననుగని
పూవుల దీవెనలందిస్తున్నది: తనంత ఎత్తుకు ఎదగమని
గాంధీజీ అందించిన సూత్రం కలిపిన భారతి సంతానం
ఎన్నో జాతుల ఎన్నో రీతులు ఎన్నో రంగుల విరులసరం
విభేదాలతో విడిపోతే ఆ తల్లికి తీరని సంతాపం
కళకళలాడుతూ కలిసుంటేనే కలుగును కళగను సంతోషం
ఆ వెలుగును అందుకొని నీ ప్రగతిని పొందమని"

**డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ**
ప్రధాన సంపాదకులు, ప్రకాశిక

# ముఖచిత్రం

దేశం, భక్తి, దేశభక్తి




## లోపల

మాయిముంత ....................................................8

మాయిముంత – కథానిక ........................................25

గురజాడ దిద్దిన చిన్న కథ ......................................32

సావిత్రిబాయి పూలే కవిత్వం – సామాజిక స్పృహ ..............38

చార్ ధాం యాత్ర ..................................................52

సహేతుకమైన క్రమశిక్షణ యువత భవితకు రక్షణ ...............57

ప్రేరణ .....................................................................61

విలక్షణ సాహితీ నక్షత్రం – ఆరుద్ర ...............................69

విశ్వనాథ కవిత్వం – జాతీయత......................................92

క్రోమోజోములు ఏలా పరి రక్షింప బడతాయి ? 2009 సంవత్సర వైద్యరంగపు నోబెల్ పరిశోధన ....................................101

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు, ఆయా రచయితల స్వంతం. పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధమూ లేదు.

మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# మాయిముంత




డాక్టర్ పెద్దింటి అశోక్ కుమార్
✆ 94416 72428


సాయమ్మకు నిద్రవడుతలేదు. చిన్న బిడ్డ దేవ యాదికచ్చి గుండె చెరువయింది. కన్నీళ్లతో మెత్త సగం నానింది.

"బిడ్డ ఒకలకు చెయ్యి జాపకుంట బతుకాలని అప్పుసప్పు జేసి ఉన్న ఇంటికి ఇత్తి. పిల్లలు అయితలేరంటే బూమండలం మొత్తం జోలె గట్టుకుని తిరిగితి. సల్లగ ఒక కానుపు జేత్తి. ఇప్పుడు నేను కనవడుతలేనా...అవ్వారాయే అని తోలుక పోదా! మల్లా పొద్దులు నిండినయి. కానుపుకు ఎట్లతోలుకరావాలె. నాకు ఎట్ల చేతులత్తయి" అనుకుంది.

అప్పుడే బయట బలబల చప్పుడు. చిన్నగా అరుపు. ఆలోచనల్లోంచి తేరుకుని చెవులు రిక్కించి విన్నది సాయమ్మ. సప్పుడు పెద్దదయింది. సాయమ్మ ఉల్కిపడ్డది.




అనుమానం లేదు. ఏ ఎద్దో, పోతో ఎనుగు దుంకి అనుపచేన్లకు వచ్చినట్టుంది. చేను పాడుగాను. ఏ గడియల కాసెనోగాని పలారంగావట్టె" అనుకుంది.

ఎంటనే భర్తను కేకేసి "ఔ... ఉన్నావా? ఒకసారి గటు సూడుపో...అనుప చేను పెట్టుడేమో

గాని కావలి గాయలేక సత్తున్నం. రాత్రిలేదు పగలులేదు” గులిగింది సాయమ్మ.

సాయన్నకు అప్పుడే కన్నంటుకుంది. భార్య పిలుపుకు లేచిండు. “దీని పాడుగాను. రాత్రి పూట ఏమచ్చే! బర్లు గిట్ల వచ్చెనాంటె పొట్టు పొట్టు తొక్కుతయి” అనుకుంట చేతి కట్టెకోసం చూసిండు.

“ఏమాయె, నువ్వు గోశి సదిరే వరకు అది సగం మడి తొక్కుతది. నడువు... నడువు...!” గద్దిరిచ్చింది సాయమ్మ.

అప్పుడే బయటకచ్చింది సాయమ్మ. వత్త వత్తనే ఏన్నీల సాలులో బర్రెను గుర్తువట్టింది.

చేతి కట్టెను, టార్చ్ లైటును అందుకుని తలుపు తెరిచి బయటకు వచ్చిండు సాయన్న. అప్పటికే పల్లె మొత్తం కన్ను మగ్గింది. పల్లెకు దూరంగా ఉన్న ఇల్లు అది. మాగిన అనుపచేను వాసన గుప్పుమంది. చేను నిండా ఏన్నీల పరుచుకుంది.

సాయన్న పెరడంతా చూసిండు. మొదటి మడిలో నల్లటి ఆకారం కనిపించింది. లైటు కొట్టి చూసిండు. పాణం దస్సుమంది. అతడు బయపడ్డట్టు అది బర్రెనే!

“నీ గత్తర్రాను గదనే! నువ్వు వాసన వట్టినవంటే ఇడుత్తవా..! ఎద్దో పోతో ఐతే ఒకటే వత్తది. నువ్వు మండకు మంద ఎంట పెట్టుకత్తవు” అనుకుంట మట్టి పెల్లను అందుకుని బలంగా ఇసిరి కొట్టిండు.

పెల్ల కొమ్ములకు తాకింది. అయినా బర్రె కదల్లేదు. తీగెల్ని మజ్జెడ మజ్జెడ తొక్కింది. సాయన్నకు తిక్కలేసింది ‘అరే.. దీని కత జూసినవా... అడుగు జరుగుతలేదు.’ అనుకుంట చేతిలో కట్టెను ఇసిరిండు. కట్టె అంత దూరం పోలేదు. నాలుగు అడుగులేసి కట్టెను అందుకుని బర్రె మీదికి ఉరికిండు.

అప్పుడే బయటకచ్చింది సాయమ్మ. వత్త వత్తనే ఏన్నీల సాలులో బర్రెను గుర్తువట్టింది. దబదబ నాలుగు అడుగులేసి బర్రె దగ్గరికి వచ్చింది. కొట్టబోతున్న సాయన్నను అపింది.

ఆమెడ దూరంలో గోజ కనవడితే ఉరికురికి తరిమే సాయమ్మ తనను ఎందుకు అపిందో అర్థం కాలేదు సాయన్నకు. అతడు అడిగేలోపే గొంతు తగ్గించి "అది మన గొంగి బర్రె గదా! వంగు కొమ్ములు కనవడుతలెవ్వా...." అన్నది.

సాయమ్మకు కోపంలేదు. బాధగా ఉంది. అప్పటికే బిడ్డను తిట్టుకుంట ఏడుతంది.

అప్పుడు చూసిండు సాయన్న బర్రెను. వంగుకొమ్ములు, నాలె సూపులు, ఎత్తుగా ఉన్న ఊపురం.

కోపం మరింత ఎక్కువయింది "గొంగిదో... గోష్ఠిదో... తలకు వాసిన ఎంటిక ఏ రేవులపోతే మనకేంది". అంటూ కట్టెతో బర్రె కొంకుల మీద కొట్టిండు. ఆ దెబ్బకు గెంటినట్టు రెండడుగులు ముందుకేసింది బర్రె.

సాయమ్మ గుండెల కలుక్కుమంది. "నీ పాడుగాను జరాగు. బర్రె సుడిమీదుంది. తీగలేత్తుంది. కనవడుతలేదా" అన్నది.

నిండుకుండలెక్క కదులుతున్న బర్రెను చూసినంక సాయన్న చెయ్యి కిందికి దిగింది. అయినా కోపం తగ్గలేదు. "నీగత్తర్రాను నాయిల్లుకు సిచ్చుపెట్టినవు. చేసింది సాలదని మల్లచ్చినవా" అన్నడు కోపంగా.

సాయమ్మకు కోపంలేదు. బాధగా ఉంది. అప్పటికే బిడ్డను తిట్టుకుంట ఏడుతంది. బర్రెను చూసినంక ఆ ఏడుపు ఎక్కువయింది. దాని రొండ్లమీద చేతులేసి తట్టి" రేపో మాపో అన్నట్టు తల్లడిత్తన్నవు. గిప్పుడు దొంగతిండి గావలెనా... పొద్దులు నిండినయి. సక్కగ ఇంటికిపో" అన్నది మనిషితో అన్నట్టు.

సాయన్న కోపంతో "ఇంకదాన్ని నెత్తిమీద ఎత్తుకో...ఏ... ఎల్లదొబ్బు. తీగెల్ని తొక్కుతుంది" అన్నడు. అంటూనే అరిచెయ్యితో ఈపు మీద రెండు సరిసిండు బర్రెను. సొలుగుతూ అడుగులో అడుగు, రెండు అడుగులేసి ఆగింది బర్రె.

సాయన్న బర్రెను గెదిమిండు. అది మెల్లెగా ఎనుగుదాటింది. సాయన్న అక్కడనే ఆగిండు. సాయమ్మ మాత్రం బర్రెను పానాది దాటిచ్చి వచ్చింది. ఇద్దరూ ఇంట్లోకి నడిచింద్రు. తలుపులు దగ్గరేస్తూ పానాది దిక్కు పారజూచింది సాయమ్మ. మసక వెన్నెల్లో బర్రె కనిపించలేదు.

"చూసినవా...గొడ్డు బర్రెను ఇచ్చినమని మీ అక్క తిట్టనితిట్టు తిట్టె. అది తిట్టింది సరే.. బిడ్డ సల్లగుండ బిడ్డెంత బుద్ధిమంతురాలు. అనరాని మాటలనె. నన్ను ఉరివెట్టుకుని సావుమనె. పందిగన్నట్టు కన్నవనె. ఇప్పుడు జూడు బర్రె ఈతకచ్చె. మీదవడ్డ దెబ్బలు పోతయేమో గాని మాటలు వోతాయా..?" బాధగా అన్నది సాయమ్మ.

సాయమ్మకు కన్ను మలుగుతలేదు. బిడ్డదేవనే గుర్తుకత్తుంది. ఆమె తిట్టిన తిట్లే బొచ్చెల మెరుత్తున్నయి.

సాయన్న నోరు మెదుపలేదు. వచ్చి పక్కమీద వాలిండు. సాయమ్మకు నిద్ర ఎప్పుడో దూరమయింది. మంచం కోడు మీద కూసుంటూ "ఇంట్ల ఎవ్వలు లేరట. పొద్దుగల్లనే తాలమేసి బండి గట్టుకుని మల్లన్న గుట్టలకు పోయింఁడ్రట. పిల్లయి పుట్టెంటికలు తీత్తరట. అవ్వా పోదాందాయె అని రాకపాయె సూడు. యాడవుట్టె యాడవెరిగే..." బాధగా అన్నది సాయమ్మ

"తల్లికుంటే బిడ్డ దొర్సానట. బిడ్డెకుంటే తల్లి బాంచెదట. దాని కండ్లకు మనం కనవడుతున్నమా! ఆపతికి సంపతికి ఆదుకుంటదని బిడ్డని ఊర్లె ఇత్తే అగ్గిల బొర్రియ్యవట్టె." సాయన్న విరక్తిగా అన్నడు.

ఇద్దరు మౌనంగా పక్క మలిచిండ్రు. సాయన్నకు కన్నంటుకుంది. సాయమ్మకు కన్ను మలుగుతలేదు. బిడ్డదేవనే గుర్తుకత్తుంది. ఆమె తిట్టిన తిట్లే బొచ్చెల మెరుత్తున్నయి.

సాయమ్మకు ముగ్గురు బిడ్డలు. దేవనే చిన్నది. ఇద్దరు బిడ్డలను వేరే ఊరిచ్చిండ్రు. దేవను ఊల్లెనే మేనరికం ఇచ్చిండ్రు. యాడాది రెండేండ్లు గడిచినయి. దేవ ఊర్లెనే కాబట్టి తల్లిగారింటికి పొద్దునవత్తే మాపున ఎల్లిపోయేది. ఇద్దరు బిడ్డలు మాత్రం వారాలకు వారాలు ఉండేవాళ్లు.

వచ్చినప్పుడు వారాలకు వారాలుంటరు. ఉన్నదంతా అక్కలకే పెడుతుందని దేవ అనుమానం. ఊర్లేనే ఉంటుంది గదా! ఉన్నదంతా దేవకే పెడుతుందని అక్కల అనుమానం. మొగండ్లు ఎగేసిండ్రు. అత్తలు దిగేసిండ్రు. అక్క చెల్లెండ్లు ముగ్గురు శికెలు వట్టుకున్నరు.

బర్రె పెయ్య దగ్గర పంచాది ముదిరింది. గొంగి బర్రెను దేవ మలుపుకుంది. మాకూ పెయ్య దుడ్డెలను కొనియ్యిమన్నరు పెద్ద బిడ్డలు. వాళ్లకు చెరొకటి కొనిచ్చింది సాయమ్మ. యాడాది రెండేండ్లలో అవి కట్టి ఈనినయి. దేవది గొంగి పెయ్య మాత్రం కట్టలేదు ఈనలేదు.

అప్పుడే మళ్లీ బలబల సప్పుడయింది. సాయన్నను లేపింది సాయమ్మ.

గొడ్డు పెయ్యను ఇచ్చినవని దేవ లొల్లిచేసింది. ఇంకోటి కొనియ్యిమంది. చెల్లెకు ఇంకొకటి కొనిత్తే మాకూ కొనియ్యాలని అక్కలు అన్నరు. మాటా మాటా పెరిగింది. ఎవలకూ ఏదీ ఇచ్చేది లేదని సాయమ్మ కోపంగా చెప్పేసింది.

దేవను చేసుకుంటే ఇల్లు పొలమూ తమకే ఉంటదని ఆశపడ్డ దేవ అత్తగారికి సాయమ్మ తీరు నచ్చలేదు. ఇంటి మీదికచ్చి నానా యాగి చేసింద్రు. పెద్ద బిడ్డలిద్దరినీ బదునాం జేసింద్రు.

ఒకనాడు సాయన్నకు కడుపునొప్పి లేచింది. చూసిపోయిన దిక్కులేదు. ఒకనాడు సాయమ్మకు జరమచ్చింది. వాకిలి నూకిన మనిషిలేదు. బిడ్డలు అల్లుండ్లు రాకడపోకడ బందయింది.

సాయమ్మకు ఇప్పుడు అవన్నీ గుర్తుకత్తున్నయి. "ఎవలనేమంది.... ఎవలదేం తింటి...? ముగ్గురు బిడ్డలు ఆపతికి సంపతికి వాలుతరంటే పక్కల పాములైరి. పుట్టెడు పండుగ చేసుకుందట. నన్ను పిలువద్దా! వట్టిగ పోదునా..." అనుకుంది.

అప్పుడే మళ్లీ బలబల సప్పుడయింది. సాయన్నను లేపింది సాయమ్మ. లేపుతూ "మల్లన్న గుట్టలకు పోయినోళ్ళు వచ్చింద్రంటవా" అన్నది అరాతీత్తున్నట్టు.

ఇప్పుడు యాడత్తరు. తినితాగి ఏ తెల్లారంగనో వత్తరు. ఎక్కిపోయే మ్యాకను కొన్నరట. అయినా దయ్యం బియ్యం తింటేంది...? దక్కలోడు పాశం దింటేంది? నడిజాము రాత్రి గుయ్ గుయ్ మని తలిగినవు పండూ.." అన్నడు యాష్టగా.

అప్పటికి బలబల సప్పుడు ఎక్కువైంది "ఏం పంటవులేవ్వు...సప్పుడైతుంది. కుప్పను గుర్రాలకు వెట్టి నిద్రపోతవా...?" అంటూ బయటకచ్చింది సాయమ్మ. ఆమె వెంటనే బయటకచ్చిండు సాయన్న, వచ్చింది గొంగి బర్రెనే అని ఇద్దరూ గుర్తు వట్టిండ్రు.

సాయన్న బర్రెను అదిలించిండు. బయటకు తోలాలని చూసిండు. వద్దని సాయమ్మనే ఆపింది.

ఈ సారి బర్రె పెద్ద మడిలో కనిపించింది. చేనులో అనుపకాయ ఎక్కడన్నా బలంగా ఉందా అంటే అది పెద్దమడిలోనే. సాయన్న పాణం గిలగిల కొట్టుకుంది. కోపంతో కట్టెను అందుకున్నడు. పండ్లు కొరుక్కుంట ఉరికిండు. అతన్ని ఆగుమంటూ ఎంట నడిచింది సాయమ్మ. సాయన్న అందకుండా ముందుకు నడిచిండు.

అది మాగమాస శివరాత్రి సందు. సలి తగ్గినా ఇగం పెడుతుంది. సాయమ్మ నెత్తి సుట్టూ కొంగునుకప్పుకుంటూ "తిక్కలోడు పుసపుస రెండు దెబ్బలేసినా ఏత్తడు" అనుకుంట దబదబ నడిచింది.

మసక ఎన్నెల్లో గొంగి బర్రె బస్స బస్స మసులుతుంది. అనుపపొదల్ని తొక్కుతుంది. ఆయాసంతో ఎగపోత్తంది.

సాయన్న బర్రెను అదిలించిండు. బయటకు తోలాలని చూసిండు. వద్దని సాయమ్మనే ఆపింది. అది నొప్పులు దీత్తందని గ్రహించి రొండ్లను పునికి చూసింది. మక్కుల్ని నొక్కి చూసింది. మక్కులల్ల బొక్కలు తేలినయి. సాయమ్మకు జల్లుమంది.

"అరే... రొండ్లు గుంజినయి. మక్కులు జారినయి. తోక లావట్టి తినుకుతుంది. తీగేలు చిక్కవడ్డయి. ఈ రాత్రే ఈనేతట్టుంది." సాయమ్మ భయంగా అన్నది.

సాయన్నకు కోపమచ్చింది.

"ఈననీ ఈనకపోని గంగల గలువని. మనకెందుకు? చేన్ల నుంచి ఎల్లగొడుదాం." అదిలిస్తూ అన్నడు సాయన్న,

సాయన్నను కోపంగా చూస్తూ “ఈతకు తయారున్న బర్రెను ఎల్లగొడుతవా..? అక్కడ ఎవలూ లేకనేపోయిరి. ఈ రాత్రి ఎటుపోతది ఎక్కడ ఈనుతది? ఇది పుట్టినప్పుడు ఎంత కష్టమైంది ఎరికే గదా! దీని తల్లికి గుడ్లమాయి బయిటికత్తే బద్దలేసి కట్టినం యాదికుందా? దీనికిది తొలుసూరు కానుపేనాయె. ఎంత కష్టమైతదో” అన్నది సాయమ్మ

అది ఆయాసంతో తిరుగుతుంటే ఆమెలో తల్లిపేగు కదులుతుంది. ఏదో మత్తు ఆమెను కమ్ముకుంది.

సాయన్న ఒంటికాలు మీద లేచిండు. “ఏంది...? నువ్వు ఈత జేత్తవా...? వచ్చిన మాట సాలదా... చేను నాశినమైతంది. ఒక్క కాయ చేతికిరాదు. ఎల్లగొట్టు...” అన్నడు.

సాయమ్మ ఏదీ గమనించడంలేదు. బర్రెనే చూస్తుంది. దాని స్థితినే అంచనా వేస్తుంది. అది ఆయాసంతో తిరుగుతుంటే ఆమెలో తల్లిపేగు కదులుతుంది. ఏదో మత్తు ఆమెను కమ్ముకుంది.

“నీ కాయ సల్లగుండ. పోతెపోని తియ్యి. పొద పొత్రం జారుతుంది. గంటలనో అరగంటలనో ఈనుతది. నా ముగ్గురి బిడ్డలతోని దీని మాయిముంత గూడ నాయింట్లనే ఉంది. ఎట్ల ఎల్లగొడుత. నీళ్ళు కాగవెట్టుపో” అన్నది.

సాయన్నకు కోపమచ్చింది. అయినా తమాయించుకున్నడు. సాయమ్మను ఒప్పిస్తున్నట్టు “గడ్డి గాడుపుల పోతేంది...? వడ్లు వాగుల పోతేంది. గాలికివొయ్యే కంపను గోసికి పెట్టుకున్నట్టు ఈ కతేంది, దుకాణమేంది..? ఈ బర్రె సాలు మంచిదిగాదు. కట్టపు కానుపు. అప్పుడు దీనితోనే సిచ్చువుట్టింది. ఇప్పుడు కానుపుల ఏమన్నా అయిందనుకో. మల్లా సిచ్చువుడుతది. మెల్లగ ఎనుగు దాటిద్దాం. పానాదెక్కిచ్చి పల్లెకు మలుపుదాం” అన్నడు.

సాయమ్మ భర్తను ఈసడింపుగా చూసి “పుట్టు నొప్పుల కుట్లు నీకేం తెలుసు. ఇయ్యపురాలు తిట్టిందని, అల్లుడు అలిగిండని బిడ్డను కానుపుకు తీసుకరాక ఊకున్నమా? వాళ్ళ మొఖం ఎవలు జూసిండ్రు. బర్రె మొఖం జూడు. బిడ్డ తల్లడిత్తంది. ఇది గూడా పురుడుకు తల్లిగారింటికే వచ్చింది” అన్నది.

బర్రె ఆయాసంతో కాళ్ళను రాస్తుంది. నీరసంగా కూలబడి లేస్తుంది.

తల పైకెత్తి అరుస్తుంది. పోటుమీదున్న సముద్రం లెక్క కల్లోలంగా కదులుతుంది. మంత్రిచ్చినట్టు సాయమ్మ బర్రె చుట్టే తిరుగుతుంది. ఆయాసంతో ఉన్న బర్రె పశువులా కాక కడుపుతో ఉన్న బిడ్డలెక్కనే కనిపిస్తోంది.

> అతని కంటే ముందుగనే ఇంట్లకు నడిచింది సాయమ్మ. పొయ్యి రాజేసి నీళ్ళు వెట్టింది. కంకెడన్ని ఎల్లిగడ్డలు దంచి ముద్దజేసింది.

సాయన్నకు మాత్రం అసహనంగా ఉంది. కోపంగా కూడా ఉంది. అది తొక్కుతున్న అనుపచేను పొదలే కనిపిస్తున్నయి. ఆమెతో వాదానికి దిగుతూ "సూడు... ఇది తొలుసూరికానుపు. ఏమైతదో తెలువది. ఏదన్నా కిందిమీదైతే మనమే చేసినమని బదునామత్తది. మనను ఉంచనన్నా ఉంచరు. సంపనే సంపుతరు." అన్నడు.

సాయమ్మ కోపంగా చూసింది. "నీ బుద్ధుంటే నాతో ఉండు. లేకుంటే మలుసుక పండు. అంతే గనీ నోటికచ్చింది ఒర్రకు. బర్రెను ఆగం జెయ్యకు." అన్నది రొండ్లు తీడుతూ.

సాయన్న బుస్సుమన్నడు. చేతుల కట్టె నాలెకు గొట్టిండు. "యాడనన్న అగ్గిదలుగు... లంజె...ఆరునెల్ల పంట అగ్గిల వెట్టవడితివి. రేపు ఏదన్నయితే లోపల కత్తిపెట్టి చీరుతరు. అప్పుడు ఆయిమంటది పాణం" అని కోపంగా ఇంట్లకు నడిచిండు.

అతని కంటే ముందుగనే ఇంట్లకు నడిచింది సాయమ్మ. పొయ్యి రాజేసి నీళ్ళు వెట్టింది. కంకెడన్ని ఎల్లిగడ్డలు దంచి ముద్దజేసింది. వరి, గోధుమ, మినుపపిండిలను కలిపి నానవెట్టింది. సందెడు ఎండు గడ్డి తెచ్చి బర్రె ముందు ఏసింది.

ఏన్నీల నడినెత్తి మీదికచ్చింది. ఆయాసంతో బర్రె ఒర్రుతుంది. తినుకుతుంది. తల్లడిత్తుంది. నడ్డి ఇరుత్తుంది. పండుకుంట లేత్తుంది దాని సూత్తుంటే సాయమ్మ కండ్లల్ల నీళ్ళు తిరిగినయి.

"ఆడిజన్మ పాడుగానూ... ఆడిజన్మ పాడు జన్మ బిడ్డా.... అన్నీ మనకేనాయె...

జరంత ఓర్సుకో... ఇంకొంతసెపైతే అయిపాయె. కానుపంటె వట్టిదా...? సచ్చి పుట్టినట్టు..” అన్నది బఱ్రెను పునుకుతూ.

బఱ్రె మసులుతునే ఉంది. అరగంట... గంట... రెండు గంటలయింది. తీగలు పుడుతునే ఉన్నయిగనీ పొడ పొత్రం మాత్రం రాలుత లేదు.

ఇట్ల అనుకుందో లేదో... అట్ల టప్పుమని సప్పుడు. ఉల్కిపడ్డది సాయమ్మ.

సాయమ్మకు భయం మొదలయింది. సాయన్న మాటలు గుర్తుకచ్చినయి. “అరే..ఇవారకు పొడపొత్రం జారి ఈనేదుండె. పిండం గిట్ల ఎదురుతిరిగిందా ఏంది....?” అనుకుంది. ఈ ఆలోచన రాంగనే సల్ల చెముటలు పుట్టినయి.

పోయి సాయన్నను లేపుదామా అనుకుంది. లేపితే ఇప్పుడు గూడా బఱ్రెను ఎటో తోలి చేతులు దులుపుకుంటడనుకుని మానుకుంది.

అప్పటికి చలి ఎక్కువయింది. ఏన్నీల వంగింది. ఆగి ఆగి గుడ్లగూబ అరుపు. కుక్కలు మొరుగుతున్నయి. చీమ చిటుక్కుమన్నా వినిపించే నిశ్శబ్దం. బఱ్రె మసులుతుంది. తల్లడిత్తంది.

సాయమ్మ బఱ్రె ముందు గొగ్గాల్ల మీద కూసుంది. తన మూడు కానుపులు... కానుపు కానుపుకు పడ్డ కష్టం...తాంబోలం సప్పుడు, తుడుము దెబ్బలు యాదికత్తున్నయి.

“పరమాత్మా... ఎంతపనైపాయె. పిండెం అడ్డందిరిగితే బఱ్రె బతుకది. నా బిడ్డ మంచిదన్నాగాదు. కావాలని నేనే సంపిన్నని బదునాం జేత్తది. మైసవ్వ తల్లి... ఎట్లనన్న గడ్డకు వడెయ్యి బాంచెను” అనుకుంది భయంగా.

ఇట్ల అనుకుందో లేదో... అట్ల టప్పుమని సప్పుడు. ఉల్కిపడ్డది సాయమ్మ. తెల్లగా బుగ్గలా వచ్చిన పొడపొత్రం తోకకిందినుంచి కొద్దిగా జారిపగిలిపోయింది. సాయమ్మకు కొద్దిగా భయం తగ్గింది. దబదబ రెండు చేతులకు ఆందెం రాసుకుంటూ “ఈ మనిషి వచ్చుగద మంచిగుండు. తొలుసూరు కానుపాయె. ఒకలకొకలం దీము.” అనుకుంది.

వెంటనే ‘పాపపు మనిషి. నేను ఆపతి పడ్డనాడే ఇంట్లలేడు. పాసువలుగ తిని మంచె మీద వన్నడు. ఇప్పుడు వత్తడా’ అనుకుంది.

మట్టును చూసి సాయమ్మ పాణం దస్సుమంది. కాళ్ళుకడుపుల జొచ్చినయి. మట్టు కర్రెగా కమిలి పోయినట్టుంది.

తల్లడిచ్చి తల్లడిచ్చి బర్రె కూలవడ్డది. తల్లడిచ్చిన తల్లికి, ఈలోకానికి రెండు కాళ్ళు ముడిసి దండం పెడుతూ సంటిదుడ్డె బయట కచ్చింది. బర్రె వరిగడ్డిలో సదురుకుంది. సాయమ్మ కండ్లు మెరిసినయి.

"సూసినవా... తల్లడిచ్చుకుంటనే తల్లి పిల్ల కొరకు దేవులాడుతుంది. నిలవడి ఈనితే పిల్లకు దెబ్బతాకుతదని గడ్డిల పన్నది". అనుకుంటూ అందెం రాసిన చేతులతో దుడ్డెను సాగదీత్తంది. వొర్రుతున్న బర్రెను పునుకుతుంది.

పదినిమిషాలల్ల దుడ్డె బయటకచ్చింది. ఇట్లా దుడ్డె కిందపడ్డదో లేదో అట్లా ఎనక్కి తిరిగింది బర్రె. నొప్పి అయాసంతో ఎగపోత్తూనే దుద్దె ముక్కు మీదున్న ముర్రును నాకింది. డెక్కలు కొరికింది.

సాయమ్మ ముచ్చటపడి తల్లి, బిడ్డనే సూస్తుంది. "సూసినవా దీని ఆరాటం పాడుగాను ముక్కు మీద ముర్రుంటే దుడ్డెకు దమ్ముతియ్యరాదు. డెక్కలు కొరుకకపోతే నడువరాదు. పెయ్యినాకకపోతే దుడ్డె గట్టివారది. ఎవలు చెప్పింర్రే అవ్వా... నీకు" మురిపెంగా అనుకుంది సాయమ్మ.

వెంటనే "నా పిచ్చిగనీ తల్లికి ఒకలు చెప్పాలెనా... బిడ్డలు వట్టిగనే పెరుగుతరా... ఎన్ని కతలు ఎల్లదియ్యాలె. నా బిడ్డలంటే మొగులు మీదినుంచి రాలిపడిరి" అనుకుంది.

బర్రె ఆరాటంగా దుడ్డెను నాకుతనే ఉంది. పెయ్యి మీద ముర్రు ఆరితే దుడ్డె ఎదుగది. అది తెలిసినట్టు ముక్కుమూతి, కండ్లు చెవులు పట్టి పట్టి నాకి శుభ్రం చేస్తుంది. నాకుతూ నాకుతూనే మట్టును కుమ్మరిత్తంది.

మట్టును చూసి సాయమ్మ పాణం దస్సుమంది. కాళ్ళుకడుపుల జొచ్చినయి. మట్టు కర్రెగా కమిలి పోయినట్టుంది. ఎన్నీల నాలుకు వంగి చూసింది. అనుమానం లేదు. వాసనలో కూడా తేడా ఉంది.

వామ్మో...మట్టు కమిలిపోయింది. మట్టు కమిలిపోతే మాయివడది. మాయి వడకపోతే బర్రె బతుకది. పిండం బయటకచ్చుడు ఒకెత్తయితే మాయి వడుదు

మరో ఎత్తు. సల్లగ గడ్డకు వద్దదనుకుంటే ఇట్ల గావట్టె" అని ఇంట్లకు ఉరికింది.

పిండిల ఎల్లిగడ్డ ఉడుకు నీళ్ళు కలిపి బర్రె ముందుంచింది. తుఫాను తర్వాత సముద్రంలా ఉంది బర్రె. తనలోకమంతా దుడ్డెనే అన్నట్టు దానినే సూత్తంది. ఆయాసమంత మరిచి నాకుతుంది. నాకుతూ రెండు బుక్కల పిండి తాగి నీరసంగా పండుకుంది.

తొలుసూరి కానుపు. పొదుగు నిండుగా ఉన్నా మొనల్లో దార సాగలేదు. తడిచేసి సన్నుల్ని సాగదీసింది సాయమ్మ.

బర్రె పడుకోంగనే సాయమ్మ బయం మరింత ఎక్కువయింది. "ఈనినంక మాయిపడే దాక బర్రె నిలవడాలె. పండుకొంటె మాయికి బదులు గుడ్లమాయి ఎల్లుతది. గుడ్లమాయి ఎల్లిందంటే బర్రె గుడ్డు మగ్గినట్టె... ఎంత కర్మకచ్చే... మనుసులనేగాదు, పశువులను గూడా కానుపుకు దవాఖాన్లకు తీసుకపోయే కాలమచ్చే..." అనుకుని బర్రెను లేపింది సాయమ్మ.

ఆయాసంగా లేచిన బర్రె రెండు బుక్కల కుడిది దాగి దుడ్డెనే నాకుతుంది. నాకుతూ నాకుతూ బలబలమని మరింత మట్టు పోసింది. ఆమె బయాన్ని మరింత పెంచుతూ మట్టు గబ్బు వాసనగొట్టింది.

"నీ నాకుడు సల్లగుండ. ఉడుకుడుకుది నాలుగు బుక్కల కుడిది తాగు. ఆసరుంటది. నాకినకాడికిసాలు" అని దుడ్డెను పొదుగు దగ్గరికి తెచ్చింది సాయమ్మ.

తొలుసూరి కానుపు. పొదుగు నిండుగా ఉన్నా మొనల్లో దార సాగలేదు. తడిచేసి సన్నుల్ని సాగదీసింది సాయమ్మ. ముర్రుపాలు తాగితేనే దుడ్డె బతుకుతది. ముర్రుపాలు ఎంత తాగితే అంత గట్టి పడుతది దుడ్డె.

సన్నును సాగదీసి సంటి దుడ్డె నోటికి అందిచ్చింది సాయమ్మ. దుడ్డె పతుకు లాడుతుంది. మూతితో ఎక్కడెక్కడో తడుముతుంది. నిలబడలేక కులవడుతుంది. రొమ్మును అందుకోలేక పోతుంది.

కొంతసేపు మాయిని, భయాన్ని మరిచిపోయింది సాయమ్మ, దుడ్డెను ఎత్తి తన గుండెకు అదిమిపట్టుకుంది. దాని మూతిని సాగదీసి రొమ్మును

నోట్లెపిండింది. దుడ్డె పతుకులాటను, సాయమ్మ ఆలోచనను అర్థం చేసుకున్నట్టు బఱ్రె ఎనుక కాళ్లను దూరంగా జరిపింది. పొదుగును దుడ్డెకు అందేటట్టు పంగటిచ్చి వంగి నిలవడ్డది.

కాని బఱ్రె దూరం జరుగలేదు. దుడ్డెకు మరింత దగ్గరగా జరిగి వంగి పొదుగును మూతికి అందించింది.

“ఇదీ... తల్లి. ఇంత నొప్పులల్ల గూడా బిడ్డకోసం దేవులాడుతుంది. దీన్ని తల్లిని జేసిన దున్నపోతు నా మొగని లెక్కయాడ గుఱ్రుకొడుతుందో గని బిడ్డను సాది సవరిచ్చడానికి తల్లి ఎన్ని నొప్పులు దియ్యాలె..... ఎన్ని ఇద్దెలు నేర్వాలే “ అనుకుని పాలు పడుతుంది. సాయమ్మ.

బాలెంత బఱ్రె ఎంత పశువైనా పెయ్యి పచ్చిపుండయితది. దుడ్డె నోట్లెకు ముఱ్రుపాలు పిండుతుంటే రొమ్ములు పగిలినయి. రక్తం కారుతుంది. పాలను రక్తాన్ని చూడంగనే తన పెద్ద బిడ్డ పుట్టినప్పటి సంగతి యాదికిచ్చింది సాయమ్మకు. అప్పుడు పాలు పడ్డయిగనీ సన్ను ముక్కుకు రంధ్రాలు పడలేదు. మంచం నులుక సందుల్లోంచి పాలను పిండింది. రొమ్ములు పగిలి రక్తం కారింది. ఆ బాధ ఇప్పుడు మతిలకచ్చి కండ్లల్ల నీళ్లు తిరిగినయి.

“ నీ దుడ్డె పాడుగాను. బతికితే బతుకుతది. సత్తె సత్తది. బోరెమోలె మొగుడు వోంగ బొంత శింపులకు ఏడిసినట్టు దాని పానమే పోతుంది. ఇదోలెక్కనా.... రక్తాలు గారుతున్నయి. ఏం పిండుడు పాడైంది” అనుకుని దుడ్డెను దూరంగా జరిపి లేచింది.

కాని బఱ్రె దూరం జరుగలేదు. దుడ్డెకు మరింత దగ్గరగా జరిగి వంగి పొదుగును మూతికి అందించింది. పాలరుచి రక్తం రుచి తెలువని సంటిదుడ్డె ఆకలి ఒక్కటే తెలిసినట్టు తల్లి పొదుగు మీదికి ఎగవడ్డది.

పెయ్యి పుండయినా, రొమ్ము పచ్చలైనా పాలు రక్తం కలిసి పారుతున్నా ఆయాసాన్ని ఉగ్గవట్టుకుని నిలవడ్డది బఱ్రె. ఎక్కడ ముఱ్రు మిగిలిందో వాసనపట్టి మెడను సాగదీసి దుడ్డెను నాకుతుంది. దగ్గరికి పొదుముకుంటుంది.

తనను తాను మరిచి బఱ్రెను దుడ్డెనే సూస్తుంది సాయమ్మ. తల్లి బిడ్డల

తండ్లాటను చూస్తుంటే ఆమె పేగు కదిలింది. రొమ్ములు బరువెక్కినయి. సేపులచ్చినట్టు సలపరింత మొదలయింది.

కొంగును బిగగట్టుకుని ఉడుకు నీళ్ళతో బర్రెను కడిగింది సాయమ్మ. ఎల్లిగడ్డ నూనెను పెయ్యంత రాసింది. బర్రెను ముందుకు నడిపించి సందెడు వరిగడ్డి ఏసింది. పచ్చటి అనుపచెట్లను నాలుగుపీకి నోటికందించింది. రెండుసార్లు కుడిది పట్టింది.

రాత్రి సాగుతుంది. ఎన్నీల మసుక బారింది. చిమ్మట్ల రోద ఎక్కువయింది. పోసే మట్టు పొత్తనే ఉందిగాని మాయి మాత్రం రాలేదు.

దుడ్డె సొలుగుతుంది. సొలుగుతూనే పొదుగు మీదికి ఎగువడుతుంది. గడ్డిపోసల్ని నములుతూ నములుతూ ఆయాసాన్ని బిగువట్టుకుని బర్రె పొదుగును అందిస్తుంది. దుడ్డె ఆరాటాన్ని బర్రె ఆయాసాన్ని చూసి "అందుకే అంటరేమో.. బిడ్డరాయి తల్లిలక్క" అని అనుకుంది సాయమ్మ.

అరగంట...గంటగడిచింది. ముర్రుపాలు తాగి దుడ్డె మలుసుకుపన్నది. దుడ్డెను ముందటేసుకుని బర్రె నాకుతుంది.

రాత్రి సాగుతుంది. ఎన్నీల మసుక బారింది. చిమ్మట్ల రోద ఎక్కువయింది. పోసే మట్టు పొత్తనే ఉందిగాని మాయి మాత్రం రాలేదు. లెక్కలేని దేవుండ్లకు ఎదురు మొక్కులు మొక్కింది సాయమ్మ. అయినా మాయిపడలేదు.

అంతవరకు సోపతున్న ఎన్నీల్ల గూకింది. చీకటినిండింది. అది బర్రె జీవితంల చీకటే అనుకుంది సాయమ్మ. నోట్లెతడి ఆరింది. బయంగా సుక్కలను చూసింది. నడిజాము దాటినట్టు పట్టె మంచం వంగింది.

"ఎంత పాపానికచ్చే...ఆయిన అన్నట్టే గావట్టె. ఎట్లగతి" అనుకుంది సాయమ్మ.

నాలుగు కట్టెల్ని దగ్గరేసి మంట పెట్టింది. మంట అడుగున అనుపకాయ మాడి పురిటివాసనల కలిసిపోతున్నది.

మంట వెలుగులో ఇప్పటి కంటే స్పష్టంగా కనపడుతుంది బర్రె. దాని కండ్లల్లో ఇప్పుడు ఇంకో ఆయాసం కనవడుతుంది. అది పురిటి నొప్పులది

కాదని తెలిసిపోతనే ఉంది. కడుపుల మాయి ఉండజుట్టి ఎదురు బొొచ్చెల తంతే వచ్చే ఆయాసం అది. ఆ ఆయాసమేదో తనకే ఉన్నట్టు తల్లడిచ్చింది సాయమ్మ.

పొంటెజామయింది. బర్రె తల్లడిత్తుంది. కొట్టుకుంటుంది. ఇంటి మీద గుడ్లగూబ "గుగ్గూ గుప్" అంటంది. బర్రె మీద గబ్బిలాలు తిరుగుతున్నయి. బర్రె వొర్రుడు మొదలుపెట్టింది. కట్టెలమంట ఆరి చీకటి నిండుకున్నది.

అసలే నిద్రమబ్బు. ఆ మీద కోపం. సాయన్నకు తిక్కవుట్టింది. సాయమ్మ చేతుల నుండి గొడ్డలి గుంజకుని బూతులు తిట్టుకుంట అడివికి పోయిండు.

సాయమ్మకు ఏడుపచ్చింది. రేపు ఎవలో ఏదో అంటరన్న భయంకంటే బర్రెను దాని ఆయాసాన్ని చూస్తెనే కండ్ల నీళ్లుగారుతున్నయి. ఏడ్సుకుంటనే ఇంట్లకు పోయింది. గొడ్డలి అందుకుంది. సాయన్నను లేపి గొడ్డలి చేతికిచ్చింది. బూరుగుచెక్కను ఉప్పి చెక్కను కొట్టుకురమ్మంది.

నిద్రలేచిన సాయన్న చెక్క పేరు వినంగనే ఉలిక్కిపడ్డడు. కోపంగా "నీకు పిచ్చిలేసిందాయె. మాయిపడకపోతే ఇప్పుడేం సావది. తెల్లారినంక నలుగురిని పిలుద్దాం. సురుకులు పెడుదాం. అప్పటికి పడేనంటే పడుతది. లేకుంటే లేదు. మనమీదికి బదునాం రాదు. ఇప్పుడు చెక్క పోసినమనుకో. పడేనంటే పడుతది. లేకుంటే గంటల సచ్చిపోతది. అప్పుడు బదునాం మనమీదికత్తది." అన్నడు.

సాయమ్మ వినలేదు. కోపంగా "నీదేం నొత్తంది. నొప్పులు తీసినోనివా... పిల్లల్ని కన్నోనివా. తెల్లారనట తెల్లారని. అది తల్లడిత్తంది తీసుకురాపో..." అన్నది.

సాయన్న ఏదో చెప్పబోయిండు సాయమ్మ చెప్పనియ్యలేదు. "అవన్ని చెప్పకు. జెప్పన తెత్తవా నేను తెచ్చుకోవన్నా..." అని అతని సమాధానం కోసం చూడకుండా బయటకు నడిచింది.

అసలే నిద్రమబ్బు. ఆ మీద కోపం. సాయన్నకు తిక్కవుట్టింది. సాయమ్మ చేతులనుండి గొడ్డలి గుంజుకుని బూతులు తిట్టుకుంట అడివికి పోయిండు. బర్రె కొట్టుకుంటుంది. బర్రెను చూసి సాయమ్మ కొట్టుకుంటుంది. అనుపచేను పడుగు పడుగయింది.

సాయన్న చెక్క తెచ్చేసరికి సాయమ్మ జాజును, గంజిని కలిపి పెట్టింది. దానిని చూసి మరింత బయపడ్డడు సాయన్న, వద్దే వద్దన్నడు. బర్రెను సంపుతవా? అన్నడు. బదునాంగాకుమన్నడు. ఇది తాగితే బర్రె పిడాత సత్తదన్నడు.

సాయమ్మ వినలేదు. ఒర్రుతున్న బర్రె అయాసమే కండ్లముందు కదిలింది. ఏదో మత్తులో ఉన్నట్టు చెక్కలను దంచి జాజుల కలిపింది.

> తల్లి ఆయాసం సంటిదుడ్డెకు తెలువది. పొదుగు మీదికి ఎగవడ్డది. బిడ్డ ఆకలి తల్లికి తెలుసు. ఆయాసంలోనూ రొమ్ము అందించింది.

సాయన్న మొత్తుకుంటనే ఉన్నడు. వద్దంటనే ఉన్నడు. సాయమ్మ గొట్టంతో మందు బర్రెకు పోసింది. మందుకడుపుల వడంగనే వొర్రుతున్న బర్రె కూలవడ్డది. మెడలు సాపింది. కండ్లు తేలేసింది. గుడ్లు నిలేసింది. నాలుగు కాళ్లను సాగదీసి నిర్రదొక్కింది. కడుపు ఉబ్బి ఎగపోత మొదలయింది.

పొయ్యంగ పోసింది గనీ సాయమ్మ గుండెల రాయివడ్డది. సుట్టూ కమ్ముకున్న చీకటి, చిమ్మట్లరోద, కుక్కల అరుపు. సాయమ్మ బయాన్ని ఎక్కువ చేసింది. గజ గజ వణికి కులవడ్డది.

సాయన్న మంటను ఎగేసి బర్రెను చూసిండు. చెవులు ఇరిసిండు. తోకమట్టను గుంజిండు. దవుడలు పాపి చెతులు పెట్టి నాలికను తడిమిండు. నాలిక ఉబ్బి చేతులల్ల ఇముడలేదు.

“లంజే... వద్దంటే ఇనకపోతివి. ఉచ్చెతార్థంగ బర్రెను సంపితివి. రేపు వాళ్లు అడిగితే ఏంజెప్పుతవు. కడేబజార్ల నిలవెట్టి..” బూతు అందుకున్నడు సాయన్న.

తల్లి ఆయాసం సంటిదుడ్డెకు తెలువది. పొదుగు మీదికి ఎగవడ్డది. బిడ్డ ఆకలి తల్లికి తెలుసు. ఆయాసంలోనూ రొమ్ము అందించింది. దుడ్డెను గుంజుదామని బర్రె దగ్గరకి పోయింది సాయమ్మ. బుడుగ్గుమని చిన్నగ సప్పుడయింది. ఆశగా తోకకింద చేయిపెట్టి చూసింది. సాయమ్మ చేతికి మెత్తగా సల్లగా తలిగింది.

సాయమ్మకు పోయిన పానం లేసివచ్చినట్టయింది. “ఏ మాయి వడుతుంది. మాయి వడుతుంది” అన్నది చిన్న పిల్లలెక్క.

సాయన్న ఉలిక్కిపడ్డడు. కొర్రాయి అందుకచ్చి చూసిండు. సరిగ్గా కనిపించలేదు. "నీ యవ్వ మాయి వడుతుందా... గుడ్ల మాయివడుతుందా....? బర్రెను లేపు... లేపు..." అన్నడు ఆగమాగా.

సాయన్న బర్రెను లేపిండు. దుడ్డెను ఎత్తుకొని ముందటనడిచిండు. దుడ్డె వాసనను పసిగట్టి నిలదొక్కుకుని నడుత్తంది బర్రె.

ఇద్దరు కలిసి బర్రెను లావట్టింద్రు. నిలవెట్టింద్రు. దుడ్డెను దూరం జరిపింద్రు. బర్రె నిద్రదొక్కి ఒక్క తినుకుడు తినికింది. బదుగ్గుమని తట్టెడు మాయి కిందికి రాలింది.

ఊపిరి ఉగ్గవట్టుకున్న సాయమ్మ గట్టిగా దమ్ము తీసి వదిలింది. సాయన్నకు గూడా బయం పోయింది. మాయిని పొక్కల పాతిపెట్టిండు.

సాయమ్మ సంబూరానికి పట్ట పగ్గాలు లేవు. ఉడుకు నీళ్లతో బర్రెను కడిగింది. ఎల్లిగడ్డ రాసింది. ఈ ఆగంలో వాళ్లు సూడలేదు గానీ.... ఎనుగు దుంకిన నాలుగు ఎడ్లు అనుపచేను కలే తిరిగినయి.

అప్పటకి బల బల తెల్లారుతుంది. పిట్టలు పీసు పీసుమంటున్నయి. ముర్రుపాలు తాగిన దుడ్డె గంతులేస్తుంది. బిడ్డ గంతులను చూసి బర్రె మురిసిపోతుంది. పెయ్య దుడ్డె పుట్టిందని సాయమ్మ మురిసిపోతుంది. రద్దిబద్ది తప్పిందని సాయన్న మురిసిపోతుండు.

గుట్టతీర్థం నుంచి తిని తాగి తెల్లారేముందు ఇంటికచ్చిన దేవ బర్రెకోసం మొగన్ని గెదిమింది. శంకరి తిరుక్కుంట తిరుక్కుంట అనుపచేను అంచుకచ్చి నిలవడ్డాడు.

"అగో... శంకరి వచ్చిండు. బర్రెను కొట్టియ్యి..." భర్తతో అన్నది సాయమ్మ.

సాయన్న బర్రెను లేపిండు. దుడ్డెను ఎత్తుకొని ముందటనడిచిండు. దుడ్డె వాసనను పసిగట్టి నిలదొక్కుకుని నడుత్తంది బర్రె. దాని కండ్లల్ల దుడ్డె రూపమే నిండుకుంది.

తెప్పలల్ల ఎక్కడనో తేలుతున్న గద్దను పసిగట్టిన తల్లికోడి వాకిట్ల తిరుగుతున్న పిల్లలను రెప్పల కింద దాసుకుంది. దుడ్డె వెంట బర్రె ఒర్రుకుంట నడుస్తోంది.

సాయమ్మ తల్లికోడిని తల్లి బర్రెను మార్చి చూసింది. ఆమె కండ్లల్ల నీళ్లు తిరిగినయి. తనూ బర్రె ఎంటనడిచింది.

సాయన్న దుడ్డెను శంకరి చేతుల పెట్టిండు. శంకరి దుడ్డెను అందుకోంగనే పెయ్యదా పోతుదా అని తోక ఎత్తి చూసిండు. చూసి నవ్వుకుంట దారి వట్టిండు. తల్లి బర్రె శంకరి ఎంట "వ్రాయ్..." మని పిలుసుకుంట నడుత్తంది.

సాయమ్మ గుండె కరిగింది. శంకరికి ఎదురునడిచి "శంకరీ...దేవ పాణమెట్లుంది.. మందులు వాడుకుంటందా...?" అన్నది.

శంకరి పొడిపొడిగా సమాధానం చెప్పి ముందుకు నడిచిండు. అనుపచేనును దాటి శంకరి ఎంట వడ్డది బర్రె.

బర్రె తొక్కిన అనుపచేను అడివిల్లలున్న ఇల్లులెక్క అంగడంగడయింది. అక్కడనే ఆగి బర్రెను చూస్తూ "తొడుసు మాల్లోడు... బిడ్డ పుట్టిన్నాడు ఆడిపిల్ల పుట్టిందని అలిగిపోయిండు. ఇప్పుడు ఆడిదుడ్డె పుట్టిందని మురుత్తుండు" అనుకున్నది సాయమ్మ.

"చేను సత్తె నాశినమైపాయె...ఒక్కకాయ చేతుకిరాదు." అనుకున్నడు సాయన్న.

"తల్లి లెక్క బిడ్డ రాయంటరు. నిజమే. బర్రె జూసినవా.. దుడ్డె ఎంటపడి పోతంది. రెండు మూడు నెల్లాయె. దేవ మొఖం జూడక. బిడ్డె బరువు మనిషి. ఎట్లుండెనో... పొద్దులు నిండినంక తోలుక రావాలె. అత్తముండదేం పోతంది. ఆపది వడేదాక పనిజెప్పుతనే ఉంటది." అనుకుంది సాయమ్మ.

తన బిడ్డ మాయిముంతను తల్లిగారింట్ల పాతి గొంగి బర్రె బిడ్డను దేవులాడుకుంటూ సాగిపోతుంది.

*కస్తూరి ఆనందాచార్య స్మారక కథలపోటి 2006 లో ద్వితీయ బహుమతి పొందిన కథ. నవ్య వారపత్రిక 12-4-06*

మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# మాయిముంత - కథానిక



ఆచార్య ఏటూరు జ్యోతి
92484 14442

తెలంగాణ గ్రామీణ సంస్కృతికి ప్రతిబింబం 'మాయిముంత'. పెద్దింటి అశోక్ కుమార్ గారు రాసిన కథానికల్లో ఒకటి మాయిముంత. ఇది తెలంగాణ గ్రామీణ సంస్కృతికి ముఖ్యంగా పశువులకు ఆ కుటుంబ సభ్యులకు మధ్యగల అనుబంధాన్ని ఆవిష్కరించిన కథ.



ఈ కథానికలో సాయమ్మ, సాయన్న భార్య భర్తలు. వీరికి ముగ్గురు ఆడబిడ్డలు. మొదటి ఇద్దర్ని తెలంగాణలో కొంత దూరపు ప్రాంతాల్లోనే పెళ్లి సంబంధాలు చూసి పెళ్ళిల్లు చేశారు. చిన్న కుమార్తెను పిలిస్తే పలుకుతుంది. ఇరుకు, ఇబ్బందికి తోడ్పడుతుందనే ఉద్దేశంతోనే ఉన్న ఊరిలోనే ఇచ్చి పెళ్లి చేశారు. కుమార్తె ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని ఒక గేదెను కూడా తోలిచ్చారు. ముందు ఇద్దరి బిడ్డలకు సైతం చెరి ఒక గేదెను ఇచ్చారు. అయితే వారి గేదెలు దూడలను (ఈనాయి) కన్నాయి. చిన్న కూతురు గెదె దూడను కనక పోవడంతో గొడ్డు బర్రెను ఇచ్చిందని అమ్మను దూషించింది. చిన్న బిడ్డ మొదటి కాన్పును పుట్టింట్లోనే పురుడుపోసుకోనింది. రెండేళ్ళ నుండి పుట్టింటి మొహం చూడలేదు.

అక్క వాళ్ళు పుట్టింటికొస్తే వారం, పది రోజులుండిపోతారు. ఉన్న ఆస్తినంతా వారు అనుభవిస్తున్నారనే అపోహతో భర్త, అత్త మాటలకు తాను వంతపాడుతూ అమ్మా నాన్నలతో బెద్దుగి ఉంది. తాను మరొక బిడ్డకు పురుడు

పోసుకోవడానికి సిద్ధంగా ఉన్నా, పంతంతో అత్తగారింట్లోనే బండ చాకిరి చేసుకుంటూ ఉండిపోయింది. తన బిడ్డ పుట్టెంట్రుకలకు తల్లిదండ్రులను మాటవరసకన్నా రమ్మని పిలువ లేదు.



తల్లి బిడ్డకోసం ఎంత కష్టపడి ఉన్నదాంట్లో ఇచ్చి సుఖంగా ఉండాలని తను తాహతుకు మించి కట్నమిచ్చి పెళ్లి చేసిన వారి అత్యాశ వలన మనశ్శాంతి లేకుండా పోయిందని, పైగా నిందలు వేసి ఆడిపోసుకున్నారని తల్లి సాయమ్మ బాధపడుతుంది. తన ఇంట్లోని గేదెను చిన్న కూతురికి పంపారు. అది రెండు సంవత్సరాలకు దూడను కనబోతాంది. అనుకోకుండా ఒకరోజు అర్ధరాత్రి తను అనూప చేలో పడి పది లేగలను తొక్కుకుంటూ రావడం వలన అలికడి అవ్వడంతో సాయమ్మ ఎవరిదో ఏద్దో, దొంగ బర్రె అనో భావించింది. కానీ భర్తను టార్చ్ లైట్ వేసి చూడమంటే చూడగా మొదట మడిలోనే బర్రె కనిపించింది. సాయమ్మ దాన్ని కొట్టి తరమడం కొరకు ముందుగా మట్టి పెల్లను విసిరేశాడు. అయినా అది కదలక పోవడంతో కట్టెను అందుకొని బర్రెమిదికి ఉరికిండు. ఆ వెన్నెల వెలుగులోనే సాయమ్మ బర్రెను గుర్తుపట్టి బర్రెను కొట్టబోతున్న భర్తను ఆపింది. ఆమెడ దూరంలో గోజా కనపడితే ఊరికురికి తరిమే సాయమ్మ తనను ఎందుకు ఆపిందో అర్థం కాలేదు. సాయమ్మకు అతడు అడిగేలోపే గొంతు తగ్గించి అది మన గొంగి బర్రెకదా! బర్రి వంగి కొమ్ములు కనబడుత లేవ్వా... అన్నది సాయమ్మ మరింత కోపంతో గొంగిదో... గోషిదో... తలకు వాసిన ఎంటిక ఏ రేవుల పోతే మనకేంది. అంటూ బర్రె కొంకుల మీద కొట్టిండు. ఆ దెబ్బకు నిండు గెండునట్టు రెండుడగులు ముందుకేసింది.

సాయమ్మ గుండెల్లో కలుపుమంది నీ పాడుగాను జరాగు. బర్రె సుడిమీది ఉంది. తెగలేస్తుంది కనబడత లేదా. అన్నది నిండుకుండ లెక్క కదులుతున్న

బర్రెను చూసినంక సాయి అన్న చేయి కిందికి దిగింది అయినా కోపం తగ్గలేదు నీ గతర్రను నా ఇల్లుకు సిచ్చు పెట్టినావు. చేసింది చాలదని మరిచినావా అన్నాడు కోపంగా......కానీ సాయమ్మకు కోపం లేదు బాధగా ఉంది. అప్పటికే బిడ్డ తిట్టుకుంటూ ఏడుస్తుంది. బర్రెను చూశాక ఆ ఏడుపు ఎక్కువైంది దాన్ని రోడ్డు మీద చేతులేసి తడ్వా. రేపు మాకు అన్నట్లు అల్లాడిత్తనవు. ఇప్పుడు దొంగ తిండి కావాలనా..... పొద్దున నిండిన్నె సక్కగా ఇంటికి పో అన్నది. ఈ వాక్యాల్లోని మాటలు పశువుకు దాని యజమానురాలకు మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రార్థించే మాటలు మనకు అర్థం అవుతున్నాయి. అర్ధరాత్రి వెన్నెలలోనే ఆమడ దూరం ఉండగానే దాని కొమ్ములను బట్టి అది తన ఇంటి పశువుని గుర్తించింది.



దాని నడుమును రందిగా చూసి అది ఈనబోతుందని, పేయి దగ్గర ఉన్న కనిపిస్తున్న స్థితిషాలను బట్టి అతి త్వరలో దూడను కనబబోతుందని గ్రహించింది. అర్ధరాత్రి దొంగగా తన చేనులో పడి తినడం దొంగ తిండి ఈనాటికి సిద్ధంగా ఉన్నప్పుడు ఇలా ఎవరి చేనులో పడితే వారు బడితే పూజ చేస్తారు. అందుకే ఆమె చక్కగా ఇంటికి పొమ్మని మనిషికి నీతులు చెప్పినట్లుగా ఆ బర్రెతో చెప్పడం సాయమ్మ హృదయాన్ని ఆవిష్కరించే మనస్తత్వంగా అర్థం చేసుకోవచ్చు.

చూసినావా గొడ్డు బర్రెను ఇచ్చినానని మీ అక్క తిట్టను తిట్టు తిడుతుంది. బిడ్డ సల్లగా ఉంటే, దాని బిడ్డ బుద్ధిమంతురాలు. అనరాన్ని మాటలనే నన్ను ఊరి పెట్టుకుని చావమనే, పంది సెన్నట్లు కన్నవాయే. ఇప్పుడు చూడు బర్రె ఈతకొచ్చే. మీదపడ్డ దెబ్బలు ఉంటాయని మాటలు పోతాయా అని బాధగా అన్నది సాయమ్మ.

ఈ మాటల ద్వారా తల్లి సాయం మనం బిడ్డ దూషించిన తీర్పు తల్లి హృదయం ఎలా తల్లడిల్లి పోతుందో వారి మనసుపై ఎలాంటి ముద్రణ వేస్తాయో వాస్తవికతకు నిదర్శనంగా నిలుస్తాయి. కోపంతోనో బాధతోనో

> బర్రె ఆయాసంతో తిరుగుతూ ఉంటే ఆమెలో తల్లి పేగు కదులుతుంది. ఎందుకంటే స్త్రీమూర్తికి బిడ్డ నొప్పులు ఎలా ఉంటాయో తెలుసు.

రెండు దెబ్బలు కొట్టిన వాడు నొప్పిని రోజులు గడిచే కొద్ది మరిచిపోవచ్చు కానీ మనసును బాధ పెట్టిన మాట దెబ్బలు అంత సులువుగా మర్చిపోలేమని సూత్రాన్ని ఈ సామెత ద్వారా అభివ్యక్తం చేసింది. ఇదంతా ఒక ఎత్తు అయితే అసలు ప్రధాన ఘట్టం ఈ బర్రెను సెను వరకు తోలి వచ్చినా కొద్దిసేపటికే మరల వచ్చి అనుప చేనులో పడి పాడు చేయడం, తన కొమ్ములతో తీగలను తెంపుతూ, నేలను పొడుస్తూ ఉన్నదిగా అలికిడికి సాయమ్మ మరల వచ్చి చూడడం మరో ఎత్తు.అది ఈనడానికి నొప్పులు పడుతుందని ఆమె గ్రహించింది ఒక వైపున భయపడుతూనే తొలిసూరు ఈత ఎలా ఇబ్బంది కలుగుతుందో ఆందోళనలతో సతమతమవుతూనే మరొకవైపు ఆమె బర్రెను చుట్టూ తిరుగుతూ దాని వీపు మీద చేత్తో తడుతూ ధైర్యాన్ని కలిగించింది.

బర్రె ఆయాసంతో తిరుగుతూ ఉంటే ఆమెలో తల్లి పేగు కదులుతుంది. ఎందుకంటే స్త్రీమూర్తికి బిడ్డ నొప్పులు ఎలా ఉంటాయో తెలుసు. తాను కడుపుతో ఉన్నప్పుడు పడిన సాధక బాధకాలు పశువులకు సైతం వర్తిస్తాయి. అందుకే ఈనబోతున్న గొడ్డును కొట్టవద్దని భర్త సాయన్నను ఆపింది. దాని చేష్టలు, ఆయాసంతో తిరగడం, పడుతూ, లేస్తూ జరుగుతున్న తీరు సాయమ్మకు అర్థం అవుతున్నాయి. అందుకే దానికి వేడి నీళ్లు పోయడానికి పొయ్యి మీద నీళ్లు పెట్టింది. బలం కోసం కంకిచొప్ప, తెల్లగడ్డలను దంచి ముద్ద చేసింది. వరి, గోధుమ, మినప పిండి కలిపి నానబెట్టింది. నీ కాయ చల్లగుండ పోతే పోనీ, పొదుగు మాత్రం జారుతుంది గంటలోనూ అరగంటలోనూ ఇనుతది. నా ముగ్గురు బిడ్డల తోటి దాని మాయమంత గూడ నా ఇంట్లోనే ఉంది. నిజానికి మన ఆడవాళ్లు కాన్పు జరిగిన తర్వాత వారి మాయిని జాగ్రత్తగా కుక్కలు తినకుండా పూడుస్తారు. అలాగే ఇండ్ల దొడ్లలో ఈనిన పశువుల మాయిలను సైతం కుక్కల బారిన పడకుండా జాగ్రత్తగా మూరెడు లోతు మట్టి తీసి పూడుస్తారు. పుడ్చే పద్ధతి ఒకప్పుడు మన గ్రామంలో మన సంస్కృతి సాంప్రదాయాల్లో పాటించేవారు మాయిని తింటే తిన్న దానికి జబ్బులు

సాయన్న వచ్చేసరికి జాజును, గంజిని కలిపి పెట్టింది. దీనిని నూనె మరింత భయపడి బర్రెకు పెట్టొద్దు అన్నాడు.

వస్తాయి. ఆరోగ్యం పాడవుతుందని గ్రామ పెద్దలు భావించి జాగ్రత్తలు వహిస్తారు. ఇక్కడ బర్రె కొద్దిసేపటికే దూడను కన్నది. కన్న వెంటనే దాని ముర్రును నాకుతూ ఉంది. అది నిలబడడానికి ప్రయత్నిస్తుంది. దాని గిట్టల గోర్లు కొరికి నిలబడేందుకు సాయపడింది.

పాల కోసం పాల పొదుపు కోసం బిడ్డ వెతుకుతుంది సాయమ్మ బర్రె రొమ్మును దూడకు అందించడం చేస్తుంది. పాలు రాకపోవడం రొమ్ములు చీకడం వలన రొమ్ముల నుండి రక్తం కారడం ఆ దూడకు పాలు రక్తం అని వ్యత్యాసం తెలియక తాగడానికి ప్రయత్నించినప్పుడు తనకు తన గతం గుర్తుకు రావడం, నోస్టాలజీని గుర్తుకు తెస్తుంది. తాను మొదటి సారి పురుడు పోసుకున్నప్పుడు తన రొమ్ములను మంచపు సందుల్లో ఉంచి పాలు పిండిన స్థితి, రక్తం కారిన తీరు గుర్తుకు వచ్చింది.

ఆ సమయంలో బిడ్డను కనడంలోనూ పాలు ఇవ్వడంలోనూ ఉండే బాధలు నొప్పులు కనే వారికి తెలుస్తాయి కానీ మగవారికి ముఖ్యంగా బిడ్డ పుట్టడానికి కారణమైన మగవారిని కానీ దున్నపోతుకు గానీ తెలియవని సత్యాన్ని రచయిత సాయమ్మ మాటల ద్వారా వెల్లడించారు. బర్రె దూడను ఈనింది. దూడ ఉల్లాసంగా తిరుగుతుంది కానీ మాయి వేయలేదు. ఆయాస పడుతూ ఉంది. గుడ్ల మాయి పడుతుందేమోనని సాయమ్మ భయపడుతుంది. దానికి కారణం మట్టి రంగులో తేడా ఉండడం. మట్టి కమలిపోయి ఉండడం సాయమ్మను లేపి గొడ్డలి చేతికిచ్చి బూరుగు చెక్క, ఉప్పు చెక్క వెంబడి తీసుకురమ్మని పంపింది. సాయన్న నిద్ర లేచి హడావిడిగా వెళ్లి వెతికితెచ్చాడు. దాన్ని బాగా ఉడికించి రసాన్ని గొట్టంలో వేసి తాగించింది. ఈ రసం ఏమాత్రం ఎక్కువైనా బర్రె చనిపోతుంది. తగిన మోతాదులోనే తాపుతేనే కడుపులో ఉన్న అమ్మాయి పడిపోతుంది.

సాయన్న వచ్చేసరికి జాజును, గంజిని కలిపి పెట్టింది. దీనిని నూనె మరింత భయపడి బర్రెకు పెట్టొద్దు అన్నాడు. సాయమ్మ వినక జుర్రుతున్న బర్రె

ఆయాసం కళ్ళముందే కదిలింది. సాయమ్మ గొట్టంతో మందు బర్రెకు పోసింది మందు కడుపులో పొడంగానే కోరుతున్న బర్రె కూల పడ్డది మొదలు సాపింది. కళ్ళు తేలేసింది గుడ్లు పైకి నిలిచాయి. నాలుగు కాళ్లను పాగదీసి నిరదొక్కింది. కడుపు ఉబ్బి ఎగపోత మొదలయ్యింది. ఈ లక్షణాలన్నీ చూస్తుంటే బర్రె చనిపోవడానికి ముందు కనిపించే లక్షణాలు. ఏమాత్రం పశువులతో అనుబంధం ఉన్న ప్రతి మనిషికి అర్థమయ్యే జరగబోయే విపత్తులను సూచించేదే అయినా సాయన్న దగ్గరకొచ్చి దాని చెవులు ఇరిసిండు. తోక మటను గుంజుండు దవడలు సాఫీ చేతితో పెద్ద నాలుకను తడిమిండు. నాలిక ఉబ్బి చేతులలో ఇవ్వడం లేదు ఇద్దరు కలిసి బర్రెను లాబట్టింద్రు. దొడ్డన దూరం జరిపింద్రు. బర్రె నిలబడి ఒక దులుపుడు దునికేసరికి తట్టెడు మాయి కిందికి రాలింది.

ఊపిరి ఉగ్గు పట్టుకున్న సాయన్న గట్టిగా ఊపిరి పీల్చుకుంది. సాయన్నకు భయం పోయి మాయిని పోక్కలలో పాతి పెట్టిండు.

ఊపిరి ఉగ్గు పట్టుకున్న సాయన్న గట్టిగా ఊపిరి పీల్చుకుంది. సాయన్నకు భయం పోయి మాయిని పోక్కలలో పాతి పెట్టిండు. సాయనమ్మ సంబరానికి పట్టపగ్గాలు లేవు ఉడుకు నీళ్లంతా బర్రెను కడిగింది. ఎల్లిగడ్డ రాసింది. తన కూతురు భర్త శంకరి బర్రె కోసం రాగా సాయన్న దుడ్డేను అల్లుని చేతిలో పెట్టి దాంతో దుడ్డే కోసం బర్రె శంకర్ని అనుసరించి వెళ్ళింది. తల్లి లెక్క బిడ్డ రామంటరు. నిజమే బర్రె చూసినవా దొడ్డే ఎటు బోతుందో తన బిడ్డ మాయ ముంతను తల్లి గారి ఇంట్లో పార్టీ దొంగ బర్రె బిడ్డను దేవులాడుకుంటూ సాగిపోతుంది. అన్న వ్యంగ్యంతో కథ ముగిసింది.

ఈ కథ ద్వారా రచయిత మధ్యతరగతి, కిందిస్థాయి కుటుంబాలలోని మానవ సంబంధాలు, ఆర్థిక సంబంధాలతోనే ముడిపడి ఉన్నాయని సత్యాన్ని ఆవిష్కరించారు. ముఖ్యంగా మగ బిడ్డలు లేని కుటుంబాలలో అక్కాచెల్లెళ్ల మధ్య ఎలాంటి పొరపాట్లు, అసూయ, ద్వేషాలు ఏర్పడి వారి రక్త సంబంధాలు ఇలా పతనమవుతున్నాయో, నేటి కుటుంబ వ్యవస్థలోని ఒక సాంస్కృతిని ఆవిష్కరించే కథగా దర్శనమిస్తుంది. బిడ్డ మాట్లాడకపోయినా తన ఇంట్లో బర్రె

తన చేనులో పడి, పంటను నాశనం చేసిన, పంట నష్టాన్ని లెక్కచేయక, దానిని తన సొంత బిడ్డ లాగా పశువును భావించి, దానిని చేతనైన సహాయం చేసి, దాన్ని కాపాడుకోగలిగిన ప్రేమ మూర్తిగా సాయమ్మ దర్శనమిస్తుంది. తన ఇంటి గొడ్డును, తన బిడ్డ లాగా చూసుకునే సంస్కృతి మన నిత్య జీవితంలో ఎప్పుడు భాగమై ఉండేదని, ఇది మన అచ్చమైన తెలుగు గ్రామ సంస్కృతిలో నిదర్శనం అనిభావించవచ్చు. పూర్తిగా తెలంగాణ మండలికంలో రాసిన కథగా, ఇందులో ఉపయోగించిన మాండలిక పదాలు గోగ్గోలు, గోజా, పొంటేజాము, దక్కలోడు, మాటల ద్వారా అర్థం చేసుకోవచ్చు. రాయలసీమ కథానికల్లో కొంతమంది కథకులు పశువుల నేపథ్యంతో కొన్ని కథలు రాశారు.

అలా మన తెలంగాణలో కథానిక సాహిత్యంలో బర్రె మాయిముంత నేపథ్యంతో కథలు రాసిన వారిలో పెద్దింటి అశోక్ కుమార్ గారు ఒకరు. ఇది పశువుకు యజమానికి మధ్య ఉన్న అన్యోన్య సంబంధాన్ని తెలిపే కథగా పేర్కొనవచ్చు.

**“భాష కూడా పగులుతుంది కదా**
**పదేళ్ళకే బతుకు బరువంతా మీద పడి**
**కళ్ళల్లో లోకాల ఏకాకి తనం గూడు కట్టుకుని**
**అద్దం పలకల మీద నేరస్తులు నిద్ర పోతున్నప్పుడు**
**భాష తప్పకుండా పగులుతుంది”**

**- డా.శివారెడ్డి**

# గురజాడ దిద్దిన చిన్న కథ

ఓల్గా

1910లో గురజాడ రాసిన చిన్న కథ 'దిద్దుబాటు' చదివినప్పుడు అనేక విషయాల గురించి ఆలోచనలు వచ్చాయి. ఈ 124 సంవత్సరాల నుండీ తెలుగు సాహిత్య పాఠకులు ఆ కథను మర్చిపోలేదు. వందేళ్ళకు పైబడిన కథా సంకలనాలను వెలువరించినప్పుడు మొదటి కథగానో, రెండవ కథగానో ఈ కథకు చోటు దొరుకుతోంది. తెలుగు కథ పుట్టుక, పరిణామం, వికాసాల గురించి ఎవరు మాట్లాడినా 'దిద్దుబాటు' కథ ప్రస్తావనకు రాకుండా ఉండదు. నాలుగు పుటల కథ తనలో దాచుకున్న చరిత్ర యేమిటి? విశేషాలేమిటి? తెలుగు కథకు 'దిద్దుబాటు' ఏ అక్షర, పద, వాక్య సంవిధానాలనూ, ఏ అర్థవంత వస్తువును, ఏ అందమైన శైలినీ సమకూర్చింది అన్న విషయాల గురించి ఆలోచిస్తే అనేక విషయాలు మనం గ్రహించవచ్చు. ఈ విషయాలను మూడు అంశాలుగా చేసి చర్చించి చూసినప్పుడు ఈ కథ విలువ తేలికగా, స్పష్టంగా అర్థమవుతుంది.



1. కథావస్తువుగా స్త్రీ విద్య

2. మరో ముఖ్యాంశంగా సంఘ సంస్కరణ

3. కథా నిర్మాణం, శైలి

'దిద్దుబాటు' కథలో కమలిని చదువుకున్న స్త్రీ కాకపోతే ఈ కథే లేదు. కమలిని విద్య

గురించీ, స్త్రీ విద్య గురించీ రెండు భిన్నమైన అభిప్రాయాలు కథలో వినిపిస్తాయి. ఒకటి ఆధునికం. రెండు సంప్రదాయ ఆలోచన. 1910 నాటికి ఆ రెండు ఆలోచనల మధ్య ఘర్షణ కొనసాగుతూ ఉంది. ఈ ఘర్షణ వలసపాలనలో మొదలైంది. వలసపాలన లేకపోతే మన దేశంలో సాంఘిక పునరుజ్జీవం, ఆధునికత, స్త్రీల అభ్యుదయం ఎలాంటి పద్ధతిలో జరిగేది అనేది ఊహించటం తప్ప వాస్తవంగా చెప్పగలిగింది కాదు. వలసపాలనలోనే 18, 19, 20 శతాబ్దాలలో జరిగిన సామాజిక మార్పులను, స్త్రీల విషయంలో జరిగిన చర్చలను, మార్పులను అర్థం చేసుకోగలం. స్త్రీ విద్య గురించిన చర్చ కూడా వలసపాలన కాలంలో జరిగినదే. ఈస్ట్ ఇండియా కంపెనీ కాలం నుంచీ కూడా వలసపాలకులలో భారతీయ స్త్రీల పరిస్థితులు గందరగోళ పరిచాయి. భిన్నాభిప్రాయాలు వారిని కలవరపెట్టాయి. తొలి సంవత్సరాలలో ఈస్ట్ ఇండియా కంపెనీ వారికి భారతీయ స్త్రీలకు విద్య లేకపోవటం ఏమీ అభ్యంతరకరంగా తోచలేదు. హిందువులు స్త్రీల పట్ల అవలంభించిన మంచి పద్ధతిగానే వాళ్ళు స్త్రీల నిరక్షరాస్యతను అర్థం చేసుకున్నారు.

> సాహిత్య పరిచయం, జ్ఞానం వల్ల కలిగే కోరికలు స్త్రీలను గృహ సంబంధిత పనుల నుంచి దూరం చేసి వాటి పట్ల విముఖతను కలిగిస్తాయి.

"సాహిత్య పరిచయం, జ్ఞానం వల్ల కలిగే కోరికలు స్త్రీలను గృహ సంబంధిత పనుల నుంచి దూరం చేసి వాటి పట్ల విముఖతను కలిగిస్తాయి. ఆ ఇంటి పనులలోనే స్త్రీ తృప్తిని, వినోదాన్ని పొందగలుగుతుంది. ఇక ఆచారం ప్రకారం చూసినా చదవటం రాయటం వచ్చిన స్త్రీలు చాలా కఠినమైన శిక్ష, నింద పడవలసి వస్తుంది. హిందూ నాట్యగత్తెల యొక్క వృత్తి ప్రజలకు ఆనందాన్నివ్వటం గనుక వారికి అక్షర జ్ఞానం నేర్పుతారు." అంటూ ఈస్ట్ ఇండియా కంపెనీవారి అధికారి జార్జి ఫాస్టర్ "జర్నీ ఫ్రం బెంగాల్ టు ఇంగ్లండ్" అనే పుస్తకంలో బ్రాహ్మణ ఆచారాలను చాలా మెచ్చుకున్నాడు. తొలి కాలపు మిషనరీలు కూడా ఇదే ఆలోచనలో ఉన్నారు. క్రమంగా యూరోపియన్ రినైజన్స్ భావాల వల్ల ఈ ఆలోచనల గురించి ఒక చర్చ వలస పాలకులలో మొదలైంది. విద్య స్త్రీలకు సహాయపడుతుందా లేక మరింత పతనం వైపు నడిపిస్తుందా అంటూ వలస పాలకులు మొదలు పెట్టిన చర్చకు ఇన్ని వందల

ఏళ్ళలో కూడా సమాధానం దొరకలేదు. ఏదో ఒక రూపంలో ఆ ప్రశ్నను ఏదో ఒక సందర్భంలో ఎవరో ఒకరు వేస్తూనే ఉన్నారు. స్త్రీల విద్య గురించి రెండు వందల ఏళ్ళకు పైగా జరిగిన చర్చంతా వారిని విద్యావంతులుగా చేస్తే కంట్రోలు చెయ్యగలమా లేదా అనేదానిమీదే నడిచింది. ఆ చర్చల వల్ల సమాజానికి స్త్రీల చదువు ఏ కాలంలో ఎంత అవసరమో, ఎలాంటి విద్య అవసరమో అంతే విద్య, అలాంటి విద్యే అందుతూ వచ్చింది.



వలసపాలనలో ఒక స్వతంత్ర సంస్థానంలో కీలకమైన ఆలోచనాపరుడిగా ఉన్న గురజాడ రాసిన కథలో పై భిన్నాభిప్రాయాలు కనిపిస్తాయి. గోపాలరావుకి భార్య చదువుకున్నందుకు గర్వం, ఆమె తెలివి గురించి మెప్పు ఉన్నాయి. భార్య చదువు గురించే కాదు, చదువుకున్న స్త్రీల గురించి కూడా మంచి అభిప్రాయమే ఉంది. గోపాలరావు ఇంట్లో పనిచేసే రాముడికి కూడా మంచి అభిప్రాయమే ఉంది. కానీ అతను మాట్లాడే మాటలు సంప్రదాయపరుల, మూర్ఖుల మాటలలాగా ఉంటాయి. దానిలోని వ్యంగ్య ధోరణిని, విమర్శను, స్త్రీ విద్య గురించి ఆ కాలంలో ఉన్న ప్రధాన స్రవంతి సమాజపు ఆలోచనలు మనకు తెలుస్తాయి. ఆ ఆలోచనలు కాస్త అటూ ఇటూగా ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటాయి.

ఐతే స్త్రీ విద్య ప్రయోజనం గురించి చాలాకాలం పాటు ప్రపంచమంతా ఒకే రకమైన ఆలోచన ఉంది. చదువుకున్న స్త్రీ ఇంటినీ, సంసారాన్నీ చక్కదిద్దుకుంటుంది. భర్తను చెడుదారుల వెంట పడకుండా చూసుకోగలుగుతుంది. పిల్లలను బాగా పెంచగలుగుతుంది. వారిని సామాజిక నీతులకు సంప్రదాయాలకూ కట్టుబడేలా శిక్షణ ఇవ్వగలుగుతుంది. బైట పనిచేసి వచ్చిన భర్తకు ఇంటిని చక్కని విశ్రాంతి స్థలంగా చేయగలుగుతుంది. బైటి ప్రపంచంలో అతను ఎదుర్కొన్న ఒత్తిడిల నుంచీ, ఆందోళనల నుంచీ సేదదీర్చి, పోగొట్టుకున్న శక్తిని, ఉత్సాహాన్ని తిరిగి నింపి మర్నాడు పనికి

పంపగలుగుతుంది. ఈ పనులు చదువుకోని స్త్రీల కంటే చదువుకున్న స్త్రీలు బాగా చెయ్యగలరనే అభిప్రాయం పారిశ్రామిక విప్లవం తర్వాత బలపడింది. ఆ భావాలు వలసపాలకుల విద్యా విధానాల ద్వారా, ఆ విద్య వల్ల భారతీయ మేధావులు, సంస్కర్తలు ఫ్రెంచ్ విప్లవం నుండి రష్యా విప్లవం వరకూ చేసిన అధ్యయనాల ద్వారా మన సమాజాన్ని బలంగా తాకాయి. అలాంటి మేధావి, సంస్కర్త అయిన గురజాడ స్త్రీ విద్యను ఆ కాలపు పరిమితులకు లోబడే తన భర్తను సంస్కరించుకునేందుకే

**చదువుకున్న కమలిని తన భర్త బలహీనతను, పిరికితనాన్ని అర్థం చేసుకుని అతన్ని మంచిదారిలోకి మళ్ళించే ప్రయత్నం చేసి గెలిచింది.**

స్త్రీ ఉపయోగించుకున్న వస్తువును కథాంశంగా ఎంచుకున్నాడు. స్త్రీ విద్యను కీర్తించాడు. గోపాలరావు గొప్ప వ్యక్తిత్వం గలిగిన మనిషి కాదుగానీ కన్యాశుల్కం నాటకంలోని గిరీశమంత ధూర్తుడు కూడా కాదు. కన్యాశుల్కంలో గిరీశం "ప్రపంచమందుండే వస్తువులన్నిటిలోకీ ముఖ్యమైనవి విధవలు" అనటంలో ఉన్న ధూర్తత్వం, గోపాలరావు "భగవంతుడి సృష్టిలోకెల్లా ఉత్కృష్టమైన వస్తువు విద్య నేర్చిన స్త్రీ రత్నమే" అనటంలో అంతగా కనపడదు. ఆ తర్వాత రాముడితో "నీ కూతురు బడికి వెళ్ళుతున్నది గదా, విద్య విలువ నీకే బోధపడుతుంది" అనే మాటలో కూడా గోపాలరావు కొంత నిజాయితీగానే స్త్రీ విద్యను సమర్థిస్తున్నాడని అర్థం చేసుకోవచ్చు. రాముడి వ్యంగ్యపు మాటలన్నీ సమాజపు ఆలోచనలు ప్రతిఫలించేవి. అవి నిజం కాదని నిరూపించటమే ఈ కథా ప్రయోజనం. చదువుకున్న కమలిని తన భర్త బలహీనతను, పిరికితనాన్ని అర్థం చేసుకుని అతన్ని మంచిదారిలోకి మళ్ళించే ప్రయత్నం చేసి గెలిచింది. ఆమె ప్రతిఘటన తీవ్రరూపం తీసుకోవాల్సిన అవసరం లేకుండానే సమస్య పరిష్కారమైనప్పటికీ, చదువుకున్న స్త్రీ అవసరమైతే ప్రతిఘటించగలదు, ప్రతిఘటించాలి అనే సూచన కూడా గురజాడ ఈ కథలో మనకు అందించాడు. కమలిని భర్తకు రాసిన ఉత్తరంలో ఆమె తెలివి, లోతు మనకు అర్థమవుతుంది. చేస్తున్నది ఇల్లు ఒదిలి వెళ్ళటం అనే తిరుగుబాటు. కానీ ఆ పని భర్త మేలు కోరే చేస్తున్నది. ఇలాంటి వ్యూహాలు తమ సంసారాల కోసం స్త్రీలు ఎన్ని అనుసరించారో ఆలోచిస్తే వారెంత మేధావులో మనకు అర్థమవుతుంది. గాయం కనపడకుండా దెబ్బ కొట్టి, దాని మీద వెన్న రాస్తున్నంత ప్రేమగా కారం పూయటం. స్త్రీ తెలివిని

గమనించినందుకూ, దానిని కథారూపంలో భద్రపరిచినందుకూ గురజాడకు వందనాలు.

ఇక రెండవ విషయం సంఘ సంస్కరణ. ఈ సంస్కరణ గురించి గురజాడ అభిప్రాయాలు కన్యాశుల్కంలోనే మనకు అర్థమవుతాయి. సంస్కర్తల కపటత్వం, ద్వంద్వ విలువలు, నిజాయితీలేనితనం వీటన్నిటి విశ్వరూపాన్నీ గిరీశంలో చూపించాక, దానిని మరొక నేపథ్యంలో మరొక స్థాయిలో దిద్దుబాటులోని గోపాలరావులో చూపించాడు. మనసులో మంచి ఆలోచనలే ఉన్నా, చుట్టూ కనిపించే ఆకర్షణలకు తట్టుకోలేని బలహీన స్వభావం దుర్మార్గమైనది కాదు గనుక దానిని సంస్కరించవచ్చు. ఎలా? సంస్కర్తల ఉపన్యాసాల ద్వారా కాదు. ఆ సంస్కర్తలు కూడా – ఎవరో కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం నాయుడు వంటివారు తప్ప – ఇంచుమించుగా గోపాలరావు వంటి బలహీన మనస్కులే. కాబట్టి దిద్దుబాటుని వారి చేతిలో పెట్టకుండా, గోపాలరావులో మార్పు రావటం ఎవరికి అత్యంత ముఖ్యమో ఆ వ్యక్తి చేతికే ఆ బాధ్యత, అజమాయిషీలని అప్పగించారు. ఆ బాధ్యతను చదువుకున్న స్త్రీ నిర్వహించే తీరును అందంగా, అందరినీ ఆకట్టుకునే రీతిగా రచించాడు.

> **కథా నిర్మాణం, శైలి, భాష మొదలైనవి. వీటివల్లే గురజాడే తెలుగులో మొదటి కథ రాశాడనే అసత్యం ఆయన ప్రమేయం లేకుండా ప్రచారమైంది.**

ఇక మూడవ విషయం కథా నిర్మాణం, శైలి, భాష మొదలైనవి. వీటివల్లే గురజాడే తెలుగులో మొదటి కథ రాశాడనే అసత్యం ఆయన ప్రమేయం లేకుండా ప్రచారమైంది. దిద్దుబాటుకు ముందు వచ్చిన కథల నిర్మాణానికీ, దిద్దుబాటు నిర్మాణానికీ ఒక గుణాత్మకమైన తేడా స్పష్టంగా కనపడుతుంది. ముఖ్యమైనది క్లుప్తత. నాలుగు పుటలు మాత్రమే. ఒక్క వాక్యం కాదుగదా ఒక్క అక్షరం కూడా తీసివేయటానికి వీలులేని చిక్కదనం. చక్కదనం. ఇక మొదలు పెట్టినప్పటి నుంచీ చివరివరకూ అంతా కుతూహలం కలిగించే నడకే. ఎంతో ప్రపంచ ప్రసిద్ధ కథకుల కథా సాహిత్యాన్ని చదివే అవకాశం ఉన్న ఈనాటి మనబోటి పాఠకులనే ఇప్పటికీ ముగ్ధులను చేస్తున్న ఈ కథ 1910వ సంవత్సరంలో, ఆ సమీప కాలంలోని పాఠకులను ఎంత సమ్మోహనపరిచిందో అర్థం

చేసుకోవచ్చు. చదువుకున్న స్త్రీల పట్ల గౌరవాభిమానాలను కలిగించటంలో ఈ కథ రాసిన పద్ధతికి చాలా ప్రాముఖ్యత ఉంది. పాఠకులకు రాముడి పాత్ర ద్వారా, గోపాలరావు కంగారును చూసి అతను రహస్యంగా నవ్వుకునే నవ్వు ద్వారా విషయం గురించి స్పష్టాస్పష్టంగా తెలుస్తూనే ఉంటుంది. కానీ ఆసక్తి తగ్గకపోగా పెరిగి కొనసాగుతుంది. మొదటినుంచీ చివరివరకూ మితిమీరని, సమతుల్య హాస్యధోరణి ఆహ్లాదకరంగా ఉంటుంది.

కథానాయకురాలు ఎక్కడా కనిపించదు. ఆమె రూపవర్ణన ఉండనే ఉండదు. ముగింపులో కూడా ఆమె నవ్వు వినపడుతుంది గాని ఆమె మనకు కనపడదు. ఆమె తెలివి, ఆమె సాధించిన విజయం కథ ఆసాంతం ప్రకాశిస్తూ ఉంటాయి.

గురజాడ భాష ఔన్నత్యం గురించి చెప్పటం అనవసరం. తెలుగు పాఠకులు గురజాడ భాషకు ఎప్పుడో దాసోహమన్నారు. వ్యవహారికము, పాత్రోచితము, సరళము, ప్రసన్నము, హాస్య చతురతలతో నిండిన అందమైన భాష గురజాడ చేతిలోని ఆయుధం. అది చాలా చురుకుగానూ, సున్నితంగానూ పనిచేస్తుంది. దిద్దవలసిన సాంఘిక లోపాలను, మనుషులను దిద్దటానికి ఆ భాష, ఆ పదాలూ పదునైన పరికరాలు. చిన్న కథ అభివృద్ధి, వికాసాలలో గురజాడ "దిద్దుబాటు" మొదటి మెట్టు.

**"నాల్గు రీతుల గనకంబు నాడెమగును**
**వేటు గీటుల తునియించి వెచ్చజేసి**
**నరుడు నట్టుల నాల్గింట నాడెమగును**
**కులము శీలంబు కర్మంబు గుణము చేత."**

**- గురజాడ**

# సావిత్రిబాయి ఫూలే కవిత్వం - సామాజిక స్పృహ



డాక్టర్ ఎం.మంజుశ్రీ
9959626733

కీలక పదాలు: ఉదా: అనువాద కవిత, సావిత్రిబాయి ఫూలే, ఆచార్య వి.కృష్ణ, దళిత సాహిత్యం, బహుజన సాహిత్యం.

పత్ర సారాంశం: సావిత్రిబాయి ఫూలే చాలామందికి ఒక ఉపాధ్యాయినిగా తెలుసు. కానీ, ఆమె మరాఠీలో కవిత్వం రాశారు. దాన్ని తెలుగులోకి ఆచార్య వి.కృష్ణ అనువాదం చేశారు. సమకాలీన సంప్రదాయంతో ముడిపడిన అనేక అంశాలను శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని తన కవిత్వం ద్వారా ఖండించారు. ఈమె కవిత్వం గురించి తెలుగులో అంతగా ప్రాచుర్యంలోకి రాలేదు. ఈమె చిన్ని కృష్ణ అనువాదం ద్వారా ఆమె కవిత్వాన్ని అర్థం చేసుకుంటున్నారు. కవిత్వాన్ని చదవడం ద్వారా ఆనాటి సమకాలీన పరిస్థితులు ఆ పరిస్థితులలో సంప్రదాయ భావాలు కొన్ని సామాజిక వర్గాలపై చూపుతున్న ప్రభావం, ఆ ప్రభావాన్ని తప్పించుకోలేని పరిస్థితుల్లో ఆ ప్రజలు చైతన్యవంతులు కావడం వంటి అంశాలు తన కవిత్వంలో సావిత్రిబాయి ఫూలే చర్చించారు. ఈ పరిశోధన పత్రాన్ని అనువర్తిత పద్ధతిలో విశ్లేషిస్తాను.

## సావిత్రిబాయి జీవితం – పరిచయం:



సావిత్రిబాయి ఫూలే (1831–1897) భారతీయ తొలి మహిళా ఉపాధ్యాయినిగా, సంఘసంస్కర్తగా, కవయిత్రిగా ప్రసిద్ధిచెందారు. తన 9వ యేటనే 12 సంవత్సరాల వయసులో ఉన్న మహాత్మాజ్యోతిరావు బాపూలే ని వివాహం చేసుకున్నారు. ఆయన గొప్ప సంఘసంస్కర్త. స్త్రీకి విద్య అవసరమని

భావించిన సంస్కర్త కావడంతో సావిత్రిబాయి ఫూలేని చదివించారు. ఆమె మహారాష్ట్రలోని సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో, 1831 జనవరి 3న ఒక రైతు కుటుంబంలో జన్మించారు. జ్యోతీరావు పూలె ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది. అహ్మద్ నగర్

**మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి ఫూలే.**

లో ఉపాధ్యాయ శిక్షణ పొంది, 1848 లో భర్త జ్యోతిరావుతో కలిసి క్రింది కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించిన గొప్ప సంస్కర్త. ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో మహిళా సేవామండల్ అనే మహిళా సంఘాన్ని కూడా స్థాపించారు. లింగ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఈ సంస్థ కృషిచేసింది. మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి ఫూలే. అసత్యాలతో, అగ్రవర్ణ దురహంకారపు నిచ్చెనమెట్ల కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో సత్యాన్ని శోధించడానికి 1873 లో తన భర్త మహాత్మా ఫూలేతో కలసి "సత్యశోధక్ సమాజ్"ను ప్రారంభించి బాల్యవివాహాలకు, మూఢవిశ్వాసాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, వితంతువు పునర్వివాహల కొరకు అసమాన బ్రాహ్మణ వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారు. బాల్యంలోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దే వదిలేసి పోయిన ఓ బ్రాహ్మణ యువతి బిడ్డను అక్కున చేర్చుకున్నారు. యశ్వంత్ గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్యపర్చి, వితంతువులకు శిరోముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు. తరువాత 1873 సెప్టెంబరు 24న "సత్యశోధక్ సమాజ్" అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, సత్యశోధన కోసం ఉద్యమాన్ని నడిపారు ఫూలే. ఈ సత్యశోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయిఫూలే నేతృత్వంలో

నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో సత్యశోధక్ సమాజ్ అధ్వర్యాన సావిత్రీబాయిపూలే వివాహం జరిపించారు. 1868 నుంచి సావిత్రీబాయిపూలే అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి, 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాలలోని అనాథ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు. తమ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించారు.

**ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తకరూపంలో వచ్చాయి. మరాఠీలోని ఆమె రచనలు ఆంగ్లం, హిందీ భాషలలోకి అనువాదం అయ్యాయి.**

### సాహిత్రిబాయి పూలే కవిత్వం 'కావ్యపూలే':

సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా వేగుచుక్కగా నిలిచారు. 1854లో ఆమె తన కవితా సంపుటి 'కావ్యపూలే'ను మరాఠీలో ప్రచురించారు. మరో కవితా సంపుటి 'పావన కాశీ సుబోధ్ రత్నాకర్'ను 1891లో ప్రచురించారు. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తకరూపంలో వచ్చాయి. మరాఠీలోని ఆమె రచనలు ఆంగ్లం, హిందీ భాషలలోకి అనువాదమయ్యాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటికి చెందిన ప్రసిద్ధ కవి, పరిశోధకులు, అధ్యాపకులు ఆచార్య వి.కృష్ణ అనువాద గ్రంథం 'సాహిత్రిబాయి పూలేకవితలు' "కావ్యపూలు" గ్రంథాన్ని అన్వేషి రీసెర్చ్ సంస్థ, హైదరాబాదు వారు 2017లో ప్రచురించారు. ఈ అనువాద పుస్తకాన్ని ఆధారంగా చేసుకొని ఈ పత్రంలో ఆమె కవిత్వంలో కనిపించే వివిధాంశాలలో ప్రతిబింబించే సామాజిక స్పృహను విశ్లేషించే ప్రయత్నం చేస్తాను.

సాహిత్రిబాయి పూలే తన 'కావ్యపూలే' కవితాసంపుటిని తన భర్తకు అంకితమిచ్చారు. అంకితం చేస్తూ రాసిన వాక్యాల్లో ఆమె తన భర్త కలిగించిన సామాజిక చైతన్యాన్ని కూడా ప్రతిఫలిస్తుంది.

"కురిపించావు నామీద
విశాల భావ వెల్లువ
సమస్తం నిండిపోయెను హృదయం
తెలియదు నీ ఉపకారం
అనంతమని"

పేర్కొంటూ తన అంకితాన్ని కొనసాగించారు సావిత్రిబాయి పూలే.

ఈ కవితాసంపుటిలో 38 ఖండికలు ఉన్నాయి. ప్రతి కవితలోను ఆమె పడిన సంఘర్షణ, సామాజిక ప్రతిఫలనం, సామాజిక స్పృహ, సామాజిక చైతన్యం వ్యక్తమవుతున్నాయి.

## సామాజిక స్పృహ అంటే?

సామాజిక స్పృహ అనేది మార్క్సిస్టు సాహిత్య భావన. దీన్ని ఆంగ్లంలో social consciousness అంటారు. దీన్ని వివరిస్తూ కార్ల్ మార్క్స్ ఇలా అన్నారు. "In the social production of their life, men enter into definite relations that are indispensable and independent of their will; these relations of production correspond to a definite stage of development of their material forces of production. The sum total of these relations of production constitutes the economic structure of society — the real foundation, on which rises a legal and political superstructure and to which correspond definite forms of social consciousness. The mode of production of material life determines the social, political and intellectual life process in general. It is not the consciousness of men that determines their being, but, on the contrary, their social being that determines their consciousness." ( Karl Marx, "Economic Manuscripts: A Contribution to the Critique of Political Economy 1859". www.marxists.org.)

దీని సారాంశాన్ని పరిశీలిస్తే, మానవుడు నిత్యం సామాజిక ఉత్పత్తులతో వివిధ సంబంధాలు కలిగి ఉంటాడు. ప్రత్యక్షంగానో, పరోక్షంగా అవన్నీ

మానవుల ఆర్థికస్థితిగతులపై ప్రభావాన్ని చూపిస్తాయి. నిజానికి ఇవన్నీ ఉపపరితలంలో కనిపించినా, వాటి ప్రభావం అంతా పునాదిలోనే ఉంటుంది. పునాదిలో ఉన్న ఆర్థికస్థితి గతుల వల్ల ఉపరితలంలోని మానవ సంబంధాలు వారి సామాజిక, సాంస్కృతిక కోణాల్ని నిర్ణయిస్తాయి. సమాజంలో ఈ వ్యత్యాసాలను గుర్తించి, వారి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక కారణాలను తెలుసుకొని అవి అలా రూపొందడానికి, వాటి ప్రభావానికి గురవుతున్న వారి ప్రతిస్పందనలను సాహిత్యంలో వ్యక్తీకరించడం ద్వారా సామాజిక స్పృహను గుర్తించగలుగుతాం.

**తమ హక్కులతో పాటు, తమ బాధ్యతలను కూడా గుర్తెరిగి ప్రవర్తించడంలో సామాజిక స్పృహ ఉంటుంది.**

సామాజిక స్పృహను సులభంగా చెప్పుకోవాలంటే సమాజంలో భిన్నవైరుధ్యాలు, ఆ వైరుధ్యాలకు గల కారణాలను తెలిసి, వాటి పరిష్కారాల్ని సూచించేలా సృజనీకరించ గలిగితే అది సామాజిక స్పృహగల రచన అవుతుంది. ఒక సామూహిక జీవనంలో వైయక్తిక స్థితి గతుల్ని శాస్త్రీయంగా గుర్తించగల చైతన్యం లేదా అవగాహన సామాజిక స్పృహకు సంబంధించినదవుతుంది. తమ హక్కులతో పాటు, తమ బాధ్యతలను కూడా గుర్తెరిగి ప్రవర్తించడంలో సామాజిక స్పృహ ఉంటుంది. సామాజిక స్పృహ కొంతమందిలో వివిధ నమ్మకాలపై కూడా ఆధారపడి ఉంటుంది. అవి మత విశ్వాసాలు కావచ్చు, వంశానుగతంగా వచ్చినవి పక్షుల మధుర గీతాలాపనలు పువ్వుల మీద వాలే రంగురంగుల సీతాకోక చిలుకలు సందడి చేయును ప్రతి నిమిషం ప్రకృతి సమస్తం కావచ్చు.

"ఓ మహాత్మ జ్యోతిబా!
దీనులు శూద్రులు అతి శూద్రులు
నీ వైపే చూస్తున్నారు
జ్ఞానంతో మా మనస్సులను నింపండి
మాకు బాగా తెలుసు
మీజ్ఞానంతోనే మాకు ముక్తి లభిస్తుంది"

ఈ సైద్ధాంతిక అవగాహనతో సావిత్రిబాయి ఫూలే కవిత్వంలో ప్రతిఫలించే సామాజిక స్పృహను కింది విధంగా గమనించవచ్చు.

## ప్రత్యామ్నాయ ప్రతీకలు – పురాణ స్పృహ:

సాహిత్రిబాయి ఫూలే తన కావ్యఫూలే కవితాసంపుటిలో మొదటి కవిత 'ఆత్మకథనం'లో తన గ్రామాన్ని భారతదేశానికి ప్రతీకగా వర్ణించినట్లనిపిస్తుంది.

"కష్టజీవుల గ్రామం నా గ్రామం
ఎన్నెన్నో జనజాతుల సమాహారం
సుఖ సంతోషాలు
పాడి పంటలతో నా గ్రామం
వ్యవసాయం కోసం కురిసెను వర్షం అపారం
బలి చక్రవర్తి మహనీయుడు
రైతులు ఎంతో ఔదార్యవంతులు
నాకు అనిపిస్తుంది
నా గ్రామం
బలి మహారాజు రాజధానిలా ఉందని
కాదు మేము నిరాశపరులం
ఆ మహాదాత యొద్దకు
నిజమైన వారసులం"

**పౌరాణిక చరిత్ర దేవతల ప్రయోజనాల కోసం దానవులను దుర్మార్గులుగా చిత్రించి అణచివేసింది.**

అని మొదటి నుండీ కష్టపడే తత్త్వమున్న దేశంగా భారతదేశం గొప్పతనాన్ని వివరించారు. ఈ కవితను ఆచార్య కాత్యాయనీ విద్మహేగారు విశ్లేషిస్తూ ఇలా అన్నారు. "పౌరాణిక చరిత్ర దేవతల ప్రయోజనాల కోసం దానవులను దుర్మార్గులుగా చిత్రించి అణచివేసింది. అణచివేయబడినవాళ్ల పక్షం ఆమె తీసుకున్నది. దేవదానవులు ఒకే తండ్రి బిడ్డలు. కశ్యప ప్రజాపతి వాళ్ళ తండ్రి. తల్లులు మాత్రమే వేరువేరు. అదితి సంతానం దేవతలు. దితి సంతానం దానవులు. ఇంద్ర సింహాసనం మాత్రం ఎప్పుడూ దేవతలదే. దానికోసం సంఘర్షించిన ప్రతి సందర్భంలో దేవతల పక్షాన విష్ణువు ఎదో ఒక పద్ధతిలో దానవులను అణచివేస్తూ వచ్చాడు. గెలిచినవాళ్లు రాసిన చరిత్రలో దానవులు ప్రతినాయకులు అయినారు. ఈ పౌరాణిక చరిత్రను తిరగరాయటం భారతీయ సమాజంలో సమాన న్యాయం నిరాకరించి బడిన వర్గాల సహజ ఆకాంక్ష అయింది. ఆ క్రమంలోనే సావిత్రి భాయి ఫూలే బలి ని దానవీరుడిగా నిలబెట్టి ఉంటుంది." ( సారంగ అంతర్జాల పత్రిక, సంచిక: 1 నవంబర్

2018). దీన్ని బట్టి సావిత్రిబాయి పూలేకి భారతీయ పురాణాల పట్ల స్పష్టమైన "స్పృహ" ఉందని చెప్పుకోవచ్చు.

### భారతీయ సంఘసంస్కరణలపై సామాజిక స్పృహ:

సావిత్రిబాయి పూలే కి భారతీయ సమాజంలో కుల, వర్గ వ్యవస్థలపై, వివిధ మూఢ విశ్వాసాలపై స్పష్టమైన అవగాహన ఉన్నట్లు ఆమె చేసిన సంఘసంస్కరణ కార్యక్రమాలతో పాటు, ఆమె రాసిన కవితలను బట్టి కూడా చెప్పవచ్చు. శూద్రుల పక్షాన నిలబడి, వారి చదువు, వివిధ అవకాశాల కోసం పోరాడిన మహాత్మాజ్యోతిబాపూలే గురించి ఒక కవిత 'జ్యోతిబాకు వందనాలు'లో ఇలా వర్ణించారామె.

జ్యోతిబాపూలే, ఆయన రాసిన రచనలు పురాణాల గురించీ సామాజిక విషయాల గురించీ చదివితే మూఢవిశ్వాసాల పట్ల ఆయనకు ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టంగా అర్థం అవుతుంది.

"ఓ మహాత్మా జ్యోతిబా!
దీనులు శూద్రులు అతి శూద్రులు
నీ వైపే చూస్తున్నారు
జ్ఞానంతో
మా మనస్సులను నింపండి
మాకు బాగా తెలుసు
మీ జ్ఞానంతోనే మాకు ముక్తి లభిస్తుంది"

జ్యోతిబాపూలే, ఆయన రాసిన రచనలు పురాణాల గురించీ సామాజిక విషయాల గురించీ చదివితే మూఢవిశ్వాసాల పట్ల ఆయనకు ఎంత వ్యతిరేకత ఉందో, కొన్ని వర్గాలను మరికొన్ని వర్గాలు ఏ విధంగా దోపిడీ చేశాయో చాలా స్పష్టంగా అర్థం అవుతుంది. ఆయన రాసిన 'గులాంగిరి' గ్రంథం దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. అందుకని అటువంటి వారి రచనలు, అటువంటి వారి సంఘసంస్కరణలు, అటువంటి వారి జ్ఞానం ఈ దేశానికి అవసరం అనడం ద్వారా సావిత్రిబాయి పూలేకున్న సామాజిక స్పృహ స్పష్టమవుతుంది. వీటితో పాటు 36, 37 కవితలు 'ప్రపంచమార్గం', 'జ్యోతిబా సందేశం' (పుట: 78–79), 38 వ కవిత 'సావిత్రి– జ్యోతిబా సంభాషణ' (పుట: 81) కవితల్లో మహాత్మాజ్యోతిబాపూలే చేసిన సామాజిక సంస్కరణలను ప్రస్తావించడం,

వాటిని ఆచరించడం ద్వారా సామాజిక పరివర్తన జరుగుతుందనీ, పీడిత వర్గాలు కనీస అవసరాలకు నోచుకొని ఆత్మగౌరవంతో జీవించగలరనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.

## విద్య వివేకాన్నిస్తుందనే ప్రబోధం:

'వారిని మనుషులని ఎలా అనను?' అనే శీర్షికతో విద్య ప్రాధాన్యాన్ని వివరిస్తూ గొప్ప సామాజిక స్పృహతో సావిత్రిబాయి ఫూలే తన కవిత్వాన్ని వర్ణించారు.

"విద్య లేదు జ్ఞానం లేదు
చదువుకుని విద్యావంతులు కావాలనే ఆలోచన లేదు.
తెలివి ఉన్నా వ్యర్థంగా కోల్పోతారు.
వారిని మనుషులని ఎలా అనను?
చేతులు ముడుచుకుని కూర్చుంటారు.
పశువులు కూడ అలా కూర్చోవు
ఆలోచన లేదు, ఆచరణ లేదు.
వారిని మనుషులని ఎలా అనను?"

అని ఒక సుదీర్ఘమైన కవిత రాశారు. చదువుకోకుండా ఉంటే సమాజం గురించి తెలియదనీ, ఇంటి నిండా పిల్లల్ని కనడం మాత్రం తెలుసుననీ, ఆ పిల్లల్ని పోషించడానికి కావలసిన వనరులు ఎలా వస్తాయో మాత్రం తెలియదనీ వర్ణిస్తూ అధిక సంతానం అధిక కష్టాలకు కారణమని సందేశాన్ని కూడా అందిస్తారు.

"జ్యోతిష్యం, పంచాంగం,
హస్త రేఖల చుట్టూ తిరిగెదరు మూర్ఖులు
స్వర్గం నరకం కల్పనలో మునిగి పోయెదరు
పశువుల జీవితంలో కూడ
ఇలాంటి భ్రమలకు లేదు ఎలాంటి స్థానం
వారిని మనుషులని ఎలా అనను?"

అనడం ద్వారా సావిత్రిబాయిఫూలేకి శ్రమపట్ల, వాస్తవికత పట్ల తనకున్న సామాజిక స్పృహ స్పష్టంగా తెలుస్తుంది. ఆమెలోని భౌతికవాదానికి ఈ

కవిత చక్కని నిదర్శనం. తమ దారిద్ర్యానికి కారణాలు తెలుసుకోవాలని భార్యను హింస పెట్టకూడదని అటువంటి వారిని పశువులతో సమానమని చెప్తూ చివరికి తమ బానిసత్వానికి కారణం ఏమిటో తెలుసుకోకపోతే వాళ్ళ మనుషులని అనుకోలేమని నినదిస్తారు.

"బానిసత్వం గురించి బాధ పడని వారు
అభివృద్ధి సంకల్పం లేని వారు
మానవత్వాన్ని అణగద్రొక్కే వారు
వారిని మనుషులని ఎలా అనను?
పశు పక్షులు, క్రిమి కీటకాలు,
వానరులు నరులు పుట్టుక గిట్టుక
సమస్త చరాచరులకు సమానం
ఈ మాత్రం జీవిత సత్యం కూడ తెలియని వారు
వారిని మనుషులని ఎలా అనను?"

సావిత్రిబాయిఫూలేగారి ఈ కవిత ఇంగ్లీష్ అనువాద పాదాలు మరికొన్ని వెబ్సైట్లో విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయి.

If you have no knowledge, have no education,
And you yearn not for the same,
You posses intellect but work not on the same,
How then can you be called a human being?

----------..

Birds, animals, monkeys, human beings too,
All go through life and death
But if you gain no knowledge about this,
How then can you be called a human being?

ఈ కవిత మాత్రమే కాదు, 'విద్య– అజ్ఞానం', 'చదువుకోసం చైతన్యులు కండి' 'గొప్ప ఆస్తి', మొదలైన పేర్లతో మరికొన్ని కవితల్లో కూడా విద్య ప్రాధాన్యాన్ని చెప్పారు.

## జ్ఞాన మార్గంగా ఆంగ్ల విద్య :

ఇంగ్లీషు నేర్చుకో' పేరుతో రాసిన కవితలో ఇంగ్లీష్ వలన ప్రపంచ జ్ఞానాన్ని ఎలా అవగాహన చేసుకోవచ్చు వివరించారు.

"స్వావలంబన ఉద్యోగం, జ్ఞానం కోసం
కావాలి ప్రవృత్తి, నిరంతర ప్రయత్నం
కష్టించి కూడబెట్టు జ్ఞానధనం
విద్య లేని వాడు వింత జంతువు
గ్రహించు విద్యను
సోమరిబోతులా కూర్చోకు
శూద్రులు, అతి శూద్రుల దుఖాన్ని దూరం చేయుట
ఇంగ్లీషు విద్యను అభ్యసించుటకు
లభించెను విలువైన అవకాశం
ఇంగ్లీషు చదివి కుల భేదాల
గోడలను కూల గొట్టు
భట్ బ్రాహ్మణులు రచించిన కుతంత్రాల
శాస్త్ర పురాణాలను పడ గొట్టు"

> శూద్రులు ఉన్నతిని ఇంగ్లీష్ తల్లి ఆకాంక్షిస్తుందనీ, ఫీష్వాల రాజ్యాన్ని ఆ మూర్ఖుల రాజ్యాన్ని నాశనం చేస్తుందనీ

దీనితో పాటు 'ఇంగ్లీష్ తల్లి ' అనే కవిత కూడా రాశారు. శూద్రులు ఉన్నతిని 'ఇంగ్లీష్ తల్లి' ఆకాంక్షిస్తుందనీ, ఫీష్వాల రాజ్యాన్ని ఆ మూర్ఖుల రాజ్యాన్ని నాశనం చేస్తుందనీ, శత్రువులకు నిజమైన జ్ఞానాన్ని కొత్త జీవితాన్ని ఇస్తుందనీ అందుచేత ఇంగ్లీష్ తల్లిని ఒక మానవత్వానికి ప్రతికగా ఆమె వర్ణించడంలో ప్రపంచ జ్ఞానం పట్ల అనుకున్న అవగాహనను తెలుసుకోవచ్చు.

భారతీయులకు మాత్రమే కాకుండా ప్రపంచదేశాలకు ఆంగ్ల విద్య ద్వారా శాస్త్రీయమైన అవగాహన కలిగిందనేది సావిత్రిబాయి ఫూలే కవిత్వంలో కూడా గమనిస్తాం. దీన్ని తన కవిత్వంలో ఆంగ్ల విద్యను అభ్యసించండంటూ ఆమె కొన్ని కవితలను వర్ణించారు.

## భారతీయ సామాజిక నిర్మాణం – సావిత్రిబాయి అవగాహన:

భారతీయ సామాజిక నిర్మాణం చాతుర్వర్ణ వ్యవస్థ పై ఆధారపడి ఉంది. కేవలం నాలుగు కులాలే కాకుండా కులాల్లో మరలా అంతర్భేదాలు,

వాటిలో ఒకదానిపై ఒక కులం తన ఆధిపత్యాన్ని చలాయించడం... దాని వలన ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో ఒక్కొక్క కులం అణచివేతకు గురవుతూ ఉంటుంది. మనుస్మృతి ఆధారంగా ఈ వర్ణ వ్యవస్థ అమల్లోకి రావడం, అది పటిష్టంగా వివిధ రాజ్యాలలో అమలు కావడంతో కొన్ని సంవత్సరాలుగా శూద్రులు, అతిశూద్రులు అణచివేతకు గురి కాబడ్డారనేది ఆమె ప్రతిపాదించిన విషయం. దీన్ని ఆసరా చేసుకుని సావిత్రిబాయి ఫూలే అనేక కవితలను తన ‘కావ్యఫూలే’లో వర్ణించారు.

**శూద్రులంటే..? అనే కవితలో మూలవాసీ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.**

“శూద్రులంటే..?” అనే కవితలో మూలవాసీ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. జ్యోతిబాఫూలే తన ‘గులాంగిరి’ గ్రంథంలో కూడా ఈ మూలవాసీ సిద్ధాంతాన్నే చెప్పారు. ఆర్యులు ఇతర దేశాల నుండి ఈ దేశంలోకి వచ్చి ఆధిపత్యాన్ని చెలాయించి, కుల వ్యవస్థకు కారణమై, శూద్రులు, అతి శూద్రులు వంటి కుల విభజన చేశారని, నిజానికి ఈ ఆధిపత్య వర్ణాలు ఈ దేశానికి చెందినవారు కాదని ఆ గ్రంథంలో మహాత్మా జ్యోతిరావు బాఫూలే వివరించారు. ఆ అవగాహనతోనే జ్యోతీబాయిఫూలే కూడా ఈ కవితలో మనకు వివరిస్తుంది.

“శూద్ర పదం యొక్క
సరైన అర్థం – నేటివ్
దండెత్తి వచ్చిన విదేశీలు
మనల శూద్రులని ముద్ర వేశారు”

“పరాజిత శూద్రులు బానిసలయ్యారు ఇరానీయులు బ్రాహ్మణులకు మరియు బ్రాహ్మణులు ఆంగ్లేయులకు అప్పుడయ్యారు ఉగ్ర శూద్రులు”

“అసలు ఇండియాకు రాజులు
శూద్రులే
వారి పేరు నేటీవ్స్”

“పరాక్రమ శూరులు మన పూర్వీకులు
ఆ ప్రతాప వీరుల
వంశజులం మనం”

అనడం ద్వారా శూద్రులలో ఆత్మవిశ్వాసాన్నీ, ఆత్మ గౌరవాన్నీ పాదుకొల్పే ప్రయత్నం చేశారు. అటువంటి మూలవాసీలు బానిసలుగా మారిపోవడానికి కారణమైన మనుస్మృతి గురించి కూడా ''కుటిల మనువు చెప్పెను'' అనే ఒక కవిత రాశారు.

''వ్యవసాయం చేయవద్దని బ్రాహ్మణులను ఆజ్ఞాపిస్తుంది
మనుధర్మ శాస్త్రం
శూద్రుల పుట్టుక
పూర్వజన్మ పాపాల ఫలం
అనుభవిస్తారు
ఈ జన్మలో శూద్రులు సమస్తం
సమాజంలో వైషమ్యాల
కుటిల ఆచార వ్యవహారాలు రచిస్తారు.
ధూర్తులకే చెల్లు
ఈ అమానవీయ సిద్ధాంతం''

కొంతమంది తమ పేదరికనికి తమ కష్ట నష్టాలకి కర్మ సిద్ధాంతమే మూలమనే ఈ సిద్ధాంతం సరైందికాదనే అవగాహన సావిత్రిబాయికి ఉన్న సామాజిక స్పృహకు నిలువెత్తు నిదర్శనం. అందుకనే ప్రముఖ విమర్శకురాలు ఆచార్య కాత్యాయనీ విద్మహే సావిత్రిబాయి గురించి వ్యాఖ్యానిస్తూ ''నిష్ఠుర సామాజిక వాస్తవికతలనే కాదు ,నిసర్గ సౌదర్య భరిత ప్రకృతి లోని మట్టిని , చెట్టును పిట్టను పువ్వులను చూచి స్పందించే సున్నితత్వం కూడా సావిత్రిబాయి లో పుష్కలంగా ఉంది. ప్రకృతి–భూమి పాట సంపెంగ, మల్లెపువ్వులు, సీతాకోకచిలుకలు – పూ మొగ్గలు వంటి కవితలు అందువల్లనే రాయగలిగింది. దేశమంటే మనుషులు, పీడిత దుఃఖిత మానవులు అని నమ్మి వాళ్ళ కోసం ఎంత తపించిందో, ఉత్పత్తి వనరు అయిన భూమిని కూడా అంతగా ప్రేమించింది.

'పొలము కళ్లము లాంటిది మట్టితో మన అనుబంధం' అని అనగలిగిన స్థాయి ఆమెది. భూమి –మనిషి శ్రమ – పంట ఈ మూడింటి మధ్య సంబంధాన్ని అలవోకగా చెప్పగలిగిన మట్టిమనిషి ,ప్రజల మనిషి సావిత్రిబాయి పూలే.''(సారంగ అంతర్జాల పత్రిక, సంచిక: 1 నవంబర్ 2018) అని అన్నారు.

> **ఈ సమాజంలో భిన్న వైరుధ్యాల పట్లా, వ్యత్యాసాల పట్లా వివిధ సామాజిక అంతస్థుల పట్లా ఒక స్పష్టమైన అవగాహన**

వికీపీడియా సావిత్రిబాయిజీవితం గురించి చక్కని వివరాలను కూడా అందించింది. ఆమె మరణాన్ని వివరిస్తూ "1896–97లో సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ పరిస్థితుల్లో కరువు ప్రాంతాల్లోని దళితులు, పేదల కోసం జోలెపట్టి విరాళాలు సేకరించి అందించారు. ప్లేగు వ్యాధి సోకిన పేదలకు దగ్గరుండి సేవలందించారు. 1890వ దశకంలో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించింది. దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 2 వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించింది. ప్లేగు వ్యాధి సోకిన మాంగ్ లాంటి దళిత కులాలకి చెందిన దళిత చిన్నపిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడింది. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకి సోకి మార్చి 10, 1897 లో మరణించారు. ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపించాడు. సావిత్రి బాయి జయంతిని భారతదేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం." అని రాసింది. (సావిత్రిబాయి పూలే – వికీపీడియా (wikipedia.org)

## ముగింపు:

సావిత్రిబాయి పూలే సమాజం పట్లా, ఈ సమాజంలో భిన్న వైరుధ్యాల పట్లా, వ్యత్యాసాల పట్లా వివిధ సామాజిక అంతస్థుల పట్లా ఒక స్పష్టమైన అవగాహన, ఒక సామాజిక స్పృహ ఉన్న రచయిత్రిగా ఈ 'కావ్యపూలే' ద్వారా తెలుస్తోంది. సావిత్రిబాయిపూలే తన కవిత్వానికి ఒక సామాజిక ప్రయోజనం ఉండాలనే బలమైన ఆకాంక్షగా కూడా ఈ కవితా సంపుటిని బట్టి తెలుస్తుంది. ఆమెకున్న సామాజిక అవగాహన, సామాజిక స్పృహ, సామాజిక చైతన్యం, సంఘసంస్కరణల పట్ల ఆమెకున్న నిబద్ధతను, సేవను గుర్తించి పూణే మహిళా విశ్వవిద్యాలయానికి సావిత్రిబాయి పూలే పేరు పెట్టారు. భారత ప్రభుత్వం కూడా 1998లో తపాలా బిల్లను ప్రత్యేకంగా విడుదల చేసి గౌరవించింది.

ఆధారాలు:

1. Karl Marx, "Economic Manuscripts: A Contribution to the Critique of Political Economy 1859". www.marxists.org

2. సావిత్రిబాయి ఫూలే కవితలు 'కావ్యఫూలు', (2017). తెలుగు అనువాదం. కృష్ణ.వి.హైదరాబాద్ : అన్వేషి రీసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్ వింగ్.

3. కాత్యాయనీ విద్మహే, ' సారంగ అంతర్జాల పత్రిక, సంచిక: 1 నవంబర్ 2018. తొలి ఆధునిక కవయిత్రి సావిత్రి బాయి ఫూలే – సారంగ (saarangabooks.com)

4. సావిత్రిబాయి ఫూలే – వికీపీడియా (wikipedia.org)
Few poems by Savitribai Phule | Dr. B. R. Ambedkar's Caravan (drambedkarbooks.com)



First Girl's School, Pune

Established by Savitribai Phule

# చార్ ధాం యాత్ర




గుజరాతీ మూలం:
**శ్రీమతి నయనా షా**

తెలుగు అనువాదం :
**డాక్టర్ అంబల్ల జనార్దన్**
88503 49858


అశ్లేష్ మరియు అమీ! చూసేవాళ్లకి అసూయ కలిగేలా ఉన్న జంట వారిది. నిజంగా వారు సౌందర్యంలో మన్మథుడు – రతీదేవి లా ఉన్నారు. చదువులో వారు రెండు రెండు విషయాల్లో డాక్టరేట్ సాధించారు. ఇద్దరూ ఒకే చోట ఉద్యోగం చేస్తున్నారు. ఇద్దరికీ జీతంగా పెద్ద ప్యాకేజీ ఉంది. అశ్లేష్ వాళ్ల తల్లిదండ్రులకు ఏకైక సంతానం. అటు అమీ కూడా వాళ్ల మాతా పితలకు ఒక్కతే సంతానం. ఇద్దరూ సంపన్న కుటుంబాల నుంచి, అపారమైన సంపత్తుల మధ్య పెరిగారు. రెండు కుంటుంబాలు సంస్కార వంతమైనవి. వారింట్లో లక్ష్మి, సరస్వతి వాసమున్నాయి. ఇరు కుటుంబాల్లో వినిపించని ఒకే ఒక శబ్దం "దుఃఖం".

వారి పెళ్లి తర్వత కొన్ని సంవత్సరాలు హాయిగా ఏ చీకూ చింతా లేకుండా గడిచాయి. ఇద్దరూ కలిసే ఉద్యోగాలకు వెళ్లి, కలిసే ఇంటికి వచ్చేవారు. ఆఫీసులో కూడా వారు అందరి మన్ననలను అందుకునేవారు. సుమధుర మాటలతో వారు అందరి మనసులూ గెలుచుకున్నారు.



వారు సుఖంగా ఉండడం చూసి ఎవరికి కన్ను కుట్టిందో, అంతలో అమీ యొక్క అమ్మగారు మెట్లపై నుండి పడగా రెండు కాళ్లు ఫ్రాక్చర్ అయ్యాయి. వాటికి కట్లు కట్టారు. అప్పుడు అశ్లేష్ యొక్క అమ్మగారు "అమీ!

> అమీ పుట్టింట్లో ఉండడానికి వెళ్లింది. కొన్ని రోజులు ఆఫీసుకి సెలవు పెట్టింది.

మీ అమ్మా, నాన్నలను ఇక్కడికే వచ్చి ఉండమను. మన ఇల్లు పెద్దది కదా? వారికి ఇక్కడే నువ్వు సపర్యలు చేయవచ్చు. మాటా ముచ్చటలకు మాకు కూడా బాగుంటుంది." అన్నారు. కాని అమీ యొక్క అమ్మగారు ఒప్పుకోలేదు. తన కూతురు అత్త వారింటికి రావడానికి వెనకాడింది. అప్పుడు అశ్లేష్ వాళ్ల అమ్మగారన్నారు "తల్లీ! మీ అమ్మగారికి మొహమాటంగా ఉండవచ్చు, కాని కూతురు కంటే బాగా తల్లికి ఎవరూ సేవ చేయలేరు. మీ అమ్మగారికి నయమయ్యేదాకా నువ్వు మీ పుట్టింట్లోనే ఉండు. ఇక్కడ మేము బాగానే ఉంటాము. నువ్వసలు దిగులుపడవద్దు. 'నాకు కొడుకు లేనందున కోడలు కూడా లేదు. నన్ను ఎవరు చూసుకుంటారు?' అని మీ అమ్మగారికి అనిపిస్తుండవచ్చు. మీ అమ్మగారికి ఏ కొరతా లేకుండా చూడడం మనందరి బాధ్యత."

అమీ పుట్టింట్లో ఉండడానికి వెళ్లింది. కొన్ని రోజులు ఆఫీసుకి సెలవు పెట్టింది. ఆ తర్వాత అమీ ఆఫీస్ వెళ్లడానికి పూనుకోగానే ఆమె తల్లిగారు కళ్లనీరు పెట్టుకుంది. అమీ అర్థం చేసుకొని, ఆఫీసుకి వెళ్లి తన సెలవు పొడిగించుకుంది. ఆమె తల్లికి అది తెలియగానే "అమ్మా! మా కొరకు నువ్వు ఎంతకని పాటు పడతావు? మీ అత్తగారు నిన్ను మాకు సేవ చేయడానికి పంపడం వారి దొడ్డ మనసును సూచిస్తుంది. లేకపోతే ఈ రోజుల్లో ఎవరు ఎదుటి వారి గురించి అంత ఆలోచిస్తారు? రెండు నెలల నుండి పడకపై ఉన్న నాకు ఎన్నో సపర్యలు చేశావు. మురికి ఐన నా పడక బట్టలు ఉతికావు. నాకు స్నానం చేయించి బట్టలు మార్చావు. నాకు సమయానికి మందులూ, భోజనం సమకూర్చి ఎంతో సేవ చేశావు. ఇంకా ఎన్ని రోజులని నీ ఋణంలో మగ్గ మంటావు?" అన్నారు.

అమీ తన తల్లి తలను నిమురుతూ "అమ్మా! చిన్నప్పుడు నువ్వు నా కొరకు నువ్వు ఎంతో చేశావు. అప్పుడు 'నువ్వు నా కెంతో చేశావని నేనన్నానా? నా కప్పుడు మాటలు వచ్చేవి కావు. సరిగ్గా నడవలేక పోయేదాన్ని. నీ వేలు పట్టుకొని నడవడం నేర్చాను. నా ప్రతి అవసరం నువ్వు, నాన్నగారు తీర్చేవారు. అర్ధ రాత్రి లేచి నేను ఏడిస్తే నన్ను బయటికి తీసుకెళ్లి తిప్పేవారు. ఇవాళ నేను ఇలా బాగా ఉన్నానంటే అది మీ చలవే. ఇక నుంచి నువ్వలా అన్నావంటే నేను మా

అత్తవారింటికి వెళ్ళిపోతాను.” అంది.

తన అమ్మగారికి నయమైన తర్వాత అమీ తన అత్తవారింటికి వచ్చింది. మళ్ళీ తన దైనందిన కార్యక్రమాల్లో మునిగి పోయింది. అమీ వాళ్ల అమ్మగారు, తన వియ్యపురాలికి అప్పుడప్పుడు ఫోన్ చేసి, తన కూతురును తమ ఇంటికి పంపి కష్టసమయంలో ఆదుకున్నందుకు ధన్యవాదాలు చెప్పేది. అశ్లేష్ దంపతులు ఉద్యోగాలకు వెళ్ల సాగారు. కాని వాళ్ల రోజువారీ కార్యక్రమం చాలా రోజులు కొనసాగ లేదు. ఎప్పుడూ క్రమం తప్పకుండా మందులు తీసుకునే అశ్లేష్ వాళ్ల నాన్న గారు అప్పుడప్పుడు మరిచిపోవ సాగారు. అది ఇంట్లో వారికి తెలియదు. అందుకని వారు అతను మందులు తీసుకోవడంపై దృష్టి పెట్టలేదు. దానివల్ల అతనికి పక్షవాతం వచ్చింది. ఎన్ని మందులు వాడినా పడక పట్ట వలసి వచ్చింది. కొన్ని రోజుల్లో నయమౌతుందని డాక్టర్ అభయం ఇచ్చాడు. క్రమం తప్పకుండా ఫిజియో థెరపీ చేయాలని సూచించాడు. అశ్లేష్ అమ్మగారు వయోభారం వల్ల తన భర్తకు సపర్యలు చేయలేక పోయేవారు. అందుకని అశ్లేష్ మరియు అమీ, వంతుల వారీగా సెలవు తీసుకొని ఆశ్లేష్ తండ్రికి సేవ చేశారు. వారు తీసుకొన్న శ్రద్ధవల్ల అతను ఒక ఆరు నెలల్లో కోలుకున్నాడు. కాని ఆ తర్వాత కొన్ని నెలల్లోనే అమీ వాళ్ల అమ్మగారు పరమపదించడంతో వారి కుటుంబంలో మళ్ళీ సంక్షోభం సంభవించింది. ఏకాకి ఐన అమీ వాళ్ల నాన్న గారు డిప్రెషన్ లో కూరుకు పోయారు. జ్ఞాపకశక్తి దాదాపు నశించింది. ఆ పరిస్థితుల్లో వారిని ఒంటరిగా ఉంచడం క్షేమం కాదని, తన కుటుంబ సభ్యుల సలహాపై తన తండ్రిని తమ ఇంటికి తరలించింది అమీ. ఆఫీస్ నుంచి వచ్చాక ఒక పసి పిల్లవాణ్ణి చూసుకున్నట్టుగా సపర్యలు చేయసాగింది. కాని అది చాలా రోజులు కొనసాగలేదు. వారు దేవుని పిలుపుతో తన భార్య దగ్గరకు వెళ్లి పోయారు.

> **వారి కుటుంబంలో మళ్ళీ సంక్షోభం సంభవించింది. ఏకాకి ఐన అమీ వాళ్ల నాన్న గారు డిప్రెషన్ లో కూరుకు పోయారు.**

తన తండ్రి అంత్య క్రియల తర్వాత అమీ ఆఫీస్ కు వెళ్లగానే, వారి బంట్రోతు “అమీ బహెన్! మీరు సెలవుపై ఉన్నప్పుడు నేను చార్ ధాం యాత్రకు వెళ్లొచ్చాను. దానికి కొంత డబ్బు తక్కువైతే అశ్లేష్ అయ్యగారు

సర్దారు. తిరిగి వచ్చి, నేను అయ్యగారిచ్చిన డబ్బు తిరిగి ఇవ్వబోతే తీసుకోలేదు. మీ దంపతులు ఎల్లకాలం చల్లగా ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను. ఈ ప్రసాదం నేను మీ కొరకు అట్టేపెట్టాను, తీసుకోండి." అన్నాడు. వెళ్తూ వెళ్తూ అతను "బెహెన్ వయసులో ఉన్నప్పుడే చార్ ధాం యాత్ర చేయాలి. ముసలితనంలో అవి చెయ్యడం చాలా కష్టం. జీవితంలో ఒక్కసారైనా ఆ యాత్ర చేయాల్సిందే" అన్నాడు.

**మరుసటి సంవత్సరం అమీ గర్భం దాల్చింది. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలు ప్రసవం, పసివాడి ఆలన పాలనలో గడిచాయి.**

అమీ మనసులో ఆ మాట నిలిచి పోయింది. సాయంత్రం ఆమె తన భర్తతో అంది "మనం చార్ ధాం యాత్రకు వెళ్లొద్దాం" సరేనన్నాడతను. ఆఫీసులో కనుక్కుంటే రెండు నెలల తర్వాత ఇద్దరికీ సెలవు దొరుకే అవకాశ ముందని తేలింది. ట్రావెల్ ఏజెంట్ ను సంప్రదించి, రెండు నెలల తర్వాతి టిక్కెట్లు బుక్ చేశాడు. ఆ దంపతులు ఆనందంగా యాత్రకు సన్నహాలు ప్రారంభించారు. ఉన్ని బట్టలు, సూట్ కేసులు మొదలైనవి సమకూర్చుకున్నారు. కానీ, వారు యాత్రకు వెళ్లడానికి రెండు రోజుల ముందు, అశ్లేష్ అమ్మ గారికి ఎదలో నొప్పి మొదలయింది. వెంటనే ఆస్పత్రికి తరలించి పరీక్షలు చేయించగా అది గుండెపోటు అని నిర్ధారించారు డాక్టర్లు. వెంటనే బైపాస్ శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. యాత్ర టిక్కట్లు రద్దు చేశారు.

అమీ అంది "ఇక మనం అత్తగారిని జాగ్రత్తగా చూసుకోవాలి. వారు భోజనంలో పథ్యం పాటించాలి. తినే పదార్థాలకు వంట మనిషిపై ఆధారపడి లాభం లేదు. నూనె, నెయ్యి ఎక్కువగా వేసిన వంటలు ఆమెకు పనికి రావు. అవి అత్తగారికి హాని చేస్తాయి. నేనే వారికి వండి పెట్టాలి. మనం మన చార్ ధాం యాత్రను వచ్చే ఏటికి వాయిదా వేద్దాం." మరుసటి సంవత్సరం అమీ గర్భం దాల్చింది. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలు ప్రసవం, పసివాడి ఆలన పాలనలో గడిచాయి. దాంతో వారు చార్ ధాం యాత్రకు వెళ్లడం కుదరలేదు.

తమ కుమారుని శుశ్రూషలో మునిగిపోయిన అమీ అంది "అశ్లేష్! మన చార్ ధాం యాత్ర ఐపోయింది. మళ్లీ వెళ్తే ఎంత? వేళ్లకపోతే ఎంత?"

"మన చార్ ధాం యాత్ర ఎప్పుడయింది?" ఆశ్చర్యంగా అడిగాడు అశ్లేష్.

అమీ నవ్వుతూ అంది "అశ్లేష్! మనం మీ అమ్మా నాన్నలకు, మా తల్లిదండ్రులకు మొత్తం నలుగురికి సేవ చేశాం. ఆ సేవయే చార్ ధాం. మనం హృదయపూర్వకంగా వారి సేవ చేశాం. అదే మన యాత్ర. ప్రాణం ఉన్న మన పెద్దలను బాగా చూసుకోవడం కంటే ఎక్కువగా, యాత్రలో ఏముంటుంది? మన మాతా పితలే మన దేవుళ్లు. వారి సేవయే మన చార్ ధాం యాత్ర"

అశ్లేష్ అబ్బురంగా ఆమెను అలా చూస్తూనే ఉండి పోయాడు.



పగటిచుక్క
వాడికోరల నోరు తెరచిన
వన్యమృగమును పోలు చీకటి
మనిషిమీదకి దుముకుచున్నది
మధ్యాహ్నవేళ!
పగలుమాసిన ఇరులమూకను
పట్టి చీల్చగ పొడిచె నింగిని
పదను పట్టిన కత్తిమాదిరి
పగటిచుక్క
పట్టపగలే కారుచీకటి
ముట్టడిస్తే మూగవోయిన
పెద్దలంతా చుక్కపొడుపుకి
బొబ్బలు పెట్టిరి
ఇరుల బాధను తొలగజేసే
అరుణతారక వెలుగు సంపద
అడ్డు చెప్పినవారు సైతం
అనుభవిస్తురు

- ఆరుద్ర

# సహేతుకమైన క్రమశిక్షణ యువత భవితకు రక్షణ



శ్రీ కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి
✆ 9948774243

"అక్షిలాంటిది క్రమశిక్షణ పరికింప
మనుజుడెదుగుదలకు మార్గమిదియె!
కళ్ళు లేని నడక కడదాక చేర్చునా?
విమల దివ్యహాస! వేంకటేశ!"

అంటూ నేను రాసిన 'విలక్షణ నేత్రం' అనే శతక కావ్యంలో క్రమశిక్షణ మీద వో పద్యం ఇది. హేతుబద్ధ క్రమశిక్షణ లేని నడత, కళ్ళు లేని నడక లక్ష్యాన్ని అధిగమించలేవు. విచక్షణతో కూడిన క్రమశిక్షణ, సహేతుకమైనదిగా, వ్యక్తి వ్యక్తిత్వాన్ని పెంచుతూ జీవితంలో ధృఢ నిశ్చయం, పట్టుదల, ఓర్పు మొదలైనవి అలవడి, మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుంది. క్రమశిక్షణ వ్యక్తి ఆసక్తిని చేసే పని మీద పెంచుతుంది. దాని వలన సామర్థ్యం పెరుగుతుంది. సామర్థ్యం సహనాన్ని పెంచుతుంది. సహనం అంకితభావాన్ని అలవాటు చేస్తుంది. పని మీద అంకితభావాన్ని కలిగివున్న వ్యక్తి వ్యసనాలకు దూరంగా వుంటాడు. టెన్షన్ని అధిగమిస్తాడు. అప్పుడు జీవితంలో గెలుపు, తనవైపుకు మలుపు తిరుగుతుంది.



ఈనాడు చాలామంది వ్యక్తులు నాగరికులుగా ఉంటారే కాని సంస్కారులుగా వుండరు. మనకు చిన్నతనం నుండి సంస్కారులుగా మారే క్రమశిక్షణ మన పెద్దలు అలవాటు చేయరు. మన ప్రవర్తనను బాహ్యంగా నిగ్రహించుకుంటూ

మనం నాగరికులం అనిపించుకుని సంతోషపడుతుంటాము. మన ప్రవర్తన అంతర్గతంగా నిగ్రహించుకున్నప్పుడే మనం సంస్కారులమవుతాం. ఒకరిపైన మనకు కోపమో, ద్వేషమో వుంటే దాన్ని వ్యక్తం చేయకుండా వుండడాన్ని నాగరికత అంటాము.

**కొన్ని దశాబ్దాల క్రితం కన్నా ఇప్పటి యువత, మరింత మొరటుగా తయారవుతున్నారు.**

ఇతరుల మీద కలిగే కోపాన్ని, ద్వేషాన్ని లోన ఉపశమింపచేసుకొని, అంతరిక శాంతిని అలవరుచుకోవడమే సంస్కారం. అంటే పైకి నిర్మలంగా కనిపించేది నాగరికత. లోపల ప్రశాంతంగా ఉండేది సంస్కారం అవుతుంది. భవిష్యత్ లో వ్యక్తి, వ్యక్తిత్వం పెరగాలంటే ముందు సంస్కారం నేర్చుకోవాలి. సంస్కారహీనమైన చదువు నిరర్ధకము. ఆర్థికంగా బలపడడానికి పనికివస్తుందే కాని నైతికతను పెంచదు. పసితనం నుండి పిల్లలకు తల్లిదండ్రులే సంస్కారం నేర్పాలి. పిల్లలు చేస్తున్న పనికిమాలిన అల్లరిని అదుపు చేస్తూ అట్లా చేయడం వలన కలిగే నష్టాన్ని విప్పి చెప్తూ మంచి మార్గంలో పెట్టాలి తల్లిదండ్రులు. అట్లా కాకుండా, హానికరమైన అల్లరిని అదుపు చేయకుండా ఆనందించే తల్లిదండ్రులు లేకపోలేదు. పైగా అదేదో గొప్ప కార్యం లా "మావాడు ఇంతేనండీ..గోపాల బాలకృష్ణుడులా అల్లరివాడు" అంటూ మురిసిపోతుంటారు కొందరు తల్లిదండ్రులు.

కొన్ని దశాబ్దాల క్రితం కన్నా ఇప్పటి యువత, మరింత మొరటుగా తయారవుతున్నారు. వీరిలో కంగారు ఎక్కువ. 'టైం సెన్స్' తక్కువ. సంస్కారంలో ఒక భాగంగా వున్న 'మానర్స్' అనేది అసలే తెలియదు. 'ఫోన్ మానర్స్', 'స్టేజీ మానర్స్', 'టేబిల్ మానర్స్', చివరకు 'లిఫ్ట్ మానర్స్' కూడా తెలియకుండా నేటి యువత వారి యిష్టానుసారంగా ప్రవర్తిస్తుంటారు. పెద్దలు ఎవరైనా అట్టి యువతను హెచ్చరిస్తే "నీకు బాగా తెలుసులేవయ్యా!" అంటూ ధిక్కరిస్తుంటారు. ఈ పరిస్థితులు యువకుల్లో పొడగట్టకుండా ఉండాలంటే తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో కడు జాగ్రత్త వహించాలి. "మొక్కై వంగనిది మానై వంగుతుందా?" అనే సామెత ఆంతర్యం ఎరిగి వుండాలి. పిల్లల్ని అదుపులో పెట్టుకోవాలి.

ప్రపంచీకరణ ఫలితంగా పెట్టుబడిదారీ వ్యవస్థ సమాజాన్ని వ్యాపార

వస్తువుగా మార్చిపారేసింది. మనకు తెలీని నాగరికతను మనమీద రుద్ది, మనల సంస్కార హీనులుగా మార్చిపారేస్తుంది. వస్తు వినియోగంలో మరబొమ్మను చేసి మనిషిని ఆడిస్తుంది.

క్రమశిక్షణతో పెరగని యువత వైఫల్యాలను చవిచూస్తూ సోషల్ ఫోబియా తో కేరీర్ ను నాశనం చేసుకుంటారు.

శాస్త్రీయమైన దృష్టి, దృక్పథం, సహేతుకమైన భావనాశక్తికి బాసటగా నిలుస్తాయి. లౌకిక జ్ఞానాన్ని పెంపొందింపజేస్తాయి. అభూత కల్పనలను నమ్మకుండా జేస్తాయి. సహేతుకంగా సమస్యను అర్థం చేసుకొని ఆలోచించినట్లయితే ఆ సమస్యకు పరిష్కారమార్గం దొరుకుతుంది. కనుక సహేతుకమైన నిర్ణయాలు మనిషి పురోభివృద్ధికి తోడ్పడతాయి. అది సహేతుకమైన క్రమశిక్షణకు మార్గమవుతుంది.

క్రమశిక్షణ అంటే సహేతుకమైన మార్గంలో తరిఫీదు కావడం. బాల్యం నుంచి పిల్లలకు ఇంట్లో గాని బడిలోగాని క్రమశిక్షణ అలవాటు చేస్తే వారు అధిగమించాల్సిన లక్ష్యాలకు మార్గాన్ని చూపినవారమవుతాము. అనవసరమైన భయాల చిట్టా నుండి దూరం చేసినవారమవుతాము.

క్రమశిక్షణ ముసుగులో పిల్లల్ని మూఢవిశ్వాసాల్లోకి, బానిస మనస్తత్వంలోకి, వ్యక్తిత్వాన్ని జార్చుకునే విలువల్లోకి చాలామంది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నెట్టివేస్తున్నారు. చిలకమర్తివారి 'గణపతి', గురజాడ వారి 'గిరీశం' లా క్రమశిక్షణకు తప్పుడు సంకేతిక నిర్వచనాలు యిచ్చే తల్లిదండ్రులు యింట్లోను, ఉపాధ్యాయులు బడిలోను తయారవుతున్నారు. వీరి వలన యువత తప్పుదారి పడుతుంది. బాధ్యతారహితంగా, మిడిమిడి జ్ఞానంతో మూర్ఖులుగా మారిపోతున్నారు. సంఘంలో చీడపురుగుల్లా తయారవుతున్నారు. విద్రోహశక్తుల్లా ఎదుగుతున్నారు. వీరి వలన దేశ ప్రగతి కుంటుపడే ఆస్కారం వుంది.

క్రమశిక్షణతో పెరగని యువత వైఫల్యాలను చవిచూస్తూ 'సోషల్ ఫోబియా' తో 'కేరీర్' ను నాశనం చేసుకుంటారు. వీరి లక్ష్యాలను సాధించలేరు. సాహసాలు చేయలేరు.

జీవితంలో క్రమశిక్షణ పాటించనివాడు తనను తాను కోల్పోయేవరకు కళ్ళ తెరవడు.

మనచుట్టూ మూఢాచారాలు, చాదస్తం గీసిన రేఖల్ని చెరిపివేయాలంటే మనం సహేతుకమైన క్రమశిక్షణతో జీవితాన్ని మలచుకోవాలి. సువిశాలమైన ప్రపంచాన్ని చూస్తూ సరికొత్త అభిరుచులతో మనల్ని మనం విస్తరించుకోవాలి. సహేతుకమైన క్రమశిక్షణ వలన మనిషికి ఐదు గుణాలు అలవడతాయి 1) స్పష్టత 2) నిర్దిష్టత 3) సాంద్రత 4) సరికొత్త దృష్టి 5) సరైన దృక్పథం. వీని మూలంగా వ్యక్తిలో లోతైన చూపు, అన్వేషణ, వివేచనలు కలుగుతాయి. శాస్త్రీయమైన దృష్టికి నమ్మకం జతకట్టి అకుంఠిత దీక్షతో ప్రయత్నం కొనసాగిస్తే అనుకున్న విజయాన్ని సాధించవచ్చును.

జీవితం కదిలే అల కాదు, రగిలే జ్వాల అనే భావన సహేతుకమైన క్రమశిక్షణతో మెలిగే వ్యక్తులకు తెలుస్తుంది. జీవితంలో క్రమశిక్షణ పాటించనివాడు తనను తాను కోల్పోయేవరకు కళ్ళ తెరవడు. అదే క్రమశిక్షణ అలవరచుకున్నవాడు సత్యాన్వేషణ తత్పరతను, త్యాగనిరతిని కలిగివుండి, వైఫల్యాల మూలాలను అన్వేషిస్తాడు. మారే కాలానికి తన్ను తాను అనుసంధానించుకుంటూ, లక్ష్యసాధన దిశగా మార్గాన్వేషణ చేస్తాడు.

ఏది ఏమైన "సహేతుకమైన క్రమశిక్షణ యువత భవితకు రక్షణ" గా నిలుస్తుంది అనడం సత్యదూరమైన అంశం కాదు. సహేతుకమైన క్రమశిక్షణలో మెలిగినవాడు భావోద్వేగాల కంటే ఇంగితజ్ఞానానికి (కామన్ సెన్స్); ప్రణయ తీవ్రత కంటే పరస్పర గౌరవానికి; ఆర్థిక సమానతల కంటే బౌద్ధిక సమానతలకు ప్రాధాన్యం ఇస్తాడు. తనదైన పద్ధతిలో సృజనాత్మకతను ప్రదర్శిస్తూ, తనదైన ఉనికిని, అస్తిత్వాన్ని పదిలపర్చుకుంటూ, లక్ష్యసాధనతో తనను తాను ఋజువు పర్చుకుంటాడు. భవితకు రక్షణ కల్పించుకుంటాడు.

# ప్రేరణ




మూల హిందీ కథ :
మున్షీ ప్రేంచంద్

తెలుగు అనువాదం:
డాక్టర్ అంబల్ల జనార్దన్
88503 49858


(తెర తెరువగానే వేదిక ఒక మూలన ఉపాధ్యాయుడు కనిపిస్తాడు)

ఉపాధ్యాయుడు: నా క్లాసులో సూర్యప్రకాశ్ కంటే ఎక్కువ దుందుడుకుగా ప్రవర్తించే వాళ్లెవరూ లేరు. నా పది సంవత్సరాల చదువు చెప్పే కాలంలో అంత సమస్యాత్మకమైన విద్యార్థిని నేను చూడలేదు. ఉపాధ్యాయులను ఎగతాళి చేయడం, మంచి విద్యార్థులను పీడించడం అతని నిత్యకృత్యాలుగా ఉండేవి. అతను చేసే కుయుక్తులకు, అతని పన్నాగాలకు అంతే ఉండేది కాదు. అతను సామూహిక అరాచకాలకు అలవాటు పడ్డాడు. తాచెడ్డ కోతి వనమెల్ల చెరిచె అన్నట్టు, సొంత బృందాన్ని ఏర్పరచుకొని తమ అత్యాచారాలతో పాఠశాలలో ఒక భయానక వాతావరణం సృష్టించాడు. బడిలోని సిబ్బందికి అతని బృందమంటే వణుకు పుట్టుకొచ్చేది.

పాఠశాల ఇన్స్ పెక్టర్ తనిఖీకి రావలసి ఉంది. ఆ తనిఖీ గురించి అవసరమైన సూచనలు చేయడానికి వీలుగా విద్యార్థులంతా నిర్ణీత సమయానికి అరగంట ముందే హాజరు కావాలని ప్రధానోపాధ్యాయులు గారు ఆదేశించారు. ఉదయం పది గంటలు కొట్టాయి, ఇన్స్ పెక్టర్ గారు వచ్చి కూర్చున్నారు, కాని పాఠశాలలో ఒక్క విద్యార్థి కూడా లేడు. పదకొండు గంటలకు పంజరం నుండి బయటపడ్డట్టుగా పిల్లలంతా ఒక్కసారిగా బిలబిలమంటూ వచ్చారు. అది చూసి ఇన్స్ పెక్టర్ గారు "క్రమశిక్షణ చండాలంగా ఉంది" అని రిమార్కు రాసి వెళ్లి పోయారు. హెడ్ మాస్టర్ గారికి తలకొట్టేసినట్టయింది. మిగతా ఉపాధ్యాయులంతా అవమానంగా భావించారు. ఆ అల్లరంతా సూర్యప్రకాశ్ దే అని అందరికీ తెలుసు. కాని ఎంత అడిగినా ఎవరూ నోరు విప్పలేదు. అతని పేరు చెప్ప లేదు.

నాకు నా నిర్వహణ సామర్థ్యంపై గర్వంగా ఉండేది. మా ట్రేనింగ్ కాలేజిలో ఆ విషయంలో నాకెంతో పేరు ఉండింది. ఆ దయ్యాన్ని ఎలా దారికి తీసుకు రావాలో అర్థం కాకుండా ఉండింది. మా అధ్యాపక బృందం ఎన్నో సమాలోచనలు జరిపాము, సూర్యప్రకాశ్ ని బడి నుంచి బర్తరఫ్ చేస్తే ఎలా ఉంటుంది? అని కూడా ఆలోచించాము. ఐతే అది మా పరాభవం అంగీకరించి నట్లౌతుందని పక్కన పెట్టాము.

దాదాపు ఇరవై, ఇరవై రెండు మంది అనుభవజ్ఞులైన, శిక్షణ శాస్త్ర అధ్యాపకులు, పన్నెండు- పదమూడేళ్ల ధిక్కరించే విద్యార్థిని అదుపులో పెట్టలేక పోయాము. అతన్ని సంస్కరించ లేకపోయామని నిరాశాజనకంగా ఉండింది. కాని అందరికంటే ఎక్కువ నేను బలిపశువునయ్యాను, ఎందుకంటే అతను నా క్లాస్ విద్యార్థి. అతని ప్రవర్తన యొక్క సెగ నాకెక్కువ తాకేది. నేను బడికి వెళ్ళానంటే 'ఇవాళ ఏ ఉపద్రవం' వస్తుందోనని బిక్కు బిక్కుమంటూ ఉండేవాణ్ణి. ఓ సారి నేను నా బల్ల డ్రావర్ తెరువగానే ఓ కప్ప బయటికి దూకింది. నేను ఆశ్చర్యపోయి వెనక్కి జరిగేసరికి క్లాస్ పిల్లలంతా అల్లరిగా ఘొల్లున నవ్వడం మొదలుపెట్టారు. అక్కడ దూరంగా ఉన్న సూర్యప్రకాశ్ కపటంగా నవ్వసాగాడు. అతని వైపు కోపంగా చూస్తూ నిస్సహాయంగా ఉండి పోయాను. పూర్తి పీరియడ్ వారికి ఉపదేశించడం లోనే గడిచింది. అతను మాత్రం కిందకు చూస్తూ తనలో తాను నవ్వుతూ ఉండిపోయాడు. అతను కింది తరగతుల్లో ఎలా పాసయ్యాడోనని నేను ఆశ్చర్యపోయాను. 'నువ్వు జీవితాంతం ఈ క్లాసులో పాస్ కాలేవు' అని నేను కోపంగా అన్నాను.

సూర్యప్రకాశ్: "మీరు నేను పాస్ కావడంపై ఆలోచించ వద్దు. నేనెప్పుడూ పాస్ ఔతూ వచ్చాను. ఈ క్లాస్ లో కూడా పాసౌతాను."

అధ్యాపకుడు: "అసంభవం"

సూర్యప్రకాశ్: "అసంభవం సంభవమౌతుంది."

అధ్యాపకుడు: నేను ఆశ్చర్యంగా అతన్ని చూస్తూ ఉండిపోయాను. ఎంత బుద్ధిహీనుడైన అబ్బాయైనా తన గెలుపును అంత నిర్భయంగా చెప్పుకోలేడు. అతను ప్రశ్న పత్రాన్ని దొంగిలిస్తాడేమో అనుకున్నాను. 'ఈ సారి అతని ఆటలేవీ సాగనివ్వను' అని గట్టిగా అనుకున్నాను. 'చూస్తాను ఎన్ని సంవత్సరాలు ఇదే క్లాస్ లో మగ్గిపోతాడో.' తనకు తానే భయపడి బడి వదిలి పోవాలి. వార్షిక

పరీక్షల సమయంలో నేను చాలా జాగ్రత్త చర్యలు తీసుకున్నాను. కానీ సూర్యప్రకాశ్ ఉత్తర పత్రాలు చూడగానే నా ఆశ్చర్యానికి హద్దులు లేవు. నా రెండు విషయాల్లోనూ అతనికి అందరికంటే ఎక్కువ మార్కులు వచ్చాయి. నా ప్రశ్నలకు అతను ఏ సందర్భంలోనూ జవాబు ఇవ్వలేడని నాకు చాలా నమ్మకంగా ఉండింది. కాని అతని ఉత్తర పత్రాలు వేరే విధంగా ఉన్నాయి. వేరే విధంగా సందేహించడానికి వ్రాతలో ఏ మాత్రం తేడా లేదు. "సర్! మీరు సూర్య ప్రకాశ్ ఉత్తర పత్రాలు చూశారా?" నేను ప్రిన్సిపాల్ గారిని అడిగాను.

ప్రిన్సిపాల్: (వేదికపైకి వస్తారు) "అదేనయ్యా నాకేమీ తోచడం లేదు."

అధ్యాపకుడు: "సర్! నా స్వభావంతో నేను బహుశా నిరాశావాదిని. సూర్యప్రకాశ్ విషయంలో ఇతర ఉపాధ్యాయులకు ఏ మాత్రం చింత లేదు. అలాంటి వారు బడికి రావడం సాధారణమే అని వారు అనుకొని ఉండవచ్చు. కాని నా విషయంలో అది అది సాధ్యం కాదు. అది అలాగే కొనసాగితే ఒక రోజు అతను జైలుకైనా వెళతాడు, లేదా పిచ్చాసుపత్రిలో తేలుతాడు."

అదే సంవత్సరం నా బదిలీ అయింది. సూర్యప్రకాశ్ లాంటి కంటకపు బాధ తప్పిందని నేను చాలా ఆనందంగా ఉన్నాను. పిల్లలు నాకు ఘనంగా వీడ్కోలు విందు ఇచ్చారు. అందరికందరు స్టేషన్ కి వచ్చి కన్నీళ్లతో వీడ్కోలు పలికారు. నేను కూడా భావోద్వేగానికి గురయ్యాను. నా దృష్టి సూర్యప్రకాశ్ పై పడింది. అతను అందరికంటే వెనకాల సిగ్గుతో తల కిందికి దించి నుంచున్నాడు. అతని కళ్ళల్లో కూడా చెమ్మ కనిపించింది. వెళ్తూ వెళ్తూ అతనికి ఏదైనా ఉపదేశించాలని పించింది. అతను కూడా నాతో మాట్లాడాలాను కున్నాడనుకుంటాను. కాని నేను కానీ అతను కానీ చొరవ తీసుకోలేక పోయాము. అతని సంకోచం క్షమించదగిందే కాని నా అభిజాత్యం క్షమించరానిది. ఆ కరుణ, బాధ సమయంలో కొన్ని నిష్కపట మాటలు అతనిపై ప్రభావం చూపేవేమో. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం, పోడగొట్టుకొని వెదుకు లాడడమంటే అదే. అలాంటి కోల్పోయిన అవకాశాలే జీవిత మేమో. (ఉపాధ్యాయుడు వేదిక మరో పక్కన ఉన్న గ్రామ సెట్ దగ్గరికి వెళతాడు.)

అధ్యాపకుడు: కొత్త చోటు కొత్త అంశాలు తొందరగానే తమ వైపుకు ఆకట్టుకున్నాయి. గతం గతః. నాకెవరూ ఉత్తరం రాయ లేదు. నేను కూడా ఎవరినీ సంప్రదించలేదు. దేవుడు వరమిచ్చినట్టు నాకు ఇంగ్లాండ్ లో

విద్యాభ్యాసానికి అవకాశం కలిగింది. అక్కడ మూడు సంవత్సరాలు గడిచాయి. తిరిగి రాగానే ఒక కాలేజి ప్రిన్సిపాల్ గా అవకాశం వచ్చింది. నా రొట్టె విరిగి నేతిలో పడిందని అనుకున్నాను, కానీ పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయింది. విద్యాశాఖ మంత్రి గారు నన్ను తన ఆధీనంలోకి తీసుకున్నారు. వారు నాపై దయ చూపేవారు కాని, వారికి విద్యా వ్యవస్థపై అస్సలు అవగాహన లేకుండింది. కళాశాల భారం మొత్తం నాపై మోపారు. విద్యా వ్యవస్థపై వారు స్వారీ చేయగా, పగ్గం మాత్రం నా చేతులో ఉండింది. అంటే పేరు ఒకరిది ఊరు ఒకరిది అన్న మాట. ఫలితంగా వారి రాజకీయ ప్రత్యర్థులతో నాకు గొడవలు మొదలయ్యాయి. తాటి చెట్టు కింద ఉండి పాలు తాగినా కల్లు తాగుతున్నానని అనుకున్నారు. వారు నాపై నేరాలు మోప సాగారు. అంతలోనే నా భార్య పరమపదించింది. నా వెన్నెముక విరిగినట్టయింది.

నేను నగరం వదిలి ఒక మారు మూల పల్లెలో ఒక చిన్న బడి తెరిచాను. ఒక చెట్టు నీడలో పిల్లలకు పాఠాలు చెప్ప సాగాను. అది ఎంత పేరు గాంచిందంటే చుట్టు పక్కల ఊళ్లనుంచి కూడా పిల్లలు చదువుకోవడానికి రాసాగారు. చిమ్మ చీకట్లో వారికి ఒక వెలుగు కనబడింది. ఒక రోజు నేను తరగతిలో పాఠాలు చెబుతుండగా ఒక కారు వచ్చి ఆగింది. దాంట్లో నుంచి జిల్లా డిప్యూటీ కమిషనర్ గారు దిగారు.

( డిప్యూటీ కమిషనర్ సూర్యప్రకాశ్ గారు వచ్చి కాళ్లకు నమస్కారం చేస్తారు)

సూర్యప్రకాశ్: "బహుశా మీరు నన్ను గుర్తు పట్టలేదనుకుంటాను"

అధ్యాపకుడు: "నువ్వు సూర్యప్రకాశ్ కాదు కదా?"

సూర్యప్రకాశ్: "ఔను సర్! నేనే ఆ దురదృష్టకర శిష్యుణ్ణి."

అధ్యాపకుడు: "నిన్ను చూసి పన్నెండు–పదమూడేళ్లు ఔతోంది."

సూర్యప్రకాశ్: "ఉపాధ్యాయులు తమ విద్యార్థులను మరిచి పోవచ్చు కాని విద్యార్థులు తమ అధ్యాపకులను మరిచిపోలేరు."

అధ్యాపకుడు: (నవ్వుతూ) "నీ లాంటి విద్యార్థిని మరిచిపోవడం అసంభవం."

సూర్యప్రకాశ్: "ఆ నా అపరాధాలకు మీ క్షమాపణ కోరడానికే నేను మీ

దగ్గరకు వచ్చాను. నేను ఎప్పుడూ మీ గురించి వాకబు చేస్తూనే ఉన్నాను. మీరు ఇంగ్లాండ్ వెళ్ళినప్పుడు ఎన్నో సార్లు మీకు అభినందన ఉత్తరాలు రాశాను కాని, పంపలేక పోయాను. మీరు ఇక్కడ ప్రిన్సిపాల్ అయ్యాక, నాకు ఇంగ్లాండ్ పోవలసి వచ్చింది. అక్కడ వార్తా పత్రికల్లో వచ్చే మీ వ్యాసాలు చదువుతూ ఉండేవాణ్ణి. తిరిగి వచ్చి వాకబు చేస్తే, మీరు రాజీనామా చేసి ఏదో పల్లెకు తరలి వెళ్లారని తెలిసింది. నేను ఈ జిల్లాకు వచ్చి సంవత్సరం ఔతోంది, కాని మీరు ఈ మారు మూల పల్లెటూర్లో ఏకాంత సేవ చేస్తున్నారని ఊహించలేదు. మీకు ఈ మారు మూల పల్లెలో ఎలా తోస్తోంది?"

అధ్యాపకుడు: (తనలో తాను) సూర్యప్రకాశ్ అభివృద్ధికి నా కెంత ఆశ్చర్యానందాలు కలిగాయో చెప్పలేను. అతను నా సొంత కొడుకైనా నా కంత సంతోషం కలిగేది కాదేమో? నేను అతన్ని నా పక్కన కూచోబెట్టుకొని నా చరిత్ర చెప్ప సాగాను. (ఉపాధ్యాయుడు అతనికి చెబుతున్నప్పుడు సంగీతం శ్రుతి మించుతుంది. ఆ మాటలు వినబడవు)

సూర్యప్రకాశ్: "అంటే మీరు, తన వాడని నమ్మిన వ్యక్తి కుతంత్రాలకే బలి అయ్యారు. నా అనుభవం తక్కువే కాని, ఇన్ని రోజుల్లో నాకొక విషయం అర్ధమయింది. మాకు మా కర్తవ్యాలను నిర్వర్తించడంలో చిత్తశుద్ధి లేదు. ఈసారి మంత్రిగారిని కలిస్తే మీకు చేసిన అన్యాయంపై నిలదీస్తాను."

అధ్యాపకుడు: "అబ్బాయీ! అటకపై ఉన్న సంపద వద్దకు చేరుకోవడానికి ఇంకొకరి జీవితాల మెట్లు ఆసరాగా చేసుకోవాల్సిందే. అధికారం, ఆస్తుల వెంట పరుగిడి, పరుగిడి నేను చాలా కోల్పోయాను. నా బలమంతా ఆత్మరక్షణలోనే ఖర్చైపోయింది. ఆ విషయంలో ఆయన తప్పేమీ లేదు. It was like a blessing in disguise. దానికి నేనతనికి కృతజ్ఞతలు చెప్పాలి. కృతకంగా కాదు, నిజం చెబుతున్నాను. అప్పుడు ఆయన చోట్లో నేనున్నా అదే చేసే వాణ్ణేమో. నాకు నా స్వార్థ ఉద్దేశ్యం యొక్క శిక్ష లభించింది. నాకు ఇక్కడ లభించినంత ప్రశాంతత ఇంకెక్కడా లభించ లేదు. ఈ ఏకాంత జీవనంలో నాకు నా జీవిత తత్వాల గురించి మంచి అవగాహన కలిగింది. ఆ అవగాహన దిన దినం పెరుగుతూ పోయింది. ఇక్కడ నా చుట్టుపక్కలా సంతోషం మరియు నిర్మోహమాటం చూస్తున్నాను. ఇక్కడ నాదగ్గరికి వచ్చేవారు, ఏ స్వార్థం కోసమో రారు. నాకు కూడా నా సేవలపై కీర్తికండూతి గాని గౌరవ ఆపేక్షగాని లేవు.

అలా అని నేను సూర్యప్రకాశ్ మొహం వైపు పరిశీలనగా చూశాను. అతని మొహంలో కపట నవ్వు స్థానంలో బాధ కనిపించింది. 'మీరు ఎవరి వల్ల నిరాశ చెందారో అతను ఇవాళ ఇంత పెద్ద హోదాకు చేరుకున్నాడని' తెలుపడానికే నా దగ్గరకు వచ్చాడు అనిపించింది.

నేను వెంటనే మాట మార్చి " నువ్వు నీ గురించి చెప్పు" అన్నాను. "నీలో ఇంతమార్పు ఎలా సాధ్యమయింది? నీ దుండుడుకు చర్యలు జ్ఞప్తికి వస్తే ఇప్పటికీ నా రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ఏ దేవత మహాత్మ్యమో కాకపోతే నీలో ఇంత మార్పు సాధ్య మయ్యేది కాదు."

సూర్యప్రకాశ్: "మీ ఆశీర్వాదాలు నా వెంటే ఉన్నాయి. మీరు వెళ్లిపోయిన కొన్ని రోజులకు నా మేనమామ కొడుకు మోహన్ అదే బడిలో చేరాడు. అతనికి హాస్టల్ లో చేర్చుకోవడానికి ప్రిన్సిపాల్ గారు ఒప్పుకోలేదు. మా మామయ్య కూడా అతన్ని వేరే చోట ఉంచే పరిస్థితిలో లేరు.

వారున్న సంకట పరిస్థితులను గమనించి నేను ప్రిన్సిపాల్ గారితో అన్నాను...

(ఫ్లాష్ బ్యాక్: ప్రిన్సిపాల్ గారు వేదికపైకి వస్తారు.)

సూర్యప్రకాశ్: "సర్! మోహన్ ని నా గదిలో ఉండనివ్వండి."

ప్రిన్సిపాల్: "అది నియమాలకు విరుద్ధం."

సూర్యప్రకాశ్: "అప్పుడు నేను కోపంతో హాస్టల్ గది ఖాళీ చేసి, ఒక అద్దె గదిలో మోహన్ తో ఉండ సాగాను. అతని అమ్మగారు ఎన్నో ఏళ్ల క్రితం చనిపోయారు. అతని బీద, బక్క పల్చని అవతారం చూసి నాకు మొదటి రోజు నుంచే జాలి కలిగింది. ఎప్పుడూ తొమ్మిది గంటల తర్వాత గాని లేవని నేను, పెందరాళే లేచి, అతని కొరకై పాలు వెచ్చ చేసే వాణ్ణి. ఆ తర్వాత అతన్ని లేపి కాలకృత్యాలు తీర్చుకోవడంలో సాయ పడేవాణ్ణి. ఆ తర్వాత మేమిద్దరం బ్రేక్ ఫాస్ట్ చేసే వాళ్లం. ఎప్పుడూ పుస్తకం చేత పట్టని నేను,

అతనికి గంటలు గంటలుగా పాఠాలు చెప్పే వాణ్ణి. నా బాధ్యత పట్ల అంత అవగాహన ఎలా కలిగిందో నాకిప్పటికీ ఆశ్చర్యమే. నా మిత్రులు నన్ను ముసలి బామ్మ అని ఎగతాళి చేసే వారు. నేను నవ్వి ఊరుకునేవాణ్ణి. నేను అతని వద్ద ఒక్క అపశబ్దం కూడా పలుక లేదు. నన్ను చూసి అతను కూడా చెడి పోతాడని భయమేసేది. అతను నన్ను ఆదర్శంగా తీసుకోవాలనుకునేలా నా ప్రవర్తన

ఉండేది. రాత్రి పన్నెండు గంటలదాకా మిత్రులతో పోచికోలు కబుర్లతో కాలక్షేపం చేసి ఉదయం తొమ్మిది తర్వాతే లేవడం, ఉపాధ్యాయుల కళ్లు గప్పి బడి నుండి ఉడాయించడం, వగైరాలన్నీ వాటికవే ఆగిపోయాయి. దేవున్ని ఎగతాళి చేసే నేను, మోహన్ సాన్నిధ్యంలో పక్కా ఆస్తికునిగా మారాను. అతను ఎంతో అమాయకంగా అడిగే వాడు...

(వేదిక మధ్యలో మోహన్ తో అన్ని సన్నివేశాలు చూపించబడతాయి)

మోహన్ : “దేవుడు అన్ని చోట్లా ఉన్నాడంటారు కదా? నాలో కూడా ఉండొచ్చా?”

సూర్యప్రకాశ్: ఆ ప్రశ్నకై అతన్ని హేళన చేయడం నాకు సాధ్యం కాలేదు. “ఔను. దేవుడు నీలో, నాలో అందరి వద్దా ఉండి మనల్ని రక్షిస్తాడు. సంవత్సర కాలంలో మోహన్ లో ఊహించని మార్పు అగుపడింది.” ఒక రోజు మామయ్య గారు వచ్చి, మోహన్ లో వచ్చిన మార్పు గమనించి డగ్గుత్తికతో..

మామయ్య : “అబ్బాయ్! నువ్వు వీడికి పునర్జన్మ నిచ్చావ్. నేనైతే వీడిపై నిరాశ చెంది నీళ్లొదులుకున్నాను. ఈ ఘన కార్యం చేసినందుకు నిన్ను భగవంతుడు ఆశీర్వదిస్తాడు. వీడి అమ్మ స్వర్గం నుండి నీకు ఆశీర్వచనాలు పలుకుతోంది.”

అధ్యాపకుడు: మోహన్ కూడా నిన్ను చాలా ప్రేమిస్తుండవచ్చు.”

సూర్యప్రకాశ్: “అతను నన్ను క్షణం కూడా నన్ను విడిచి ఉండేవాడు కాదు. నాతోనే ఉండడం, తినడం, పడుకోవడం అన్నీ నాతోనే. వాడికి నేనే అన్నీ.” ఇవాళ అతను మన మధ్య లేడు కాని, నాలో అతను ఇప్పటికీ జీవించి ఉన్నాడు. ఇవాళ నేను అతని వల్లే ఇలా ఉన్నాను. ఏదో దైవ కృపవల్ల తను నా జీవితంలోకి రాకుండా ఉంటే నేను ఇవాళ ఏ జైల్లోనో మగ్గుతూ ఉండేవాణ్ణి. ఒక రోజు నేనన్నాను “నువ్వు గనక రోజూ స్నానం చేయకపోతే నేను నీతో మాట్లాడను.”

మోహన్ : “అలా అనకు అన్నయ్యా! నేను రోజూ స్నానం చేస్తాను.”

సూర్యప్రకాశ్: “ఎందుకో మోహన్ కి స్నానం చేయడమంటే ఇష్టముండేది కాదు. నా హెచ్చరికతో ఎంత చలిలోనైనా, ఎంత చల్లని గాలి వీస్తున్నా అతను క్రమం తప్పకుండా రోజూ స్నానం చేసే వాడు. అతను నాతో మూడు సంవత్సరాలు ఉండి నాకు వెలుగునిచ్చి, తను చీకటిలో విలీనమైపోయాడు.

అవి వేసవి సెలవులు. రెండు వేసవి సెలవుల్లో మోహన్ నాతోనే ఉన్నాడు. మామ ఎంత బతిమాలినా అతను వెళ్లలేదు. అప్పుడు కాలేజిలో కాష్మీర్ యాత్ర ప్రతిపాదించి, నన్ను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఎన్నో ఏళ్లుగా నేను కోరుకున్న కోరిక తీరబోతోంది. ఆ అవకాశం నేను వదల దలచు కోలేదు. మోహన్ ని మామయ్య దగ్గరకు పంపించి నేను కాష్మీర్ యాత్రకు బయలుదేరాను. రెండు నెలల తర్వాత నేను తిరిగి వచ్చే సరికి మోహన్ జబ్బు పడ్డాడని తెలిసింది. నేను అతన్ని చూడడానికి వెళ్లాను. నన్ను చూడగానే అతని ఎండి పోయి పాలిపోయిన మొహంలోని కళ్ళల్లో మెరుపు కనిపించింది. "రెండు నెలల్లోనే నీ స్థితి ఇలా ఎందుకయింది మోహన్?"

మోహన్ : "మీరు కష్మీర్ సైరుకి వెళ్లారు, నేను ఆకాశంలోకి సైరుకి వెళ్తున్నాను"

( ఆ తర్వాత అతను చనిపోతాడు. "మోహన్" అని సూర్య గట్టిగా అరుస్తాడు. లైట్లు ఆరిపోతాయి)

సూర్యప్రకాశ్: "ఈ దుఃఖ భరితమైన ఉదంతంతో నేను ఏడ్వడం గాని ఏడ్పించడం గాని చేయదల్చుకోలేదు. నేను కాష్మీర్ వెళ్లిన తర్వాత మోహన్ ఎంతో శ్రద్ధతో చదువసాగాడు. సంవత్సరం చదువంతా రెండు నెలల్లోనే పూర్తి చేసి, నేను తిరిగివచ్చింతర్వాత నా నుండి ప్రశంసలు అందుకోవాలని ఆశించాడు. నేను ఎలా అతనివెన్ను తడతాను? ఎలా శాభాష్ అంటాను? నా మిత్రుల ఎదుట ఎలా ప్రశంసిస్తాను?అనే ఆలోచనలు అతన్ని వశ పరచుకున్నాయి. ఆ ప్రేరణే నన్ను కఠిన పరీక్షల్లో గట్టెక్కించింది. లేకపోతే నేను, మీరు ఎప్పుడూ చీదరించుకునే విద్యార్థిగా ఉండి ఎందుకూ పనికి రాకుండా పోయేవాణ్ణి. సరే గురువు గారూ! నేను మీ సెలవు తీసుకుంటాను. ధన్యవాదాలు.

అధ్యాపకుడు: "ఆనందంగా ఉండు" ( సూర్యప్రకాశ్ వెళ్తుండగా అధ్యాపకుడు చూస్తుంటాడు.) ఆ తర్వాత నేను ఎన్నో సార్లు సూర్యప్రకాశ్ ని కలిశాను. అతను కూడా ఈ వైపు వచ్చినప్పుడు నన్ను కలువకుండా పోడు. మోహన్ ని అతను తన జీవితాన్ని మలుపు తిప్పిన ప్రేరణగా తీసుకున్నాడు. అతన్ని తన ఇష్టదైవంగా భావించాడు. మానవ జీవితంలోని ఆ వైచిత్రి, నాకు ఇప్పటికీ అర్థం కాదు.

సమాప్తం

# విలక్షణ సాహితీ నక్షత్రం – ఆరుద్ర



**ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**
darlahcu@gmail.com

తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియల్లో తనదైన ప్రత్యేకతను సాధించిన వారిలో 'ఆరుద్ర'ఒకరు. ఆరుద్ర పూర్తి పేరు భాగవతుల సదాశివ శంకరశాస్త్రి. వీరికి మరికొన్ని కలం పేర్లు ఉన్నప్పటికీ, 'ఆరుద్ర' అనే పేరునే శాశ్వతం చేసుకొని తన జీవితాంతం వరకూ ఆ పేరుతోనే రచనలు కొనసాగించారు. కవిగా, కథకుడుగా, పాత్రికేయుడుగా, విమర్శకుడుగా, పరిశోధకుడిగా, సాహిత్యచరిత్ర కారుడుగా సాహితీ ప్రపంచలో ఎంతో గుర్తింపు పొందారు. ఈయన 1925 ఆగష్టు 31వ తేదీన శ్రీమతి వెంకటజోగమ్మ, శ్రీనరసింగరావు దంపతులకు విశాఖపట్టణంలో జన్మించారు. ఈయన ఇంటిపేరు 'భాగవతుల' అని కొంతమందికి తెలిసినా, వీరి వంశవృక్షాన్ని గమనిస్తే 'ఆదిభట్ల అని తెలుస్తుంది. వీరి వంశంలో మూలపురుషుడు సీతారామ భాగవతి. ఈయన భాగవతాన్ని చదివి వినిపిస్తూ, గ్రామీణులకు తగువులు తీర్చడంలో కూడా సాయపడే వారట. అందువల్ల 'భగవతి గారు' కాస్తా భాగవతం చదవటం వల్ల 'భాగవతులు' గా మారిపోయి భాగవతుల ఇంటిపేరుగా స్థిరపడి పోయింది.



## ఆరుద్ర విద్యాభ్యాసం:

ఆరుద్ర విద్యాభ్యాసం విశాఖపట్టణంలోని శివరామయ్య బడిలోను, ఏ.వి.ఎమ్ కాలేజీలో గల హైస్కూలులోను జరిగింది. విజయనగరంలోని ఎం.ఆర్. కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యకోసం చేరినప్పటికీ క్విట్ఇండియా ఉద్యమం ఉధృతంగా కొనసాగుతుండడం వల్ల దానిలో చేరిపోయి చదువుని సగంలోనే

ఆపేశారు. కానీ, తండ్రి తెచ్చిన పుస్తకాలను మాత్రం బాగానే చదివేవారు. హిందూరీడిరగ్ రూములో పిట్టకథలు, డిటెక్టివ్ నవలలు, ప్రబంధాలు ఎక్కువగా చదువుకునేవారు. అయితే స్కూలు ఫైనల్ వరకూ తెలుగుని ఒక సబ్జెక్టుగా చదవలేదు. డిగ్రీల కోసం చదివిన చదువు ఫైనల్ వరకూ తెలుగుని ఒక సబ్జెక్టుగా చదవలేదు. డిగ్రీల కోసం చదివిన చదువు కాకుండా విజ్ఞానార్జనే ధ్యేయంగా వీరి విద్యాభ్యాసం కొనసాగింది.



ఆరుద్ర కుటుంబం మొదటి నుండీ సాహితీ వాతావరణం కలిగిందే. అయినప్పటికీ, వీరి కుటుంబం ఉండే వీధిలోనే సుప్రసిద్ధ సాహితీవేత్తలు అబ్బూరి రామకృష్ణారావు, పింగళి లక్ష్మీకాంతం మొదలైనవారు ఉండటం, వారితో తరుచుగా ఆరుద్ర కలవటం జరుగుతుండేది. అంతేకాక, శ్రీశ్రీ స్వయంగా ఆరుద్రకు బంధువు కావటం వల్ల కూడా ఆయనకు సాహిత్యాభిలాష మరింతగా పెరగడానికి దోహదపడింది. సాహితిలోకంలో ప్రముఖులైన నారాయణబాబు, రావిశాస్త్రి, చాసో, రోణంకి అప్పలస్వామి మొదలైన వారి పరిచయం ఆరుద్రలో సాహితీ పిపాసను మరింతగా ద్విగుణీకృతం చేసింది. ఈయన రోణంకి వారి నుండి పాశ్చాత్య కవీతారీతుల్ని, సాహిత్యస్వభావాన్ని అవగాహన చేసుకున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాహిత్యంలో వస్తున్న కొత్త ధోరణులను పఠాభి, కొడవటిగంటి కుటుంబరావుల పరిచయం వల్ల ఆకళింపు చేసుకున్నారు. ఆరుద్రలో అభ్యుదయ దృక్పథం కనిపించడానికి కూడా రోణంకివారే ప్రధాన కారకులు. చాసోవల్ల కమ్యూనిస్టుగాను, సెట్టి ఈశ్వర రావు వల్ల కమ్యూనిష్టు పార్టీ సభ్యుడుగాను చేరి, కోగంటి గోపాలకృష్ణయ్య గారి కవిత్వాన్ని చదవటం వల్ల ఆరుద్రగారు మార్క్సిస్టు భావజాలాన్ని మరింతగా అధ్యయనం చేశారు. వీరందరి సాహచర్యం ఆరుద్రలో సాహితీ పిపాసను, అభిరుచిని పెంపొందించి ఒక స్పష్టమైన అవగాహనను కలిగించింది.

## పొట్టకూటి కోసం కోటివిద్యలు:

రెండవ ప్రపంచయుద్ధం జరుగుతున్నప్పుడు ఫాసిజానికి వ్యతిరేకంగా యుద్ధం చేయాలని 1942లో సాయుధసైన్యంలో ఆరుద్ర చేరారని వీరిపై

పరిశోధన చేసిన ఎల్. సంగయ్య పేర్కొన్నారు. కానీ, ఆరుద్ర కవిత్వం గురించి పరిశోధన చేసిన ఆర్. నరసింహారావు మాత్రం సి.పి.ఐ ప్రజాయుద్ధ పంథాను బలపరచటం కోసమూ, మరికొన్ని పరిస్థితుల ప్రాబల్యం చేతనూ చదువుకి స్వస్తి చెప్పి ఆరుద్ర 1943లో సైన్యంలో చేరారని వివరించారు. ఆర్వీయార్ 'కవిపుంగవులు' అనేవ్యాసంలో పొట్టకూటి కోసమే సైన్యంలో చేరారంటే సబబుగా ఉంటుందని అన్నారు. అయితే, ఆరుద్ర తన 'బయోడేటా'లో రాయల్ ఇండియన్ ఎయర్ ఫోర్స్‌లో 1943–46 మధ్య జనరల్ డ్యూటీస్ క్లర్క్‌గానూ, బ్యాండ్ మ్యూజీషియన్ అప్రంటీస్ గానూ పనిచేసినట్లుంది. ఆ తరువాత ఆరుద్ర ఎయర్ ఫోర్స్‌లో పనిచేశారు. అప్పుడే ఫ్రెంచి భాషను నాలుగు ఫారాలు వరకు నేర్చుకున్నారు. యుద్ధం ముగిసిన తర్వాత, ఉద్యోగం కోల్పోవడంతో, మద్రాసు లో ఉన్న తన బంధువు శ్రీశ్రీ దగ్గరకు చేరుకొని ఉద్యోగ ప్రయత్నాలు మొదలు పెట్టి, ఆనందవాణి పత్రికలో సంపాదకుడుగా పని సంపాదించుకున్నారు. ఆ జీతం సరిపోక, ''రెండు రకాల నాలుకలు లేక'' ఆనందవాణి నుంచి విరమించుకొని విశాఖపట్టణం చేరుకున్నానని ఆయనే స్వయంగా చెప్పుకున్నారు.

### ఫోటోగ్రాఫర్– గుమస్తా:

విశాఖపట్టణంలో కొన్నాళ్ళపాటు లైకో గ్రాఫ్‌ఫోటో స్టుడియోలో ఫోటో గ్రాఫర్ గానూ, హార్బర్‌లో గుమస్తాగానూ పనిచేసేవారు. విశాఖపట్టణం జీవితాన్ని చూస్తే 'ఇంతేనా జీవితపరమార్థం' అనిపించేదనీ, స్వల్పమైన ఆశయాలతో అల్పమైన జీవితాన్ని జాపారుస్తూ ఈడ్చుకొంటూబతికే లిల్లీపుట్లపై జాలివేసిందనీ, అందువల్ల తాను కలకత్తా వచ్చేశాననీ, కవి సోమసుందర్ గార్కి 25 ఏప్రియల్ 1948లో రాసిన లేఖలో ఆరుద్ర పేర్కొన్నారు. జీవితమంటే విసిగి విసిగి తనకు కావలసిన 'జీవితం' దొరక్క కలకత్తా చేరుకున్నానని చెప్పుకున్నారు. మళ్ళీ కొన్ని నెలల తరువాత మద్రాస్ చేరుకున్నారు. తనకి అనుభవం ఉన్న జర్నలిజంలో మళ్ళీ చేరాలనుకున్నారు. 'ఢంకా' కార్యాలయానికి వెళ్ళి రోజంతా ప్రూఫులు దిద్దితే, రోజుకో రూపాయ లభించేది. దానితో సినిమాలు చూసేవారు. న్యాపతినారాయణమూర్తి ఒకపత్రిక ప్రారంభించబోతున్నారని తెలిసి, దానిలో ఉద్యోగం కోసం ప్రతిరోజూ ఆయన్ని కలుస్తుంటే, పత్రిక ప్రారంభించే వరకూ ఏదైనా ఉద్యోగం చూపిస్తానని, దాన్ని చేయమని చెప్పి, రాజరాజేశ్వరి ఫిలిం కంపెనీలో చేర్పించారు. ఇక్కడ నుండే సినీరచయితగా ఆరుద్ర జీవితం

ప్రారంభమైంది. ఎన్ని సమస్యలు వచ్చినా, ఆరుద్ర నిత్యం వివిధ పుస్తకాలను అధ్యయనం చేస్తుండేవారు. ఎన్నివృత్తులు చేసినా ప్రవృత్తిని మాత్రం సాహిత్యాన్ని రాయడానికే కేటాయించుకొనేవారు.

## ఆరుద్ర రచనా విశేషాలు:



ఆరుద్ర హైస్కూల్‌లో చదివేటప్పుడు 'చిట్టి తమ్ముడు' గేయం రాసినా, మొట్టమొదటి కవితగా 'నా కలంలో ' 1939 చిత్రగుప్తతో ప్రచురితమైనదేనని తెలుస్తుంది. అయితే, 'చిట్టితమ్ముడు' కవితని ఆరుద్ర మొదటి కవితగా కొందరు పేర్కొనగా 'నా కలలో' కవిత మొదటిదని మరికొంతమంది అంటున్నారు. మొదట్లో భాగవతుల శంకరశాస్త్రి పేరుతో 'ప్రజాబంధు' ఆంధ్రపత్రిక, 'పెంకి పిల్ల', వినోదిని మొదలైన పత్రికల్లో 1942 నాటికి ఇరవై నాలుగు కవితలు రాశారు. వాటిలో స్పార్కులు మాత్రమే ఉన్నాయని తానే పూర్తి మార్కులు ఇవ్వలేనని ఆరుద్ర చెప్పుకున్నారు.1942 ఏప్రిల్ 6వ తేదీన విశాఖపట్టణం పై జపాన్ బాంబుల వర్షం కురిపించినపుడు 'లోహవిహంగాలు' కవిత రాశారు. దాన్ని శ్రీశ్రీ కూడా మెచ్చుకున్నారు. అయితే దానిపై పఠాభి ప్రభావం కన్పిస్తుంది. ఈ విషయం ఆరుద్ర చెప్పుకొన్నారు కూడా!" తరువాత తన సొంత బాణీలో రచనలు కొనసాగించారు.

## త్వమేవాహమ్:

1948 జూలై 10వ తేదీన కృష్ణాపత్రిక లో పడిన ఒక వార్తకు స్పందించి ఈ త్వమేవాహమ్ కావ్యాన్ని ఆరుద్ర రచించారు. ఇది 1949 జూలైలో తెలుగు స్వతంత్ర లో ప్రచురితమైంది. రజాకార్ల చేతిలో దోపిడీకి గురైన ఒకామె రైలులో ప్రయాణం చేస్తూ బట్టలు విప్పేసి నగ్నంగా నిలబడింది. ఎందుకలా చేశావని ప్రయాణీకులు అడిగారు', రజ్వీ దురంతాలు, కాందిశీకుల కష్టాలు, నైజాం కిరాతకులు పెట్టిన హింస ఆమె వివరించగా, దాన్ని "నాకా సిగ్గు? నా స్త్రీత్వం ఎప్పుడో పోయింది"! అనే పతాక శీర్షికతో రజాకార్ల చేత చెరచబడ్డ ఈ స్త్రీ కథనం తెలుగు స్వతంత్రలో ప్రచురితం కావడంతో, ఆ వార్తను చూసి ఆరుద్ర త్వమేవాహమ్ కావ్యాన్ని రాశారు. దీనికి మొదట్లో 'తెలంగాణా' అని ఆరుద్ర పేరు పెడితే దాన్ని శ్రీశ్రీ 'త్వమేవాహమ్' అని మార్చమని సలహా ఇచ్చారు.

ఈ కావ్యం తెలంగాణా పోరాటానికి సంబంధించింది. 'తెలంగాణా' రజాకార్ల దురంతాల వల్ల పీడింపబడిన యువతి దీనగాథ ఈకావ్య రచనకు ప్రోద్బలమైనా, తద్వారా కాల స్వభావాన్ని ఆధునిక సంఘచరిత్రని వివరించడానికి అది ఒక మౌలికాంశంగా నిలిచింది. దీనిలో ఒక ప్రత్యేకత ఏమిటంటే ఆరుద్ర తాను తెలంగాణాకే పరిమితం కాకుండా, సమస్త మానవ కల్యాణాన్ని కోరే అభ్యుదయ దృక్పథంలోకి పయనిస్తారు.



ఈ కావ్యంలో అనేక ప్రతీకలు వాడుకొన్నారు. ఈ కావ్యంలో వాడిన ప్రతీకల గురించి ఆరుద్ర దాశరథికి రాసిన 'లేఖ' కావ్యవస్తువును అవగాహన చేసుకోవడానికి ఎంతో ఉపకరిస్తుంది. ఈ కావ్యానికి శ్రీశ్రీ రాసిన లఘుటిప్పణి కూడా ఎంతో విలువైంది. హరీంద్రనాథ ఛటోపాధ్యాయ రచన "Tales of Telangana" ను ఆరుద్ర అనువాదం చేశారు. తాను ప్రత్యక్షంగా చూసి, పాల్గొని, అనుభవించి రచించిన కావ్యం కాకపోయినా త్వమేవాహమ్ తెలంగాణా ప్రజలతో "నువ్వే నేను" అనే ఏకత్వాన్ని ప్రకటించింది. వారి బాధల్ని ప్రతి స్పందింప చేసింది. ఆలోచనా పరులైన పాఠకులు దీన్ని మెచ్చినంతగా సామాన్య పాఠకులు అర్థం చేసుకోలేరని కావ్యశిల్పక్లిష్టతే దీనికి కారణమని విమర్శించిన వారున్నారు. రోణంకి అప్పలస్వామికి అంకితం చేసిన ఈ కావ్యం వెలువడేనాటికి కె.రామలక్ష్మి తో ఆరుద్రకు పరిచయం లేదు. అయితే ఆమె "ఈ నాటికీ నేను త్వమేవాహమ్ వింత పడుతూనే చదువుతాను. ఇప్పటికీ శ్రీశ్రీ వివరణ తరువాత కూడా నాకు పూర్తిగా అర్థం అయిందని అనుకోను" అని అన్నారామె. ఈ త్వమేవాహమ్ లో చాలా ప్రసిద్ధమైన కవితా ఖండిక

"నువ్వు ఎక్కదలచుకొన్న రైలు  
ఎప్పుడూ ఒక జీవితకాలం లేటు  
ఏళ్ళూ పూళ్ళూ నిరీక్షించలేక  
ఎక్కేస్తా వేదో ఒక బండీ" (త్వమేవాహమ్,1999–23)

త్వమేవాహమ్ లో ప్రధానంగా మార్క్సిస్టు దృక్పథం కన్పిస్తుంది. ఆరుద్ర చేసిన కవిత్వ ప్రయోగవాద ధోరణి కూడా దీనిలో కన్పిస్తుంది.

సినీవాలి:

ఆరుద్ర 1960లో ఆవిష్కరించిన ఈ కావ్యం, సినీనటుడు జగ్గయ్యకు అంకితమిచ్చారు. సినీవాలి అంటే అమావాస్యనాడు కన్పించే వెన్నెల. ఆరుద్ర సినీవాలి కావ్యం రాయక ముందే కేంద్రసాహిత్య ఆకాడమీ వారి 'కావ్యమాల' కవితా సంకలనంలో కాటూరి వెంకటేశ్వరరావు ఆరుద్రను పరిచయం చేస్తూ 'సినీవాలి' అనే కావ్యం రాసినట్లు పేర్కొన్నారు. దాన్ని తరువాత ఆరుద్ర నిజం చేశారు. ఈ సినీవాలిలో సాహిత్యోపనిషత్ పేరుతో శ్రీశ్రీ, వరదలతో తర్కించిన కావ్య లక్షణాలను చేర్చారు. వీటిలో శ్రీశ్రీ అభిప్రాయాలుగా...

"చూశావా ఆరుద్రా ఒక తమాషా
సంప్రదాయం నిలిచే ఉంటుంది హమేషా
మూఢాచారాలు మారుతూ ఉంటాయి నిజం
కానీ, సంప్రదాయం తాత ముత్తాతల నాటి ధనం
జాతికి జీవన నాళిక
జానపద గీతిక" –(సినీవాలి,1990: 20)

"నిన్నటి మహాకావ్యం పద్దెనిమిది పర్వాలైతే
నేటి మహాకావ్యం పద్దెనిమిది పేజీలే" – (సినీవాలి, 1990–21)

ఆరుద్ర అభిప్రాయాలుగా ఈ సాహిత్యోపనిషత్తులోనే కొన్ని చాలా ప్రసిద్ధమైనవి కన్పిస్తున్నాయి.

"కావ్యం ఏదైనా సరే కనీసం ఒక రిక్వైరుమెంటు
కావాలి కవిత హృదయానికి నరిష్మెంటు
కారాదు ఏనాడు మెదడుకి పనిష్మెంటు" (సినీవాలి, 1990–22)

"మంచి రచన చదివాక బాగా భోంచేసినట్టుండాలి
కొంచెం బాధపడాలి చింమకొన్నట్టుండాలి
మనస్సుకి జ్వరం రావాలి ఒళ్ళు తిరగాలి
ఈ బాధలోంచే తేరుకొని బాగు పడాలి" (సినీవాలి,1990–23)

'సినీవాలి' కావ్యంలో కథనాయకుడు సూర్యారావు మధ్యతరగతి జీవితానికి ప్రతినిధి. అతని జీవితమంతా నిరాశామయం. ఆమూలాగ్రం నిరాశా వాదం కనిపించినా రాబోయే జీవిత కాలంలో ఈ చీకటి పోయి వెలుగు వస్తుందనేది ఈ కావ్య నామం సూచిస్తుంది. దీనిలో నగర వర్ణన కూడా ప్రముఖంగా కనిపిస్తుంది.

తద్వార యాంత్రిక జీవనాన్ని ఆరుద్ర వివరించారు. ఈ కావ్యంలో మరికొన్ని ప్రసిద్ధ ఖండికలు

"కల నిజపరచడం కాదు కవిత్వం
నిజాన్ని కలగనడమే దాని తత్త్వం" (సినీవాలి, 1990–25)

"జీవితం రేడియో సెట్టుకి
భర్త ఏరియల్ భార్య ఎర్తు" (సినీవాలి, 1990–56)

సినీవాలి కావ్యంలో యాంత్రిక నాగరికత, యాంత్రిక జీవితాలు వీటిని కథా వస్తువులుగా స్వీకరించినపుడు వాటిని వర్ణించడానికి యాంత్రిక నాగరికతలోని వస్తువులనే ఉపమానాలుగా స్వీకరించడం నవ్యత మాత్రమే కాక ఉచితం కూడ. వివిధ అంశాలపై ఇంతకు ముందెవ్వరూ ఊహించని కొత్త అర్థాలు, దర్శించని కొత్త కోణాలు ఈ కావ్యంలో కనిపిస్తాయి. అయితే ఈ కావ్యాన్ని ముగించటంలో ఆరుద్ర చేసిన వర్ణనను పరిశోధకులు ఎల్. సంగయ్య తన సిద్ధాంత గ్రంథంలో ఇలా వ్యాఖ్యానించారు. "కాలం తాడు మూడు పేటలు–భూత, వర్తమాన భవిష్యత్కాలాలు. భవిష్యత్తు మీద ఆశ గురించి పిల్లల భవిష్యత్తు గురించి తాను బ్రతకాలనుకొన్నాడు. పిల్లలే అతనికి ఆశాకిరణాలు. అదే సినివాలి ముగింపు. ఆ కారణాలు ఆలోచింపజేసేవి తద్వారా సందేశాలిచ్చేవి. ఆశయాల ఆచరణకు పురికొల్పేయి."

## కూనలమ్మ పదాలు:



ఆరుద్ర 14 కూనలమ్మ పదాలను ఆంధ్రప్రభలో మొట్టమెదటి సారిగా1960లో ప్రకటించారు. మిత్రులు మరిన్ని రాయమని ప్రోత్సహించడంతో 1963 మార్చి 'జ్యోతి' మాసపత్రిక రెండవ సంచిక నుండి కూనలమ్మ పదాలను విస్తృతంగా రాశారు. 1964 లో పుస్తక రూపంలో ప్రకటించారు. చిన్న, చిన్న పాదాలలో అంత్య ప్రాసలు పాటించి రాసినట్లైతే వీనులవిందుగా ఉంటుందని హృదయపువీణను మీటుతాయని వీటిని ఆరుద్ర భావించారు. కూనలమ్మ పదాలనేని ఆరుద్ర కంటే ముందే ఉన్నాయి. నన్నెచోడుడి నాటికే ఈ పదాలు చాలా ప్రచారంలో ఉండేవని ఆరుద్ర భావిస్తున్నారు. 'కూన' అంటే చిన్న అని భావం. వీటిని కూన



పదాలు అని కూడా అంటారు. ప్రాచీన కూనలమ్మ పదాలు వంటి వాటిని 'విజయరాఘవ కల్యాణము' అనే యక్షగాన కృతికర్త విజయ రాఘవ నాయకుని ఆస్థాన కవి కోనేటి దీక్షిత చంద్రుడు వీటికి పారడీలు రచించినట్లు తెలుస్తుంది. అయితే 'ఓకూనలమ్మ!' అనే మకుటంతో గల ఎనిమిది పదాలను వేటూరి ప్రభాకరశాస్త్రి సేకరించారు. 1930 భారతి మాసపత్రికలో వీటిని వివరించారు. కూనలమ్మ పదాలలో మూడు పాదాలు ఉండి నాలుగోపాదం. మకుటం "ఓకూనలమ్మ"! ఉంటుంది. కూనలమ్మ అనేది గ్రామదేవత అయి ఉంటుందని పరిశోధకులు భావిస్తున్నారు. పోతురాజు భార్య అని కృష్ణశ్రీ పేర్కొంటున్నారు. ఈ పోతురాజు పార్వతీదేవికి ఉన్న ఏడుగురు కూతుళ్ళకూ కాపలా కాసేవాడు అని కృష్ణశ్రీ అనే పరిశోధకుని అభిప్రాయం. ఆరుద్ర రాసిన కూనలమ్మ పదాలలో రాజకీయ, సామాజిక, నీతి, శృంగారం, వేదాంత, అధిక్షేప, హాస, అభినందాత్మకాలుగా వివరించే అవకాశం ఉంది.

కవుల గురించి ఆరుద్ర రాసిన కొన్ని కూనలమ్మ పదాలు పరిశోధనలో 'కవి'ని వివరించడం కంటే మంచి సృజనాత్మకంగా, చమత్కారపూర్వకంగా వర్ణించడాన్ని తెలుసుకోవచ్చు. దేవులపల్లి కృష్ణశాస్త్రి గురించి ఇలా వర్ణించారు.

ఆకులో ఆకునైపోతానన్నా,  
నవ్విపోదురుగాక నాకేటి సిగ్గన్నా,  
మబ్బుల్లో చంద్రుడితో దోబుచులాడతానన్నా  
మబ్బుల్లో చంద్రుడితో దోబుచులాడతానన్నా  
దిగిరాను దిగిరాను దివినుండి భువి అన్నా,  
చినుకునై రాలిపోతానన్నా...

వీటి అన్నింటిలోనూ 'కవిత్వాన్ని' గురించి ఆలోచించకుండా ఉండలేరు. ఈ కూనలమ్మ పదాన్ని బట్టి భావకవిత్వాన్ని ఆరుద్ర సమర్థిస్తున్నట్లు అనుకోనవసరం లేదు. సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో దీనిపై విమర్శనాత్మక విశ్లేషణ ఈ విషయాన్ని తెలుపుతుంది.

"కొంతమందిది నవత  
కొంతమందిది యువత

కృష్ణశాస్త్రిది కవిత
ఓ కూనలమ్మ'' (పు.6)

'శ్రీశ్రీ' గురించి ప్రచారంలో ఉన్న వైయక్తిక విషయాల్ని కూడా చెప్తూనే చమత్కారాన్ని కల్గిస్తారు.

''రెండు శ్రీల ధరించి
రెండు పెగ్సుబిగించి
వెలుగు శబ్దవిరించి
ఓ కూనలమ్మ'' (పు.6)

'వేమన' తాత్త్వికత గురించి మూడు పదాల్లో వర్ణించినా, పరిశోధనలో మాత్రం భిన్నకోణాల్ని దర్శింపజేశారు. చెరకు రసాన్ని పీల్చేటప్పుడు పిప్పిని పీల్చేకొద్దీ తీపివస్తున్నట్లు ఉంటుంది. వేమనను ఎన్నికోణాలనుండైనా చూడవచ్చుననే చక్కని సృజనాత్మకత దీనిలో ఉంది.

''చెరకు రసముల వూట
చిన్మయిత్తపు తేట
యోగివేమన మాట
ఓ కూనలమ్మ'' (పు.11)

''కొడవటి గంటి'' గురించి వివరిస్తూ వ్యాసాల్ని రాసినా కథకుడుగా ఉండే విశిష్టతను వర్ణిస్తున్నారు.

''కసరు తేనెల వంటి
కథలు కుత్తుక ఒంటి
నింపు కొడవటి గంటి
ఓ కూనలమ్మ'' (పు.16)

''పోతన'' గురించి ఈ భక్త కవి వర్ణించిన పద్యాల్ని స్ఫురింపజేస్తూ తేనెలయేరు అనడం నిత్యపారాయణ గ్రంథంగా భాగవతం మారిందనే భావుకతను వ్యక్తీకరించారు.

''భక్తి తేనెల యేరు
పసిడి కలల బడారం
కలసి పోతన గారు
ఓ కూనలమ్మ'' (పు.17)

'విశ్వనాథ సత్యనారాయణ' పేరెత్తితేనే సంప్రదాయం గుర్తొస్తుంది. వేయిపడగలలో ఆధునికతను వ్యతిరేకించినట్లు కన్పిస్తుంది. విద్యుత్ వల్ల పక్షులు చనిపోతాయనీ చాతుర్వర్ణ్యసిద్ధాంతంలో ధర్మారావు ధర్మనిర్వహణ వంటివన్ని ఆధునికతను వ్యతిరేకించే భావాలుగా కనిపిస్తాయి. వీటన్నింటినీ మనసులో ఉంచుకొని వర్ణించిన కూనలమ్మపదం!

"కొత్త మీద జుగుప్స
కొలది ప్రాతకు వీప్స
విశ్వనాథకు లిప్స
ఓ కూనలమ్మ" (పు.23)

'నండూరి సుబ్బారావు' గురించి

"ఎంకి పాటలదారి
ఎడద గుర్రపు స్వారి
చేయులేనండూరి
ఓ కూనలమ్మ" (పు.25)

ఇంకా సరదాగా చెప్తున్న కూనలమ్మ పదాలు కొన్ని ఉన్నాయి

"కొత్త పెండ్లము వండు
గొడ్డు కారము మెండు
తీపియను హస్బెండు
ఓ కూనలమ్మ" (పు.22)

శ్రీకృష్ణుని గురించి చెప్పిన కూనలమ్మ పదం హాస్యంతోపాటు ఆలోచనకూడా కల్గిస్తుంది. ఈ పదంలో 'లా' లోచి కృష్ణుడు జరిపిన రాయబారాన్ని స్ఫురింపజేస్తుంది. లా లోచి అని శబ్దాన్ని విరిచినట్లయితే, ఒకరిపట్ల ఒక న్యాయం, మరొకరి పట్ల మరొక న్యాయం పాటించారనిపిస్తుంది. ఇదొక చమత్కారం!

"చెలుల చీరలుదోచి
చెల్లి చీరనుగాచి
చేసెనే లా లోచి
ఓ కూనలమ్మ" (పు.18)

సామ్యవాదం అమలు జరిగితే సకల ప్రపంచం సుఖవంతంగా ఉంటుందని చెప్తున్న కూనలమ్మ పదం!

"సామ్యవాద పథమ్ము
సామ్యమైన విధమ్ము
సకల సౌఖ్యప్రదమ్ము
ఓ కూనలమ్మ" (పు.31)

కూనలమ్మ పదాలు చదువుకోవడానికి ఆనందంతో పాటు ఆలోచనను కూడా రేకిత్తిస్తుంటాయి. సముద్రమంత భావాన్ని నీటిబిందువంత శబ్దాల్లో నిక్షిప్తం చేయగలిగే ఆరుద్ర సృజనాత్మక ప్రతిభను కూనలమ్మ పదాలు తెలుపుతుంటాయి.

### ఇంటింటి పజ్యాలు:

1964 లో ఆంధ్రపత్రిక వారపత్రికలో వారం వారం ప్రకటించిన పజ్యాలు మొత్తం. వీటిని 'పద్యాలు' అని పిలవకుండా 'పజ్యాలు' అని నామకరణం చేయడంలో ఆరుద్ర ఔచిత్యం పాటించారని, ఛందోరీతిని కాకుండా వచనంలో రాసిన పద్య భేదాన్ని తెలుపడానికి వీలుగా "పద్యాలు"లో "ద్యా" కు బదులు "జ్యా" ని ప్రయోగించారని ఆధునికతను నిరూపించుకున్నారని ఆరుద్ర కవిత్వంపై పరిశోధన చేసిన నరసింహారావు అన్నారు. ఆరుద్ర 'ఇంటింటి పజ్యాలు' లో హాస్యాన్ని పండించారు. వీటికి ప్రేరణ ఏమిటో ఆరుద్ర చెప్పుకున్నారు.

"అమెరికన్ కవి శ్రీయుత ఆగ్డన్ నేషు
హాస్య కవిత వ్రాసి చేసుకున్నాడు క్యాషు
అతణ్ణి అనుకరించు ఈ కవిత నిర్దోషు
దీనికి చాలు కొద్దిగా క్యాషు బోలెడు శభాషు"

క్యాషు సంగతి మనకు తెలియదు కానీ, శభాషు బాగానే వచ్చింది. మధ్య తరగతి జీవితాల్లోని సుఖదు:ఖాల్ని హాస్యభరితంగా ఈ ఇంటింటి పజ్యాల్లో ఆరుద్ర చక్కగా వర్ణించారు. ఇంటింటి పజ్యాల గురించి రామమోహనరాయ్ వ్యాఖ్యానిస్తు సంప్రదాయ వాదుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తించి భాషలో కొత్త చమక్కులకు చోటుకల్పించారన్నారు.

### అమెరికా ఇంటింటి పజ్యాలు:

బతికి ఉండగా రాసినప్పటికీ, ఆరుద్ర చనిపోయిన మూడేళ్ళ తర్వాతనేవీటిని కె.రామలక్ష్మి ప్రచురించారు. కె.రామలక్ష్మి వ్యాఖ్యానించినట్లు ఈ పజ్యాలలో సగం అందం–బాపు బొమ్మలే! ఈ గ్రంథాన్ని అమెరికాలో వైద్యవృత్తి చేస్తూ,

ఆరుద్రకి పెర్సనల్ ఫిజీషియన్ గా కొంతకాలం పరిచయం ఉన్న డాక్టర్ అల్లూరి ఎస్. రెడ్డికి అంకితం చేశారు. ఈ గంథంలో 39 పజ్యాలు ఉన్నాయి. అమెరికాలో ఉన్న వారి జీవన స్థితిగతుల్ని హాస్యస్ఫోరకంగా వివరించారు. అంతేకాక అమెరికాలో గల తెలుగువాళ్ళ పరిస్థితిని కళ్ళకుకట్టేట్లు చక్కగా వర్ణించారు. అమెరికాలో తెలుగువాళ్ళు మాట్లాడే భాష ఎలా ఉంటుందో వివరిస్తూ "అయ్యోటిక్కెట్టేచ్చాడంటే" ట్రాఫిక్ పోలిసు పట్టుకొని కోర్టుకు సమన్సు ఇచ్చాడనీ, "డిస్‌లు చెయ్యడం" అంటే "కడగడం అంట్ల గిన్నెలు" అనీ వివరించి,

"అమెరికాంధ్రానికి గ్రామరుడిక్షనేరి
ఏ చేరా అయినా రాస్తాడా ఏరికోరి?
విదేశాల్లో స్థిరపడ్డ వాళ్ళ భాష
స్వదేశీయులు వింటున్నప్పుడు తమాషా"

అని ఇతి భావ : ఇత్యర్థ: అనే 'పజ్యాన్ని' ముగించారు. అమెరికాలో ఉండే బిజీ జీవితాన్ని వివరించే 'అభ్యాసము కూసువిద్య' పజ్యంలో

'అమెరికాలో కాపురాని కొచ్చిన ప్రతిముద్దరాలూ
అరణ్య వాసంలో సీతమ్మతో సమానురాలు
పంచవటిలో కనీసం పనులు చేయడానికుంటాడు సౌమిత్రి
ఇక్కడ తనకు తానే కూలీ, తనకుతానే మేస్త్రీ
చాలా పొద్దున్నే భర్త వెళ్ళిపోతాడు ఉద్యోగానికి
రోజిల్లా ఆమె గురి అవుతుంది ఒంటరితనానికి
నిజం చెప్పాలంటే ఆమె సజీవ కుక్–బుక్" (పు.7–8)

అమెరికా జీవితంలోని యాంత్రికతను హాస్య భరితంగా చూపడంలో ఆరుద్ర కృతకృత్యులైన పజ్యాల గ్రంథంగా దీన్ని చెప్పుకోవచ్చు.

### ఆరుద్ర కవితాసంకలనాలు :

"గాయాలు–గేయాలు" 1957లో ప్రచురించిన కవితల, గేయాల సంకలనం ప్రచురించారు. అలాగే 'పైలా పచ్చీసు' పేరుతో 1967 లో వెలువరించిన కవితా సంకలనానికి ఒక ప్రత్యేకత ఉంది. 1942–1967 వరకూ రాసిన కొన్ని కవితల్ని, తన కవితా వ్యాసంగ కాలాన్ని 25 సంవత్సరాల్ని తెలిపేటట్లు 25 ఖండికల్ని ప్రచురించారు. బెజవాడ గోపాలరెడ్డికి 'అంకితం' చేసిన ఈ సంకలనం ఆంగ్లకవి డిలాన్ Dylan Thomas తన కవితలను'Twenty Five Poems' పేరుతో



ప్రచురించుకొన్నట్లే ఆరుద్ర కూడా, ఆ కవిపై గల మక్కువతో ప్రచురించారు. 1965లో 25 కవితలతో ఎంచిన పద్యాలు పేరుతో ఒక సంకలనం ప్రచురించి ఖాసా సుబ్బారావుకి అంకితమిచ్చారు. నారాయణ బాబు స్మృతికి అంకితం చేస్తూ, ఆరుద్ర కవితల్లో తనకి నచ్చిన వాటిని ఆరుద్ర సహచరి కె.రామలక్ష్మి 1979 లో "ఏటికేడాది" ప్రచురించారు. ఈ కవితలేకాకుండా విడిగా కూడా కొన్ని కవితలు వివిధ పత్రికలో ఆరుద్ర జీవించినంతవరకూ రాశారు. శ్రీశ్రీతో కలిసి 'రుక్కటేశ్వరశతకం' శ్రీశ్రీ అబ్బూరి వరద రాజేశ్వరరావుతో కలిసి "సాహిత్యోపనిషత్" "మేమే" రచించారు. ఇది ఆరుద్ర కొనసాగించిన జంట కవిత్వంగా చెప్పవచ్చు. "శుద్ధమధ్యాక్కరలు" పేరుతో కూడా కవిత్వాన్ని రాశారు.

ఆరుద్ర రచించిన కవిత్వంలో అభ్యుదయ భావాల్ని, ప్రయోగవాదాన్ని, నవ్యధోరణుల్ని, భాషా చమత్కారాల్ని సి.నారాయణ రెడ్డి, ఎల్.సంగయ్య, ఆర్. నరసింహారావు తమ పరిశోధన గ్రంథాల్లో సమగ్రంగా పరిశీలించారు. వీరితో పాటు రామమోహనరాయ్ వంటి విమర్శకులు కూడా సమీక్షించారు.ఆరుద్ర కవిత్వంలో దేశభక్తి, సంప్రదాయం, అభ్యుదయభావాలు, ప్రయోగవాద ధోరణులు కన్పిస్తున్నట్లు సంగయ్య నిరూపించారు. 'ఆరుద్ర ప్రగతి వాద ప్రధాన కవిత రచించాడా? ప్రయోగవాద కవిత రచించాడా అని ప్రశ్నిస్తే నూతన ప్రయోగాలతో ప్రగతి కవిత్వం రచించాడని చెప్పాలి. తెలుగు సాహిత్యంలో నూతన ప్రయోగాలు చేసిన వారిలో ఆద్యుడు ఆరుద్ర కాకపోవచ్చు. కాని, ప్రయోగవాదం గురించి చర్చించేటప్పుడు ప్రముఖంగా చెప్పవలసినవాడు ఆరుద్రే' అని నరసింహారావు వివరించారు. ఆరుద్ర కవిత్వాన్ని అవగాహన చేసుకోవడానికి పాఠకుడు హృదయాన్ని బుద్ధినీ ఉపయోగించినా, హృదయానికే ఆహ్లాదం కల్గిస్తుంది.

### మనిషి-ఆడమనిషి(ఆధునిక మహాకావ్యం):

ఆరుద్ర (బతికుండగా)రచిస్తున్న ఈ కావ్యంలో గల కొన్ని భాగాల్ని ఇండియాటుడే-1995 (వార్షిక సాహిత్య సంచిక లో ప్రచురించారు. ఈ కావ్యంలో గల కొన్ని భాగాల్ని 'స్త్రీ పురాణం' పేరుతో చూడవచ్చు. హిందూ, క్రైస్తవ గ్రంథలలో గల ఇతివృత్తాల్ని ఆధారంగ చేసుకొని స్త్రీ పురుషుల మధ్య

గల వ్యత్యాసాల్ని వివరిస్తూనే,: స్త్రీ ఔన్నత్యాన్ని వర్ణించారు. హిందుపురాణాల ప్రకారం తొలి ఏకకణం 'ఆదిశక్తి' గా చెప్తుంటారు. ఆదిశక్తి నుండే త్రిమూర్తులు ఉద్భవించినట్లు ప్రచారంలో ఉంది. దీన్ని ఆరుద్ర...

"జీవినవుదామని సంకల్పించుకున్న ప్రథమక్షణాన్ని
వేయివిధాల విభజించుకుంటున్న తొలి ఏకకణాన్ని
సనాతన జలచారాన్ని, పురాతన ఉభయచరాన్ని
ప్రాచీన ఖేచరాన్ని మొట్టమొదటి భూచరాన్ని

ఆదిమ స్తన్యజీవిని..." అని వర్ణించారు.

ఋగ్వేదంలో యమీ, యమ లు సోదరీ సోదరులైనప్పటికీ వీరిద్దరి మధ్య గల శారీరక సంబంధాల గురించి ఇరువురి మధ్యా దీర్ఘమైన సంభాషణను వర్ణించారు. ఈ సందర్భంలో బ్రహ్మ, శివుడు, వంటివారు సాగించిన స్త్రీమోహచర్యల్ని వివరించారు. బైబిల్ కథనాన్ని అనుసరించి ఆదాము, అవ్వల జీవితాన్ని కూడా ఆరుద్ర వర్ణించారు. జ్ఞాన ఫలాన్ని దేవుడు తినవద్దంటే వాళ్ళుతినడం, దేవుడు శపించడం వంటి వాటినికూడా వర్ణించారు. ఆపండు తిన్న తర్వాత...

"మొలకింద భాగాలు తిలకించలజ్జ
బులువులకు చీకట్ల పొదరింట సెజ్జ
నాటినుండీ నీదు చోటు లేదాయో
దీటు రావాయె నాఫాటి కావాయో
ఆనాటి నుండియు అబలవే నీవు
నానాటికీ నువ్వునాదాసిగా ఉండు" (పు.142)

అని మగవాడు (ఆదాము) ఆడదాని (అవ్వ) పై పెత్తనం చెలాయించాడని వర్ణించారు. "కార్యేషు" దాసీ.... శ్లోకభావాన్ని కూడా కవిత్వీకరించడం కన్పిస్తుంది (పు.147) అయితే కావ్యం పూర్తి అయితే ఏమి తేల్చేవారో తెలిసే అవకాశం ఉండేది. అయినా కాటమరాజు కథ (స్టేజి నాటకం) లో ఖడ్గతిక్కన భార్య చానమ్మ "సహగమనం" చేసినట్లు వర్ణించదానికిష్టపడని ఆరుద్ర, స్త్రీ చైతన్యాన్ని కోరుకొనేటట్లే దీనిలోనూ రాయడానికి ప్రయత్నించి ఉండేవారేమో అని ఆశించవచ్చు!

## సినీ గీతాలు:

'కొండగాలి తిరిగింది' పేరుతో ఆరుద్ర రాసిన సినీ గేయాలు తొలిసారిగా 1975 లో వెలువడ్డాయి. అయితే ఇటీవల కె.రామలక్ష్మి స్త్రీ శక్తి ప్రచురణల పేరుతో ఆరుద్ర సినీ గీతాల్ని ప్రచురించారు. 'ఉయ్యాల జంపాల' సినిమాలో 'కొండగాలి తిరిగింది గుండె ఊసులాడింది' పాటలోని పదాన్ని ఈ సినీగీతాలు సంపుటికి పేరు పెట్టినట్లు తెలుస్తుంది. సుమారు మూడువేల పాటలు రాసిన ఆరుద్ర సినీగీతాల్లో ఎన్నో ఆణిముత్యాలు వంటివిఉన్నాయి. 'ఎదగడానికెందుకు రా తొందర, ఎదర బ్రతుకంతా చిందర వందర' (అందాలరాముడు), 'నీయాశ అడియాశ చేజారె మనిపూస' (ఎం.ఎల్.ఏ) 'వేదంలా ఘోషించే గోదావరి' (ఆంధ్రకేసరి) వంటి గీతాలెన్నో ఉన్నాయి. సినీ గీతాలతోపాటు అనేక సినిమాలకు స్క్రిప్టుల్నీ రాశారు.

## కథలు–నవలలు:

'నేను చెప్పానుగా' (1958); 'ఆరుద్ర కథలు' (1968) పేర్లతో ఆరుద్ర కథలు వెలువడ్డాయి. బతుకు తెరువుకోసమే మొదట్లో సినీ కంపెనీలో 'స్టోరీ డిపార్టుమెంటు'లో ఉద్యోగిగా చేరినా, అనేక కథల్ని చదవడానికి అవకాశం కలిగింది. సినిమాలకు కథలు, స్క్రిప్టు రచయితగా ఆరుద్ర 'భీష్మ', (1962) పాండవ వనవాసం (1960) చిత్రాలకు పరోక్షంగానూ, బాలభారతం (1972), యశోదకృష్ణ (1974) చిత్రాలకు ప్రత్యక్షంగా కథనం అందించారు. ఆరుద్ర రాసిన మొదటి కథ 'మచ్చుబియ్యంల' దీన్ని చాసో ప్రభావంతో రాశారు. ఇది'వందేమాతరం' అనే పత్రికలో వచ్చింది. ఈ కథలో జీవన విశ్లేషణ లేదని ఆరుద్ర కొట్టిపారేశారు. ఆరుద్ర కథల్లో పీడితులు, శ్రామికులు, మధ్యతరగతి జనం మనస్తత్త్వం జీవితం వాస్తవికతతో ఒప్పుతాయి. ఆరుద్ర కథల్లో 'ఉష్ణమొస్తే బావుణ్ను' కథ మనసుని పిండే కథ. తన అన్నయ్యకి జ్వరం వచ్చినపుడు కుటుంబమంతా అతడిపై చూపిన శ్రద్ధాసక్తులు, తనకీ లభించాలంటే తనకీ జ్వరమొస్తే బాగుణ్ణనుకున్నా, చివరికి జ్వరం వల్ల తన అన్నయ్య చనిపోవడంతో, ఇంకెవరికి జ్వరం రాకూడదని ఆపిల్లవాడు కోరుకొనే కథ. ఎన్నో వైవిధ్యభరితకథల్ని ఆరుద్ర రచించారు.1970 ప్రాంతాల్లో కథలతో పాటు డిటెక్టివ్ కథలు, నవలల్ని కూడా ఆరుద్ర రచించారు. పలకల వెండిగ్లాసు, అహింసారౌడీ, అణాకోబేడస్టాంపు, రెండురెళ్ళు ఆరు, ఆనకట్టమీద ఆత్మహత్య వంటి డిటెక్టివ్ నవలల్ని రాశారు. 'గ్రామాయణం' అనే సాంఘిక నవలనూ,

1968 లో పాలగుమ్మి పద్మరాజు, ఆరుద్ర, మద్దిపట్ల సూరి, కె.రామలక్ష్మి, ప్రఖ్య శ్రీరామమూర్తి, కొడవటిగంటి కుటుంబరావులతో కలిసి 'పల్లె–పట్నం' అనే నవలను రాసినట్లు తెలుస్తుంది.

### నాటికలు–నాటకాలు:

1951 తర్వాత పన్నెండు దృశ్య నాటికలు, తొమ్మిది శ్రవ్య రూపకాల్ని, 'సాలభంజిక', గ్రంథమహాయుద్ధ, దీర్ఘరాత్రం, తదేవగృహం, విషప్రయోగం, దేవుని ఎదుట, న్యాయాధికారి, పార్కుబెంచీ,దరఖాస్తు ఫారం, నన్ను గురించే, అక్కయ్యకి ప్రమోషన్, వీటితో పాటు 1973 లో 'రాదారి బంగళా' వంటి నాటకాల్ని రాశారు. 'శ్రీకృష్ణ దేవరాయ' రూపవాణి నాటకం రాశారు. వీటిలో దృశ్య, శ్రవ్య నాటికలు, నాటకాలు ఉన్నాయి. కాటమరాజు కథ (స్టేజి నాటకం) కూడా ఆరుద్ర రాశారు. 'శకుంతల' పేరుతో నృత్య రూపకం కూడా రాశారు. ఆరుద్ర నాటికలు, నాటకాలు నూతన సాంకేతిక పరికరాల్ని ఉపయోగించి ప్రదర్శించినట్లయితే సినిమా చూస్తున్న అనుభూతికి ప్రేక్షకులులోనవుతారు.

### అనువాద రచనలు:

ఆంగ్లం, తమిళం నుండి తెలుగులోకి కొన్ని రచనల్ని ఆరుద్ర అనువదించారు. వాటిలో The Prison Dairy of HochiMinh (వియాత్నం కవి హో–చి–మిన్) ని "ఖైదులో కవితలు" గా అనువదించారు. ప్రజల పక్షం వహించి పోరాడిన నాయకుడు, కవి హోచిమిన్ రచించిన 115 వచన గేయాల్లో 32 గేయాల్ని ఆరుద్ర అనువదించారు. వియాత్నం వీరుల పోరాట చరిత్ర, అకుంఠిత దీక్ష ను తెలుసు కోవడానికి హోచిమిన్ కావ్యం చాలా ఉపకరిస్తుందని భావించడం వల్ల దీన్ని అనువదించారు. ఇంకా హంగేరియన్ కవి పెటోఫీ కవితల్ని, అమెరికన్ కవి ఇ.ఇ.కమ్మింగ్ కవితల్ని, మలయాళ కవి వల్లుతోలు నారాయణమీనన్ రచించిన 'Songs of the peasants' కవితల్ని తెలుగులోకి అనువదించారు. వీటి అన్నింటికంటే ముందే తమిళ కవి తిరువళ్ళు వార్ రచించిన 'తిరుక్కురళ్' గ్రంథాన్ని తెలుగులోకి అనువదించారు. తమిళంలో జయం గొండాన్ వర్ణించిన 'కళింగత్తు పరణిని' తెలుగులో 'వెన్నెల–వేసవి' పేరుతోఅనువదించారు. వీటినిబట్టి ఆరుద్రకు 'సృజనాత్మక' సాహిత్యంలోనే కాకుండా, అనువాదంలోనూ అనుభవం ఉందనీ, వివిధ భాషలు తెలుసుననీ తెలుస్తుంది. ఏ ప్రక్రియను ఎలా నిర్వహించాలో తెలిసిన సాహిత్యవేత్త అనీ అర్థమవుతుంది. వీటికి తగిన గుర్తింపు కూడా లభించిందనేది వీరికి అందిన పురస్కారాలు తెలుపుతున్నాయి.

## విమర్శ–పరిశోధన–ఇతర రచనలు:




వందలాదిగా పత్రికల్లో విమర్శ, పరిశోధన వ్యాసాలు రాయడమే కాకుండా రాముడికి సీత ఏమవుతుంది? వేమన్న వేదం, మన వేమన, మహనీయుల కలం చిత్రాలు, గుడిలో సెక్స్, 'వ్యాస పీఠం', సమగ్ర ఆంధ్ర సాహిత్యం వంటివన్నీ గ్రంథరూపంలో ప్రకటించారు. ఇతర రచనల్లో 'చదరంగం' అంతర్జాతీయ స్థాయిలో 1981 కి ఉన్న కొన్ని ఎత్తుగడల్ని, చదరంగాన్ని శాస్త్రీయంగా వివరించారు. స్వయంగా 'చదరంగం'లో ప్రావీణ్యం ఉన్న ఆరుద్ర రాసిన ఈ గ్రంథం పలువురి ప్రసంశల్ని పొందింది.

## ప్రవృత్తిని– వృత్తిగా మార్చుకోవటం:

సాహితీ వాతావరణం ఉన్న కుటుంబం నుండి రావడంతోనే చిన్న నాటి నుండి రచనలు చేయాలనే ఆసక్తి ఆరుద్ర లో కలిగింది. బడిలో చదువుతున్నప్పుడే ఓ విద్యార్థుల గుంపు తమ పేర్లను 'రావుత్రయం' అనే ఒకే పేరుగా రాస్తూ, బడిలో జరిగే అవకతవకలు గురించి వ్యంగ్యాంగా ఓ వ్యాసం రాశారు. తరువాత హైస్కూలు మేగ్జైన్ లో 'చిట్టితమ్ముడు' పూరుతో ఓ గేయాన్ని రాశారు. విశాఖపట్టణం నుండి వెలువడే 'యువకళ' మాసపత్రికలో కథలు, కవితలు రాస్తుండేవారు. 1939లో 'చిత్రగుప్త' పత్రికలో వీరి మొట్ట మొదటి కవిత 'నాకలలో'... ప్రచురితమైంది. అప్పటినుండి ఒక వైపు రాస్తూనే, మరొకవైపు ఉద్యోగ వేట కొనసాగిస్తూనే అనేక రకాలైన ఉద్యోగాలు చేస్తూకూడా, ఖాళీ సమయాల్లో ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని చదువుతుండేవారు. ముఖ్యంగా ప్రబంధ సాహిత్యన్ని కంఠస్థం పట్టేవారు. ఆంగ్ల సాహిత్యాన్నీ, అందులో వస్తున్న ధోరణులను చాసో, రోణంకి, కొడవటిగంటి వంటి ప్రసిద్ధ సాహితీవేత్తలు సహాయంతో ఎప్పటి కప్పుడు తెలుసుకొంటుండేవారు. కలకత్తా నుండి కవి సోమసుందర్‌కి రాసిన లేఖలో ఆరుద్ర తెలిపిన విషయాలను బట్టి కూడా ఆంగ్ల సాహిత్యాన్ని బాగా చదివేవారని అర్థమవుతుంది. తాను చదవడమే కాకుండా, సమకాలీన సాహితీవేత్తలతో ఉత్తరప్రత్యుత్తరాలు కొనసాగిస్తు, వర్తమాన తెలుగు సాహిత్యస్థితి గతులను ఎక్కడ ఉన్నా, సాహితీ వాతావరణాన్ని తెలిసికొంటుండే వారు. అక్కడితో ఆగిపోకుండా, తాను కూడా రచనలు సమీక్షిస్తుండేవారు. ఆ రచన మరింత ప్రతిభావంతంగా

ఉండాలంటే ఎలాంటి కృషి అవసరమో కూడా సూచిస్తుండేవారు. మొత్తంమీద ప్రవృత్తిగా ప్రారంభమైన పుస్తక పఠనం, రచనా వ్యాసంగం, సినిమా స్క్రిప్ట్స్, డైలాగ్స్, పాటలు రాయటంతో వృత్తిగా మారిపోయిందని చెప్పవచ్చు. అలా సినిమా రచనకోసం ప్రారంభమైన అన్వేషణే పరిశోధన దిశగా పయనించేటట్లు చేసింది.

## పరిశోధనాభిలాషాప్రేరణలు:



సినిమాలకు స్క్రిప్ట్స్ రాస్తుండే రోజుల్లో, ఒక సందర్భంలో 'ఖడ్గతిక్కనా? కవితిక్కనా ఒకరా? వేర్వేరా?' అనే ప్రశ్న ఆరుద్రకు వచ్చినప్పుడు, దాన్ని అన్వేషిస్తూ, పరిశోధన పట్ల గాఢమైన ఆసక్తి పెంచుకున్నట్లు ఆయనే చెప్పుకున్నారు. ఈ సంఘటన 1948లో జరిగింది. అప్పటికి సాహిత్య చరిత్రతో పరిచయమే లేదని ఆయనే చెప్పుకున్నారు. కవి జీవితాలు, చాటుపద్యాలు, తిక్కనకు సంబంధించిన గ్రంథాలు చదివారు. వీటిలో ముఖ్యంగా తిక్కనకే అంకితమిచ్చిన కేతన రచించిన 'దశకుమార చరిత్ర' ను చదవటంతో ఒక ఆధారం దొరికినట్లయ్యింది. దానితో పాటు 'సిద్దేశ్వర చరిత్ర'లో తిక్కన, గణపతిదేవచక్రవర్తి దగ్గరకు వెళ్ళి మనుమసిద్ధి రాజ్యాన్ని నిలబెట్టినట్లు ఉన్న కథనాన్ని, తిక్కన మనుమసిద్ధికి అంకితమిచ్చిన 'నిర్వచనోత్తర రామాయణాన్ని' కూడా వివరంగా చదివారు, వీటితో పాటు జానపద కథల్లో 'కాటమరాజు' కథల్లో 'ఖడ్గతిక్కన' కు సంబంధించిన గ్రంథాల్నీ పరిశీలించారు.

జానపద సాహిత్యంలో కాటమరాజు కథ ప్రసిద్ధమైంది. ఈ కథాచక్రంలోనే నెల్లూరు సిద్ధిరాజులకూ, కాటమరాజుకూ జరిగిన యుద్ధంలో తిక్కన గురించిన ప్రస్తావన ఒకటి వస్తుంది. సిద్ధిరాజుకు మంత్రిగా ఉన్న ఈ తిక్కన, కాటమరాజుతో జరిగిన యుద్ధంలో శక్తిమంతంగా పోరాటం చేసి మరణిస్తాడు. ఇతడినే 'ఖడ్గతిక్కన' రణతిక్కనలుగా పిలుస్తుంటారు. 1953 లో మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం వారు ప్రచురించిన'కాటమరాజుకథ' ద్విపద కావ్యాన్నీ ఈ సంద్భంగా నాలుగైదు సార్లు చదివారట ఆరుద్ర. లభించిన ఆ ఆధారలతో సంతృప్తి చెందక శ్రీశ్రీ అభిప్రాయాన్ని అనుసరించి తన అన్వేషణలో కొత్త మార్గాల్ని అనుసరించారు. కేవలం ప్రాథమికాధారాలనే కాకుండా ప్రముఖుల అభిప్రాయాల్ని కూడా

పరిగణనలోకి తీసుకోవాలని భావించారు. “ఖడ్గతిక్కన, కవితిక్కన లిద్దరూ ఒకటేనా? కాదా? అని నేను గతంలో విఖ్యాత చరిత్రకారులు కీ.శే. మల్లంపల్లి సోమశేఖరశర్మ, నడిగినప్పుడు, ఈయన ఎటైనా ఊహించుకోవచ్చునని, దేనికీ నిర్దిష్టమైన ఆధారాలు లేవనీ చెప్పారు” అని రాసుకున్న శ్రీశ్రీ అభిప్రాయాన్ని అనుసరించి, మరికొంత పరిశోధన చేశారు. అంతటితో శ్రీశ్రీ అభిప్రాయాన్ని ఆమోదించేయకుండా, మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం వారు ప్రచురించిన కాటమరాజు కథకు మల్లంపల్లి సోమశేఖరశర్మ ఆంగ్లంలోనూ, తెలుగులోనూ రాసిన పీఠికను పరిశీలించి, ఖడ్గతిక్కన, కవితిక్కనల మధ్యగల సంబంధాలను పరిశోధనాత్మకంగా అంచెనా వేశారు. దశకుమార చరిత్ర లో సేవణ దండ యాత్రను బట్టి, రణతిక్కన కాలనిర్ణయానికి, మరికొన్ని కైఫియత్తులను, శాసనాలను కూడా పరిశీలించారు. వేటూరి ప్రభాకర శాస్త్రి 1917లో రెండవ కూర్పుగా ప్రకటించిన చాటుపద్యమణిమంజరి లో ‘రణతిక్కన నెల్లూరు పురము’ అనే శీర్షికతో ఉన్న పద్యాల్ని, అందులో ప్రభాకరశాస్త్రి “విరాటపర్వము దొట్ట తుది ముట్టనాంధ్ర మహాభారతమును రచించిన తిక్కన సోమయాజి కీతడు పెద్ద తండ్రి కుమారుడు” అని రణతిక్కన గురించి చెప్పిన అభిప్రాయాన్ని కూడా పరిశీలించారు. ఇవన్నీ పరిశీలించి, శ్రీశ్రీ ఊహించినట్లు, రణతిక్కన, కవితిక్కన ఒక్కటి కాదనీ, వేర్వేరనీ దశకుమారక చరిత్రను అనుసరించి తిక్కన వంశ వృక్షాన్ని తయారుచేశారు. సార కవితాభిరాముడు, గుంటూరు విభుడూ అయిన కొట్టరపు భాస్కరమంత్రికి నలుగురు కుమారులు. మూడవ కుమారుడైన సిద్ధనమంత్రికి ఏడుగురు కొడుకులు. వీళ్ళలో పెద్దవాడు ఖడ్గతిక్కన. భాస్కరమంత్రి నాలుగో కుమారుడైన కొమ్మన దండ నాథునికీ ఒక్కడే కుమారుడు. అతడే కవితిక్కనఅని ఆరుద్ర నిరూపించి, సాహిత్య పరిశోధనకూడా వడ్డించిన విస్తరికాదన్నారు.

**కవితిక్కన, ఖడ్గతిక్కనల గురించి ఆరుద్రకి వచ్చిన ఒక ప్రశ్న ఒక అనుమానం, ఆయన్ని పరిశోధకుడిగా చేయడానికి దోహదపడిందని చెప్పవచ్చు.**

కవితిక్కన, ఖడ్గతిక్కనల గురించి ఆరుద్రకి వచ్చిన ఒక ప్రశ్న ఒక అనుమానం, ఆయన్ని పరిశోధకుడిగా చేయడానికి దోహదపడిందని

చెప్పవచ్చు. తనకొచ్చిన అనుమానాన్ని నివృత్తి చేసుకోవాలనుకోవడానికి బయలుదేరిన అభిరుచి, అన్వేషణగా మారి, సంబంధిత విషయాన్ని సేకరించేటట్లు చేసి, వాటన్నింటినీ మళ్ళీ పరిశీలించి, ఫలితాంశాల్ని బహిర్గతం చేసేటట్లు చేసింది. ఈ ప్రేరణే పరిశోధన రంగంలో కృషి చేసేటట్లు వారిని ప్రోత్సహించింది. ఆరుద్ర మాటల్లో నేచూస్తే "కవితిక్కన సినిమా తీయమని ఒక దర్శక నిర్మాతతో యథాలాపంగా అన్నమాట సమగ్ర ఆంధ్ర సాహిత్య రచనకు సంసిద్ధుణ్ణి చేసింది" అని తెలుస్తుంది. ఆరుద్ర లో బీజరూపంలో ఉన్న అభిరుచి, కవితిక్కన, ఖడ్గతిక్కనలు ఒకటా? వేర్వేరా? అనే సందేహం మొక్కగా పెరిగి, దానికి సంబంధించిన సామగ్రీ సేకరణ ఎరువుగా పనిచేసి, ఒక ఫలాన్ని ఇవ్వడమే కాకుండా, సమగ్ర ఆంధ్ర సాహిత్యమనే వృక్షాన్ని పెరిగేటట్లు చేయటానికి అవసరమైన పరిశోధనశక్తి ఆరుద్రలో కలిగేటట్లు చేసిందని చెప్పవచ్చు.

పుట్టిన వాడికి మరణం తప్పదన్నట్లు ఆరుద్ర తెలుగు సాహిత్యానికి విశేషమైనకృషి చేసి 1998 జూన్ 4వ తేదీన మరణించారు, కానీ, ఈయన రచించిన కవిత్వం, కథలు, పరిశోధన వంటి రచనల్లో చిరకాలం జీవిస్తూనే ఉన్నారు. తన పరిశోధనల్లో ప్రతిపాదిత అంశాల్ని బట్టి ప్రతి పరిశోధకుడితోనూ చర్చల్లో పాల్గొంటూనే ఉన్నారు!

### సమగ్ర ఆంధ్రసాహిత్య పరిశోధన:

పరిశోధకుడిగా, సాహిత్యచరిత్రకారుడిగా తెలుగు సాహిత్యచరిత్రలో ఆరుద్ర ఒక విశిష్టస్థానం పొందడానికి కారణమైన రచన 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం'. వేమన, గురజాడ, రామాయణం వంటి వివిధ విషయాలపై అనేక పరిశోధన వ్యాసాలు రచించినప్పటికీ, ఆరుద్రను 'పరిశోధకుడు' అని పిలవగానే సాహితీవేత్తల్లో ఈయన 'సమగ్ర ఆంధ్ర సాహిత్యమే గుర్తొస్తుంది. ఆరుద్ర రచించిన 'సమగ్రఆంధ్రసాహిత్యం' లోని 'సమగ్రత'నూ, సాహిత్య చరిత్ర స్వరూపస్వభావాల్నీ, కవుల చరిత్రకూ సాహిత్య చరిత్రకూ గల పోలికలు, తేడాల్ని వివరించడం, యుగవిభజన, రచనలో పరిశోధనకృషి, ఇతరుల రచనలతో తులనాత్మక పరిశీలన చేయడం వంటివన్నీ సమీక్షించడం వల్ల, ఆరుద్ర చేసిన పరిశోధన కృషి వెల్లడవుతుంది.

### సమగ్ర ఆంధ్ర సాహిత్య సంపుటుల రచనాకాలం:

ఆరుద్ర రచించిన 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' తొలిముద్రణను నెలనెలా ఒక 'నవల' వలే విడుదల చేయాలనీ, పుటల సంఖ్య, ధర, పుస్తకాలు వెలువడే కాలం వంటివన్నీ ముందే ప్రకటించి, ఈ రచనకు పూనుకొన్నట్లు, రచయిత,




ప్రకాశకుల 'ముందు మాటల'ను బట్టి తెలుస్తుంది. తొలిముద్రణ (తొ.ము)లో 12 సంపుటాలుగా సమగ్ర ఆంధ్ర సాహిత్యాన్ని వెలువరించారు. తొ.ము లో మొదటి సంపుటి 1965 ఏప్రియల్ లోనూ, 12వ సంపుటి 1968 ఫిబ్రవరికీ పూర్తయ్యింది. వీటిని అనుకొన్న ప్రకారం నెలనెలా ప్రచురించి ఇవ్వలేకపోయారు. దానికి అనేక కారణాల్ని 'ప్రకాశకులు' చెప్పుకున్నారు. పుటల సంఖ్య ప్రకటించినట్లే ఇవ్వడం కుదరడం లేదనీ, సాహిత్యాన్ని సమగ్రంగా అందించడానికి మరికొన్ని పుటల్ని పెంచవలసి వచ్చిందనీ విన్నవించుకొన్నారు. అన్ని సంపుటాలకీ ఉమ్మడిగా పి.వి.రాజమన్నారు చేత 'ప్రవేశిక' నూ, ప్రతి సంపుటికీ విడివిడిగా ప్రముఖ సాహితీ వేత్తలతో 'పీఠిక' ను రాయించి, ప్రచురించారు. ఈ పీఠికల్లోనే సమగ్ర ఆంధ్ర సాహిత్యం రచనలోగల లోటుపాట్లను కొంతవరకూ చర్చించడం కన్పిస్తుంది. పత్రికల్లో కూడా చాలా విమర్శలు వెలువడ్డాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొంటూనే రచన కొనసాగిస్తున్నట్లు ఆరుద్ర తెలిపిన 'కృతజ్ఞతలు' తెలియజేస్తున్నాయి. అయినప్పటికీ, తొలిముద్రణ లో గల లోటుపాట్లను, ఇంకా పూర్తి చేయవలసిన భాగాల గురించి, తన ఆరోగ్యం కుదుటి పడిన తర్వాత రాయడానికి పూనుకొంటానని చెప్పిన ఆరుద్ర, తొ.ము లో జరిగిన పొరపాట్లను సవరించి, మార్పులూ, చేర్పులూ చేసి, కొత్త సమాచారాన్ని చేరుస్తూ పునర్ముద్రణను ప్రకటించారు. తొలి ముద్రణను, యం.శేషాచలం అండ్ కంపెనీ ప్రచురించగా, పునర్ముద్రణను ప్రజాశక్తి బుక్‌హౌస్ వారు ప్రచురించారు. పునర్ముద్రణ లో మొదటి సంపుటి జూలై, 1989 లోనూ, పదమూడవ సంపుటి సెప్టెంబరు, 1991కీ పూర్తిచేశారు. పునర్ముద్రణలో ప్రచురణ కర్తల 'మామాట', ఆరుద్ర రచించిన 'మనవిమాటలు' అన్ని సంపుటాలకీ ఇంచుమించు ఉమ్మడిగానే పెట్టేశారు. తొ.ము. లో ప్రచురించిన 'పీఠికలు', రాజమన్నారు 'ప్రవేశిక' లన్నింటినీ పునర్ముద్రణ నుండి తొలగించారు. తొ.ము. పునర్ముద్రణలలో యుగాల పేర్లు కొన్నింటిని మార్చడం, చేర్చడం చేశారు. తర్వాత వీటిని తెలుగు అకాడమీ వారు నాలుగు బృహత్ సంపుటాలుగా ప్రచురించారు.

## సమగ్ర ఆంధ్ర సాహిత్యం –‘‘సమగ్రత’’ :

సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో ‘సమగ్రత’ను పరిశీలిస్తే, సాహిత్యం ప్రారంభమైంది మొదలు, సంపుటాలు వెలువడినంతవరకున్న అంతటినీ అందించేదని భావించడానికి వీలులేదు. ఆరంభం నుండి, అన్ని సంపుటాలు వెలువడిన నాటివరకూ సాహిత్యంలో గుర్తించదలచిన వాటిని విస్మరించకుండా రచన కొనసాగించగలగడం, ఆనాటి సాహిత్య స్పృహను అవగాహన కల్గించడానికి ప్రయత్నించడం. ఒక స్వరూపాన్నీ, ఒక అవగాహనను కల్గించడంగా భావించవలసి ఉంది. ఆరుద్రే, పదమూడవ సంపుటిని ముగిస్తూ ‘స్వస్తి వాచకం’ లో చెప్పుకున్నట్లు సాహిత్య చరిత్రకు ముగింపు అంటూ ఉండదు. ‘సమగ్రత’ అంటే తెలుగు సాహిత్యా ఆరంభ వికాసాల్ని అవగతం చేసుకోవడానికి జరిగిన ప్రయత్నంగా గుర్తించవలసి ఉంది. ‘ఈ సాహిత్య చరిత్ర ఆశయం సమగ్రత. కాని సమగ్రతకు ప్రయత్నం మాత్రం జరిగిన ఈ గ్రంథంలో అది పూర్తిగా ఫలించిందని చెప్పటానికి వీలులేదు. ప్రచురణకర్తల వ్యాపార దృష్టి కూడా ఈ సమగ్రతకవి భంగం కల్గించింది. పుటల సంఖ్య నియమితం కావటం, అనంతర సంపుటాలు పెరగటం, రాను రాను ప్రముఖుల గురించి సంక్షిప్తంగా చెప్పార’’ ని ఎస్.వి.రామారావు అన్నారు. అయితే, మలికూర్పులో లోపాల్ని సవరించుకొనే అవకాశం గల గ్రంథంగా, ‘సమగ్రత’కి దారి చూపిన సాహిత్య చరిత్రగా చిరస్మరణీయమైన దానిగా కూడా ఎస్.వి.రామారావు వ్యాఖ్యానించారు. పునర్ముద్రణలో ఆరుద్ర సమగ్రతకు ప్రయత్నించారు. ఆ ‘సమగ్రత’ గిడుగు సీతాపతి, తొ.ము. ‘పీఠిక’లో వివరించిన దానికి దగ్గరలో ఉంది. గిడుగు సీతాపతి అభిప్రాయంలో ఆరుద్ర రచించిన గ్రంథాల్లో అన్ని విషయాలు సమగ్రంగా చర్చించడానికి అవకాశం కలిగింది. ‘‘సమగ్ర’ శబ్దము సాపేక్షము’’. ఒక దృష్టితో చూసినట్లయితే ఎంత విపులంగా రాసినా ఏదీ సమగ్రమవ్వదు. పదమూడు సంపుటాల్లో ఎంత వరకూ సాధ్యం కాగలదో అంతవరకూ సమగ్రంగానే వీరీ సాహిత్య చరిత్ర రచించారని, ఆరుద్ర రచనలో ‘‘సమగ్రత’’ ను సమర్థించారు.

## పొందిన పురస్కారాలు:

1974 లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం, 1985లో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు గౌరవ డి.లిట్, ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు ‘కళాప్రపూర్ణ’ తెలుగు విశ్వవిద్యాలయం వారి గౌరవ డాక్టరేట్, తెలుగు

విశ్వవిద్యాలయం ఆరుద్ర పరిశోధనకు గాను తిక్కవరపు రామిరెడ్డి పురస్కారం, పరిశోధనలో కృషి చేసినందుకు 1986 లో ఎల్.వి. రమణయ్య పురస్కారం, ''గురజాడ గురు పీఠం'' గ్రంథానికి 1987 లో సాహిత్య అకాడమీ పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం 1988 లో కవిత్వానికి వార్షిక పురస్కారం వంటివి ఎన్నింటినో ఆరుద్ర స్వీకరించారు. ఆరుద్ర జీవితంలో 'సృజనాత్మక సాహిత్యం' విరివిగానే రాసి, ఆ అనుభవాన్ని వినియోగించుకొంటూ సృజనాత్మకంగా విమర్శ, పరిశోధనలను కొన సాగించడం వల్ల పాఠకుల్ని వీరి శైలి అద్భుతంగా ఆకర్షించింది. ఆరుద్ర ఎన్ని రచనలు చేసినా, ఆయన పేరు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' ఈ రచనా సంపుటాల ద్వారానే ఆయన విమర్శకుడుగా, పరిశోధకుడుగా సాహిత్య ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

(ఆరుద్ర శతజయంతి ప్రారంభమవుతున్న సందర్భంగా ఈ వ్యాసాన్ని అందిస్తున్నాను. ఈయనపై మరింత సమాచారం కావాలంటే 'పరిశోధకుడుగా ఆరుద్ర' అనే పేరుతో నేను సెంట్రల్ యూనివర్సిటి వారి డాక్టరేట్ డిగ్రీకోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథాన్ని చూడవచ్చు.)



**భార్య పుట్టినరోజు**
**భర్త మరచినరోజు**
**తగ్గెననుకో మోజు**
**ఓ కూనలమ్మ**
**ఏకపత్నీ వ్రతము**
**ఎలుగెత్తి మన మతము**
**వేల్పు భార్యలో? శతము**
**ఓ కూనలమ్మ**

**- ఆరుద్ర**

# విశ్వనాథ కవిత్వం - జాతీయత



డాక్టర్ గండ్ర లక్ష్మణ రావు
✆ 9849328036



నాజాతి పూర్వ ప్రథా జీవరహితమై
    శక్తి నాడులయందు చచ్చిపోయి
నా మాతృభూమి తేజోమహశ్ఛ్యుతిని బ్ర
    హ్మక్షత్ర తేజంబు మంటగలిపి
నా మాతృభాష నానాదుష్టభాషల
    యౌద్ధత్యమును తలనవధరించి
నా తల్లి నేల నేనాటి వాచారముల్
    పై మెఱుంగులు చూచి భ్రమసి పోయి
ఏమి మిగిలినదీ నాటి కిట్లు పొంగు
    లొలయు వర్షానదీ గభీరోదకముల
దైన్య గర్భ చారిత్రముల్ దక్క , భిన్న
    గిరిశిఖర దుర్గ పరిదీన గీతి దక్క ........(ముఖలింగము–ఆం.ప్ర)

విశ్వనాథ సత్యనారాయణగారికి కవిగా తొలినాళ్ళలో అత్యంత ప్రశస్తిని తెచ్చిన కావ్యం ఆంధ్రప్రశస్తి. అందులోని 'ముఖలింగము' అనే శీర్షికలోనిది పైపద్యం. ఈ కావ్యం 1919–20 లలో వెలువడింది. అప్పటికి భారతదేశంలో స్వాతంత్ర్యోద్యమం వ్యాప్తిలోకి వచ్చి ప్రజల్లో, ముఖ్యంగా కవులు కళాకారులలో చైతన్యాన్ని కలిగించింది. అదే స్ఫూర్తితో విశ్వనాథ ఆంధ్రులలో పౌరుషాన్ని రగిలించడం కోసం పూర్వాంధ్ర చరిత్రను అందులోని ధర్మాన్ని, వీరాన్ని, పోరాట పటిమలను తవ్విపోశారు. అదే ఆంధ్రప్రశస్తి. 'అశ్రువులు జార్తు జీవచ్ఛవాంధ్రులిపుడు' అని కన్నీటితో పౌరుషాన్ని ఉత్తేజాన్ని రగిలించారు. ఈ కావ్యంలో ఆంధ్రదేశపు రాజుల కథలున్నప్పటికీ అది సాంస్కృతిక పునరుజ్జీవనంలో భాగంగా రాశారు. ఆంధ్రుల విషయాలు రాసినప్పటికీ భారతజాతి అస్వతంత్రతలో

దొరలుతున్నదనే విషయాన్ని ధ్వనింపజేశారు. పై పద్యంలో నాజాతి, నామాతృభూమి, నాతల్లి, నాభాష అని అఖిల భారతావనికి చెందినవే. పూర్వవైభవాన్ని కోల్పోయినదని చెప్పడంలోనే విశ్వనాథ దేశీయత, జాతీయత దేశభక్తి వ్యక్తమవుతోంది.

కాకతి ప్రోలరాజు సభాఘట్టాన్ని చిత్రిస్తూ ఆనాటికే ఈ దేశాన్ని యవనులు, హూణులు ఎలా చెలరేగిపోతున్నారో వాటి పరిణామాలేమిటో చూపించారు.

కవిత్వం, నవల, కథ , గేయం ఏ ప్రక్రియలో రాసినా కేంద్ర బిందువు దేశీయమే కావడం విశ్వనాథ సర్వసాహిత్యంలోను కనపడుతుంది. శృంగార కావ్యాలలో కులపాలికా ప్రణయం, దాంపత్య ధర్మం ప్రధానాంశాలు. వస్తువు గోపికా గీతలు కావచ్చు, భ్రమరగీతలు కావచ్చు మరే అంశమైనా దేశీయ సంస్కృతిని, ధర్మాన్ని చాటి చెప్పడం నొక్కి చెప్పడం లక్ష్యం. అట్లే రామాయణ కల్పవృక్షంలో అనేక చోట్ల దాంపత్య ధర్మం, కుటుంబ సంబంధాలు, వ్యవసాయికత మొదలైనవి ప్రస్తావించబడినాయి. చర్చించబడినాయి. ఇవి పరోక్షంగా జాతీయతా భావాలు, వేద ధర్మ ప్రతిపాదితమైన సంస్కృతిని బలపరిచే భావాలు. అందుకే విశ్వనాథ సంప్రదాయ వాది అనే ఒక ప్రథ వచ్చింది.

నవలల విషయం అట్లా ఉంచి ప్రత్యేకంగా జాతీయతను చాటడం పైన పేర్కొన్న ఆంధ్రపౌరుషం, ఆంధ్రప్రశస్తి కావ్యాలలో ప్రత్యక్షం.

'' ఉత్తరభూములన్ యవన హూణుల మందలు చెల్లరేగి రా
యొత్తిడి వింధదక్షిణపుటూరుల కల్గెనేని , నేడిటన్
కత్తుల గోడకట్టగల క్ష్మాపతి యెవ్వడు ? సూర్యవంశ రా
హుత్తుల మీద వచ్చిపడదో యపకీర్తి యెదుర్పకుండినన్''...... ప్రోలరాజు ఖండికలోని పద్యం.

కాకతి ప్రోలరాజు సభాఘట్టాన్ని చిత్రిస్తూ ఆనాటికే ఈ దేశాన్ని యవనులు, హూణులు ఎలా చెలరేగిపోతున్నారో వాటి పరిణామాలేమిటో చూపించారు. విశ్వనాథలో రక్త దఘ్నమైన జాతీయ భావమే ఇటువంటి పద్యాలు రాయించింది.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో లాల్ బాల్ పాల్ త్రయంగా పిలువబడే ఉద్యమకారులలో బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశంలోని బందరుకు వచ్చినపుడు

ఉద్యమానికి ఉత్తేజాన్ని కలిగించే కొన్ని పద్యాలు రాసి ఒక చిన్న పుస్తకంగా అచ్చువేసి తమ్ముడు రామ్మూర్తితో పంచిపెట్టించారట. ఆ పుస్తకాలు ఇప్పుడు అలభ్యం. ఆ సంఘటన గురించి విశ్వనాథ తమ్ముడు రామ్మూర్తి గారు" నేనూ – మా అన్నగారూ" అనే వ్యాసంలో రాశారు. అది కాకతీయ విశ్వవిద్యాలయం విమర్శినిలో ప్రచురించబడింది.

**కొడాలి ఆంజనేయులు తో కలిసి సత్యాంజనేయ కవులు అనే జంటకవులుగా కవిత్వం రాశారు.**

అవతార పరివర్తనం అనే పేరుతో స్వాతంత్ర్యోద్యమాన్ని చాటిచెప్పే ఒక నాటకాన్ని రాసి తెనాలి, బాపట్ల, చీరాల వంటి చోట్ల ప్రదర్శింపబడింది. ఆనాటి ఆంగ్ల ప్రభుత్వాధికారులకు తెలిసి కోర్టులో విచారణ జరిపారు. కోర్టులో పనిచేస్తున్న ఒక గుమాస్తా రహస్యంగా విశ్వనాథ మిత్రుడికి తెలియజేస్తే కోర్టులో న్యాయాధికారిముందు ఆ నాటకం రాసింది కొడాలి ఆంజనేయులు అని ప్రకటించి విశ్వనాథకు శిక్షపడకుండా చేశారు. అప్పుడప్పుడే ఆర్థికపరమైన చిక్కులలో ఉన్న విశ్వనాథ శిక్షకు గురికావద్దని ఇట్లా చేశారు. (నేనూ – విశ్వనాథ, కొడాలి ఆంజనేయులు).

కవిత్వం, రచనలలోనే గాక స్వయంగా జాతీయతా ఉద్యమాలలో పాలుపంచుకున్నారు. హిందూ క్రిస్టియన్ కాలేజి గుంటూరు లో ఉద్యోగం చేసినపుడు అక్కడి విదేశీయమైన పద్ధతులను వ్యతిరేకించారు. ఉద్యోగం వదలడానికైనా సిద్ధపడినారు కాని పాశ్చాత్య పోకడలను అంగీకరించలేదు.

హంపీక్షేత్రం పేరుతో అత్యంత విషాదకరంగా విజయనగర రాజ్యవైభవాన్ని గురించి అద్భుత కావ్యంగా వెలయించిన ఆప్తమిత్రుడు కొడాలి సుబ్బారావుగారి కావ్యాన్ని విశ్వనాథ స్వయంగా వెలువరించారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయమందించారు.

కొడాలి ఆంజనేయులు తో కలిసి సత్యాంజనేయ కవులు అనే జంటకవులుగా కవిత్వంరాశారు. అందులో గాంధీమహాత్ముడు అనే శీర్షికలో రాసినపద్యం....

"సత్యాన్వేషణ తత్పరత్వమున సర్వస్వమున్ వీడి మా
కత్యంతమ్మును మేలుకూర్చితివి మహాత్మా ! నీదు సందేశముల్
నిత్యమ్మున్ స్మరియించి త్యాగపద సాన్నిధ్యంబులన్ జేరకే
అత్యాశామృగతృష్ణలంబడుట మా కాశ్చర్యముంగొల్పెడున్"

(విజయవాడలోని శ్రీ గూడూరి నమశ్శివాయ గారిద్వారా ప్రతిలో నేను సేకరించిన పద్యం)

గాంధీ సత్యాన్వేషణ తత్పరత్వము ఒక వైపు ఆత్మశోధన కాగా దేశంకోసం త్యాగపదసాన్నిధ్యము చేరాలనే ఆకాంక్షనూ ఈ పద్యంలో వెలిబుచ్చారు.

జాతీయతా వాదాన్ని ప్రత్యక్షంగా చాటిచెప్పే రెండు చారిత్రక కావ్యాలు రాశారు. ఒకటి ఝాన్సీ రాణి, రెండవది శివార్పణం.

ఝాన్సీరాణి చారిత్రక కథతో పాటు సమకాలీనమైన విదేశీయుల పాలనా దౌష్ట్యాలను కూడా ఎత్తి చూపారు.

ఝాన్సీరాణి కావ్యానికి కాలానికి నాయకత్వం చేసి రాశారు. ఈ విషయమై కొందరు ప్రశ్నించినపుడు విశ్వనాథ చెప్పిన సమాధానం" ఝాన్సీలక్ష్మీబాయి దేశ స్వాతంత్ర్యానికై పోరాడిన వీర వనిత. ఆమె మరణించింది. అసలు కథ యిది. ఇది కావ్యంగా వ్రాయకూడదు. అలంకారశాస్త్రం ఒప్పుకోదు కనుక. మరి కావ్యం రాయాలి, దేశభక్తి గలవాణ్ణి గనుక. ఆమె చేసిన మహాత్యాగ ప్రయత్నం విఫలమయింది. దీనికి కారణం కాలం. కాలమే పరమేశ్వరస్వరూపము. పరమేశ్వరుణ్ణి నిందించాలి ఇలా జరిగినందుకు, అంతకు తప్ప చేసేదేమీ లేదు (నేనూ నా రచనా స్వరూపము, వి.స.విమర్శిని, 2 వ భాగము). అలంకార శాస్త్రం మరేదికాని తనదేశభక్తికి అడ్డురాలేదు. పరమేశ్వరుణ్ణి నిందించాలనడనాకి కూడా వెనుకాడలేదు. అంతటి గాఢమైన దేశభక్తి కారణంగానే ఝాన్సీరాణి కావ్యం తొమ్మిది ఆశ్వాసాల కావ్యంగా మలిచారు. ఈ కావ్యంలో ఝాన్సీరాణి చారిత్రక కథతో పాటు సమకాలీనమైన విదేశీయుల పాలనా దౌష్ట్యాలను కూడా ఎత్తి చూపారు.

"అంగనయైన బాలకుడునైన నెదే కొనుగోలు సేతకై
యంగడి కేగుదెంచెదర యచ్చట వారల దృష్టతాగుణం
బుంగన నచ్చటే నరికి ప్రోవులు పెట్టుద మన్న యంత వె
ట్టం గలిగింత్రు పాపపు కటాహము బ్రద్దలు కావుటెన్నడో?
ఇట్లు చేసిన జాతికి నేమి ఫలమొ
సాగినన్నాళ్ళు లిట్టులు సాగి తుదకు
శతసహస్రముల్ బానిసలుగ నుందు
రే భవిష్యత్తు నందునో యెఱుక లేక".... ద్వి.ఆ.

కావ్యంలో ఒక పాత్రచేత చెప్పించిన మాటలివి. అంగళ్ళలో అంగనలు బాలలు ఏదైనా సరే కొనాలనే నీచపుటాలోచనలకు తల ఒగ్గితే వేలకు వేలు బానిసలు గా మారిపోతారు, భవిష్యత్తును కాంచరు అనే ఆవేదన. "హిందువులందరు పందులంచనియె" అనే పద్యంలోఅత్యంత దుర్భరమైన స్థితిని వర్ణించారు. ఒక వనితను కొని డబ్బులు చెల్లించక అడిగితే ముఖమున ఉమ్మివేసినారట, తనకంటే ముందునడస్తున్నారని బెత్తాలతో కొట్టడం, తనముందర నిలబడతావా అని సిగరెట్టుతో కాల్చేశారట. కొందరిని కాళ్ళతో తన్నటం కొందరిని చంపివేయడం వంటి దుర్మార్గాలు అనేకం చేశారు. ఏవేవో సాకులు చెప్పి కనిపించిన ప్రతి వారిని ముఖ్యంగా స్త్రీలను పలువిధాలుగా చిత్రహింసలు చేసిన అంశాలను చూపారు. ఈ విషయాలు తెలిసిన ఝాన్సీ ఎదిరించడానికి సిద్ధపడిందనే నేపథ్యాన్ని కావ్యంలో చూపారు. ఝాన్సీ రాణి ఆంగ్లేయులతో చేసిన పోరాటమే ఒక పెద్ద స్ఫూర్తి. ప్రథమ స్వాతంత్ర్య నినాదం పోరాటం ఇదే. అందుకే విశ్వనాథ ఈ కథ ను కావ్యంగా ఎంచుకున్నారు. ఇది విశ్వనాథ మనోగతమే. అట్లే మరోచోట ఈ జాతి ఎట్లా భ్రష్టం చేయబడుతున్నదో అత్యంత వేదనావేశంతో వ్యక్తం చేశారు.

> **ఝాన్సీ రాణి ఆంగ్లేయులతో చేసిన పోరాటమే ఒక పెద్ద స్ఫూర్తి. ప్రథమ స్వాతంత్ర్య నినాదం పోరాటం ఇదే.**

"నాలుగు మూలలందున సనాతన ధర్మమనంగ ద్వేషపుం
జ్వాలలు పెల్లురేగినవి బ్రాహ్మణ జాతి సగానికిన్ సగం
బాలరి మూకయై పరమమైన త్రయీ నవ ధర్మ విద్విష
జ్జాలము గాగ మారినది సత్యపథంబిక నేమి కావుటో?''........ దేశం

నాలుగు వైపులా సనాతన ధర్మం భ్రష్టం చేయబడుతున్నది. దాన్ని కాపాడే వేదపండితులు బ్రాహ్మణులు కూడా నలిపివేయబడి , మోసగించబడి నానా విధాలుగా చెడిపోతున్నారు. ఈ దేశం ఏమి కానున్నదో? ....

ఈ తెలిజాతులు మన మానము ప్రాణమున్ హరిస్తున్నారు. కట్టుగుడ్డలతో ఈ దేశానికి వచ్చి ఇక్కడి సంపదలు కొల్లగొట్టి ఇక్కడి ప్రజలకు కట్టుగుడ్డలు లేని స్థితికి తెస్తున్నారు.

తెలిమొయిళ్ళగు పిప్పికి యింత మోహముం దవులుట యేల?అని

మేఘాలను వర్ణించడంలో తెలిమబ్బుల పిప్పి అని తెల్లవాళ్ళ రూపాలను వ్యంజింప జేయడం వారిని చూసి గొప్పగా భావించడమేమిటని ధ్వని.

"పూర్వపు దైత్యులేఈ రూపంలో ఈ దేశానికి వచ్చినారేమో?
ఒక్క చంపుటయే శిక్ష యుర్వియందు
నెంత క్రూరునికైన నిదేమి త్రాసు
దొంగ తక్కెడ చేసిరి తొలుత నుండి
దైత్యులనియెడు దొంగ వర్తకుల గుంపు".......... వ్యాపారానికి వచ్చి దేశాన్నిఆక్రమించిన తీరు ఇది.

దుర్గవాహనమైన పులియే ఝాన్సీ అవతారం ధరించివచ్చిందని ప్రారంభంలో పాత్రను ప్రవేశ పెట్టారు. ఇక్కడ దుర్గను ప్రస్తావించడం ఈ దేశీయమైన విశ్వాసాన్ని గౌరవించడం. ఈ కావ్యంలో అడుగడుగునా విదేశీయుల విమర్శ స్వదేశీయుల బానిసత్వముతో పాటు త్యాగనిరతిని స్వాతంత్ర్య కాంక్షను వ్యక్తం చేశారు.

**దేశం కోసం అహర్నిశలు పోరాటం చేసిన వీరుని కథ శివునికి అర్పణ చేసిన కథగా మార్చడంలో ఆంతర్యం**

హిందూ మహాసామ్రాజ్యాన్ని స్థాపించిన ఛత్రపతి శివాజీ త్రింశతి వర్ష రచనగా 1974 నాటి రచన. 1920 లలో జాతీయ భావాలు రాసిన విశ్వనాథ చివరి అంకంలో కూడా జాతీయతా ప్రతిపాదితమైన శివాజీ కథ ను 'శివార్పణం' పేరుతో కావ్యంగా రాశారు. శివాజీ వీరోచితంగా పోరాడి మహమ్మదీయ రాజ్యంగా మారిన దేశాన్ని మరల హిందూ రాజ్యంగా మార్చి ఛత్రపతి అనిపించుకున్నాడు. కాని విశ్వనాథ శివాజీ కథను ఒక భగవదర్పణ చేసిన యోగిగా ఈ కావ్యంలోరాశారు. అందుకే శివాజీ ఆధ్యాత్మిక కథ అని ట్యాగ్ లైన్ పేరు పెట్టారు.

దేశం కోసం అహర్నిశలు పోరాటం చేసిన వీరుని కథ శివునికి అర్పణ చేసిన కథగా మార్చడంలో ఆంతర్యం దేశం కోసం త్యాగం చేసిన వారంతా భగవంతునికి అర్పణ చేసినవారే నని స్పష్టం చేయడం. దేశమాత కోసం పోరాటం చేసినా, త్యాగం చేసినా, ప్రాణాలువదిలినా అది భగవదర్పణమే. ఈ దేశం భగవంతుడు వేరు కాదు. దేశమే భగవత్స్వరూపం అనే విపులార్థ సూచకం.

" ఇది చరిత్ర కాద యిది వేద ధర్మంబు
కలిని కొంతవరకు నిలువబెట్టు
నద్రి తనయ తనదు నంశంబు నొక భక్తు
నందు జేర్చి యాడు ఆట కాని" .......... ఇక్కడ కూడా ఆ పరాశక్తియైన దుర్గ తన అంశను భక్తునిలో చేర్చి నడిపించింది అంటారు. ''అల శివాజీయు నిజముగా నాత్మయందు/ భక్తుడును యోగి , రాజ్యంపు పనియు తల్లు / లిద్దరిది, దుర్గయచ్చట నిచట జిజియ / విజిత లలిత మహాలోక వీరుడితడు.... '' ఇక్కడు ఒకరు దుర్గ కాగా మరొకరు శివాజీ తల్లియైన జిజియ కూడా దుర్గాంశతో ప్రేరేపించి శివాజీని నడిపించింది. ఇదంతా భారతీయమైన ఆత్మశక్తి. అది ఏదో రూపంలో ఉత్తేజితమై తన వైభవాన్ని ఉద్ధరించడానికి ప్రయత్నిస్తుంది అని ఈ జాతి శక్తి ని ఈ కావ్యం ద్వారా వ్యక్తం చేశారు. ఈ కావ్యంలో శివాజీ కథ కూడా ఉంది. కాని పరమార్థంగా ఇది శక్తికి అంకితం. అంతటి వీరుడు శివాజీని యోగిగా చెప్పడం కొత్త దృష్టి . శివాజీ తన స్వార్థానికి పోరాటం , త్యాగం చేయలేదు. రాజభోగాలకోసం చేయలేదు. గోబ్రాహ్మణేభ్యశ్శుభమస్తు నిత్యం అని గోవులను వేదాలను కాపాడే బ్రాహ్మణులను కాపాడుకునే దేశం ఇది. ఈ అరబులు గోవులను చంపుకొని తింటున్నారు. ఒకటి వారికా మాంసం రుచి, రెండవది ఈ దేశీయులు పవిత్రంగా భావిస్తారు కనుక . అని గోవధను ఆపివేయించాడు శివాజి. హెచ్చరించాడు.

> **శివాజీ కరవాల ధాటికి తట్టుకోలేని అరబులు హిందువులపై ప్రేమను, గౌరవాన్ని చూపడం ప్రారంభించారు.**

" భారత జాతియందు నతిబంధుర శౌర్య రమా విధాతలున్
లేరనుకొందురా! కరుణ లేద యుమాపతి కంతెగాని, నా
పేరు శివాజి జ్ఞాపకము పెట్టుకొనుండిది యేమి చేతునో
కారణ జన్మudేను మిము కత్తికి కండగ జీల్లు నందఅన్''.......... ఈ హెచ్చరికలో తాను కారణజన్ముడుగా చెప్పుకోవడం గొప్పకొరకు కాదు అది కూడా యోగిలక్షణమే. కాని వారికి భయకారణం కూడా అయింది.

శివాజీ కరవాల ధాటికి తట్టుకోలేని అరబులు హిందువులపై ప్రేమను, గౌరవాన్ని చూపడం ప్రారంభించారు. అంతకు ముందువలె ఊళ్ళను

దోయలేదు. తగుల బెట్టలేదు. మామతమే గొప్పదని చెప్పను లేదు. అని పద్యాలలో వివరించారు. అంటే శివాజీకంటె ముందు ఎంత ఘోరంగా ఉండేదో వ్యంజితమౌతుంది.

"ఒక్కని జంపలేదు మరియొక్క లతాంగికి మానభంగమున్
జిక్కెనటంచు నెవ్వడును జేయడు నిద్దుర పోవుచుండగా
ముక్కడి మూక నే నిదుర పోవను నాన్ భవదీయ మాజ్ఞ తా
నిక్కడ నిద్రపోదనుట యెవ్వనివో నయహీను మాటలా?" ..

తానాజీ సింహగఢ్ ను సాధించిన ఘట్టం ఉంది. అందులో తానాజీ ప్రాణాలో కోల్పోయాడు. సింహగఢం శివాజీ వశమైంది. కోట వచ్చింది కాని సింహము పోయింది అని మరాఠీలోని మాట ఉంది. గఢ్ ఆయా సింహ్ కేలా.

> **ఈ జాతికి మూలనిధులైన వేదాలు, ధర్మము, దైవము, జ్ఞానము మొదలైన వాటిని సమర్థించడమే లక్ష్యంగా ఉంటుంది.**

విశ్వనాథ ఈ కావ్యంలో శివాజీ అప్పుడప్పుడు శ్రీశైల భ్రమరాంబికను సేవించడానికి వస్తుంటాడు అనే పద్యంతో మొదలై ఆ భ్రమరాంబిక ముందే ప్రాణాలు హరించుకోవాలనే ప్రయత్నం చేయడంతో కావ్యం ముగుస్తుంది. శ్రీశైలం తో గల సంబంధాన్ని ప్రధానంగా చూపించడంలో విశ్వనాథ అటు జాతిశక్తికి ప్రతీకగా అమ్మవారిని ఇటు తెలుగు దనం మీద ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.

విశ్వనాథ కావ్యాన్ని ఏది తీసుకున్నా ఈ దేశం,ఈ జాతికి మూలనిధులైన వేదాలు, ధర్మము, దైవము, జ్ఞానము మొదలైన వాటిని సమర్థించడమే లక్ష్యంగా ఉంటుంది. మరోవైపు ఈ దేశంలోని పూర్వ నాగరికత, కుటుంబం, సమాజం దేశీయమైన సంపదలు వాటిని కాపాడుకునే ఆర్తి ఉంటుంది.

శ్రీకుమారాభ్యుదయం అనే లఘుకావ్యంలో శ్రీవల్లీ దేవసేనా విజయం అని కుమారస్వామి కథ ఇతివృత్తం

అందులో దైత్యులను ఉద్దేశించి చెప్పిన మాటలు గమనించదగినవి.
వెసభూమీ ప్రజదౌ స్వతంత్ర మతియే విష్ణు స్వరూపంబుగా
నసురన్ గుత్తుక కత్తిరింఉ నవ చక్రాంశు ప్రతానంబు కై

విసరత్సర్వసమాన భావకలితోర్విన్ వైనతేయుండు ప
క్ష సమున్మీలిత తీవ్ర మారుత తరంగ ప్రోజ్వలుండై దిగున్......... ఈ భూమి ఈ ప్రజలది.దీనిని కాజేయడానికి చూస్తే ఊరుకోరు. వీరి స్వాతంత్ర్యాన్ని కొల్లగొట్టడాన్ని సహించరు. వీరు విష్ణుస్వరూపులైనా గరుత్మంతుని రూపంలో దిగి వస్తారు. ...... ఇది కథా పరంగాచేసిన వర్ణనే అయినా భూమి, ప్రజలు, స్వాతంత్ర్యం మొదలైన పదాలు వర్తమాన జాతీయోద్యమాన్ని స్ఫురింపజేస్తాయి.

ఈ కావ్యాన్ని గురించి ఆచార్య కోవెల సంపత్కుమార ‘‘శ్రీకుమారాభ్యుదయము దీనికే మరో పేరు శ్రీవల్లీ దేవసేనా విజయము. దైవ మానుష, యోగ, లోకాల మధ్య సాగుతూ దేశీయ స్వాతంత్ర్యోద్యమ – దేశపునర్నిర్మాణ రీతులను వ్యక్తీకరించే ఒక విలక్షణ కావ్యం ‘‘ అంటారు. (భారతీయ సాహిత్య నిర్మాతలు, విశ్వనాథ సత్యనారాయణ, కోవెల సంపత్కుమారాచార్య, కేంద్ర సాహిత్య అకాడమి ప్రచురణ )

విశ్వనాథ కవిత్వంలో నేను కొన్ని మాత్రమే ఈ వ్యాసంలో స్థాలీపులాక న్యాయంగా చూపించాను.



**ఆధునికాంధ్ర జగత్తులో విశ్వనాథ ఒక విరాణ్మూర్తి. వచన కవిత్వం వినా ఆయన చేపట్టని సాహితీ ప్రక్రియ లేదు. పట్టింది బంగారం చేయని పట్టూ లేదు. గేయం వ్రాసినా, పద్యం రచించినా, ముక్తం వ్రాసినా, మహా కావ్యాన్ని రచించినా విశ్వనాథ కృతిలో ఆయనదైన ఒక వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుంది. వాక్కులో, వాక్యంలో, శబ్దంలో, సమాసంలో, భావంలో, భావనలో, దర్శనంలో, విమర్శనంలో, భాషణంలో, భూషణంలో ఒక వైలక్షణ్యం వెల్లివిరుస్తుంది. మహాకవిగా మనుగడ సాగించడానికి ఉండవలసిన మొదటి లక్షణం — ఈ వ్యక్తిత్వం.**

**- డా. జి.వి.సుబ్రహ్మణ్యం**

## శాస్త్ర ప్రకాశిక

# క్రోమోజోములు ఏలా పరిరక్షింపబడతాయి ?
# 2009 సంవత్సర వైద్యరంగపు నోబెల్ పరిశోధన




**డాక్టర్ చాగంటి కృష్ణ కుమారి**
✆ 98851 63304


వైద్యరంగపు 2009 సంవత్సర నోబెల్ బహుమానాన్ని ముగ్గురు శాస్త్రవేత్తలు పంచుకొన్నారు. ఆస్ట్రేలియన్ అమెరికన్ మాలిక్యులార్ బయోలజిస్ట్ ఎలిజిబత్ బ్లాక్బర్న్, అమెరికన్ మాలిక్యులార్ బయోలజిస్ట్ కర్ల్ గ్రీడర్, లండన్ కి చెందిన అమెరికన్ బయోకెమిష్ట్ జాక్ సోజ్టక్ లకు టెలమరేజ్ (telomerase-- sounds like tuh·law·muh·rayz) ఎమ్ జైమ్ క్రోమో సోముల టెలొమియాలకు (telomeres sounds like teh·luh·meeuh) కు ఏవిధంగా రక్షణ నిస్తుందో కనుగొన్నందుకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేసారు.



Elizabeth H. Blackburn



Jack W. Szostak



Carol W. Greider

ఈ టెలిమియాలంటే ఏమిటో ఈ పరిశోధనా ఫలితపు పూర్వాపరాలను తెలుసుకొందాము. నిజానికీ పరిశోధన, ప్రాథమిక పరిశోధన కోవకి చెందుతుంది. వంశ పారంపర్య లక్షణాలను ఒక తరంనుండి మరిఒక తరానికి అందించడానికి DNA అణువులు యథాతథంగా తమ ప్రతి రూపాలను ఏవిధంగా మానవ శరీరంలో ఏర్పరచు కొనగలుగుతున్నాయో, రక్షించుకొంటున్నాయోనని తెలుసు కోవాలనే పరిశోధకుల కుతూహలమే ఈ పరిశోధనకి ప్రాతిపదిక. అయినప్పటికీ, ఈ అవగాహన, మన వృద్ధాప్య

దశనూ, అనారోగ్య జీవిత కాలాన్ని తగ్గించి, మనిషి ఆరోగ్య వంత మైన జీవిత కాలాన్ని పెంచడానికి తగిన వైద్య పరమైన నిర్ణయాలకు తావునిస్తుంది.




పటము –1 DNA

DNA అణువులోని అడెనిన్ (A), థైమిన్ (T), గ్వానైన్ (G), మరియు సైటోసిన్(C) వరుస క్రమము జన్యు సంకేతాన్ని (genetic code) నిర్వచిస్తుంది. ఇది ఒక వ్యక్తిగత మొక్క లేదా జంతువు యొక్క భౌతిక అభివృద్ధి, ప్రవర్తన మొదలైన వాటిని నియంత్రించే కణం– DNA లో ఒక భాగం. A,T,G,C లను న్యూక్లి యోటైడ్ లు అని అంటారు.

టెలొమియర్ (telomere) పదాన్ని గ్రీకు పదము నుండి గ్రహించారు. గ్రీకులో 'టెలోస్' అంటే చివర అనీ మెరోస్ అంటే భాగము అని అర్థము. ఈ పదాన్ని హెర్మన్ ముల్లర్ వాడుకలోకి తెచ్చాడు. ఉదాహరణకి షూ లేస్ చివరనవున్న దాని టోపి షూ లేస్ కి తప్పనిసరిగా వుండాలి. ఇది వూడిపోతే దారపు పోగులు పైకి వచ్చి దాని పని తీరు దెబ్బ తింటుంది కదా!



పటము –2

జీవరాశుల జన్యు లక్షణాలను నిర్ణయించే అణువులు జీవుల జీవకణాల కేంద్రకంలోని క్రోమోసోములలొ నిలవవుంటాయి.




పటము -3

క్రోమోసోముల చివరలు DNA అణువు తెగిపోకుండా రక్షణనిచ్చే పాత్రను పోషిస్తున్నవనీ, చివరభాగము లేని క్రోమోసోములు, తెగి పోతున్నవని 1930 ల లో బార్బారా మెక్లింటక్, (Barbara McClintock) హెర్మన్ ముల్లర్(Hermann Muller) గుర్తించారు. కానీ ఎలాగా-అన్నది వారికి తెలియలేదు. జీవరాశుల జన్యు లక్షణాలను నిర్ణయించే అణువులు జీవుల జీవకణాల కేంద్రకంలోని క్రోమోసోములలో నిలవవుంటాయి అన్నసంగతి 1930ల నాటికి శాస్త్రజ్ఞులకు తెలుసు. కానీ క్రోమోసోముల అంతర్గత నిర్మాణము గురించిన అవగాహన ఆనాటికి లేదు. పటము-4లో క్రోమోసోముల చివరల వున్న టెలొమియా DNA భాగాలను చూడవచ్చు.




పటము-4 Chromosomes contain the long strands of DNA that comprise our genes. Telomeres form caps at the ends of the chromosomes. © The Nobel Committee for Physiology or Medicine 2009

## జీవకణాలు, కణవిభజన :

మనము ముందు ఒక జీవ కణంగా (cell) పుడతాము. ఈకణము రెండుగా, రెండు నాలుగుగా, నాలుగు ఎనిమిదిగా ఇలా విభజించుకు పోతూ కొన్ని వందల లక్షల కణాలతో మన శరీరం ఏర్పడుతుంది. ఉదాహరణకి మన గుండె లో కణాలు గుండె పనితీరుకు ఉపయోగపడతాయి. మెదడుకణాలు మన చిన్న నాటి జ్ఞాపకాలను నిలువ చేసి వుంచుతాయి. కణ విభజన తగ్గి పోయినప్పుడే శరీరానికి ముసలి తన లక్షణాలు వస్తాయి. మన కేశములలోని కణాల విభజన తగ్గి అవి నశించిన కారణంగానే వృధ్యాప్య దశలో అవి తెల్లబడి పోతాయి. చర్మకణాలు నశించడం వల్ల అది ముడతలు తేరుతుంది. కణ వర్ధన (cell culture) ప్రయోగము చేసి చూడగా మానవుల నవజాత శిశువు చర్మపు కణాలు 80 నుండి 90 సార్లు కణవిభజన జరిగితే,70 సంవత్సరాల వయసు వాని చర్మ కణాల విభజన 20 నుండి 30 సార్లు జరుగుతుంది అని తెలిసింది.

కణ విభజన ఒక మాతృ జీవకణం రెండు కణాలుగా విడిపోయే జీవ ప్రక్రియ. ఈప్రక్రియలో కణం దాని క్రోమోజోముల ప్రతిరూపాలు తయారు చేస్తుంది. జీవుల పెరుగుదలకూ, ఆరోగ్య పరిరక్షణకీ, ప్రత్యుత్పత్తికీ ఈ ప్రక్రియ కీలకమైనది.

కణాల కేంద్రకంలో నున్న క్రోమోజోములు కణము నుండి కణానికి జన్యు సంబంధమైన సమాచారాన్ని తీసుకువెళ్లడానికి ఉపయోగపడే DNA అణువులను కలిగి వుంటాయి. DNA (Deoxyribonucleic acid) అణువులు అత్యంత సూక్ష్మమైన సన్నని దారపు పోగులులా వుంటాయి. ఇవి మెలికలు తిరిగి పెనవేసుకొని వున్న జంటనిర్మాణం గలవి (double helix) మెలికలు లేకుండా సరిచేస్తే డి. ఎన్.ఎ. అణువు నిచ్చెన రూపంలో కనిపిస్తుంది.




DNA

కణ విభజనకంటె ముందుగానే DNA నకలు రూపొందుతుంది అన్న సిద్ధాంతానికీ, DNA కి కొసలు వుంటాయన్న సంగతికీ పొత్తు కుదరటం లేదు. ఇది వివరణకు లొంగని విషయంగా జేమ్స్ వాట్సన్, ఫ్రాన్సిస్ క్రిక్ శాస్త్రవేత్తలు సూచించారు. శాస్త్రవేత్తలకిది కొరుకుడు పడని విషయము.




పటము–5 © The Nobel Committee for Physiology or Medicine 2009

బ్యాక్టీరియా వంటి ఆదిమ జీవుల DNA అణువులు చక్రీయంగా వుంటాయి. వాటికి కొసలు లేవు. మనుషుల, యితర జంతువుల DNA అణువులు రేఖీయంగా వుంటాయి. కణ విభజన జరిగేటప్పుడు క్రోమోసోముల కొసలు క్రమ క్రమంగా తెగిపోతూ పొట్టి అయిపోతాయి. పలుమార్లు నకళ్లు తయారవడంలో, కొసలు పొట్టిగా అవటంవల్ల, కణము, DNA అణువులు దెబ్బతిని పోతాయి.




పటము–6 క్రోమోసోముల ప్రతిరూపాలు ఏర్పడడంలో కొసలు అంతకంతకూ పొట్టి కావడము

DNA అణువు కత్తిరించుకుపోకుండా (జన్య సమాచారం యదాథంగా) నకలు తయారుచేసికొనే ప్రక్రియను జీవకణాలు ఎలా నిర్వహించుకొన గలుగుతున్నాయి? ఈ క్లిష్టమైన ప్రశ్నకు జావాబు చెప్పగలిగినందుకే ఎలిజిబత్ బ్లాక్బర్న్, కర్ల్ గ్రీడర్, జాక్ సోజ్టక్ లకి వైద్యశాస్త్ర రంగంలో 2009 నోబెల్ పురస్కారాన్ని అందజేసారు.

సిద్ధాంతపరంగా, నకళ్లు తయారైనప్పుడు, కణ విభజన జరిగిన ప్రతీసారీ క్రోమో జోములు పొట్టి పోతూ చివరకు నశించాలి. కానీ ప్రకృతిలో అలా జరగడం లేదు. ( పటము –8 ను పరిశీలించండి) కొసలు తెగిపోకుండా ఎలా ప్రతిరూపం తయారవుతుంది ?

కణవిభజన జరిగినపుడు క్రోమోసోములోని DNA అణువు పెనవేసుకొన్న పోగులు విడిపోతాయి. ఈ విడదీసే ప్రక్రియను ఒక ఎంజైమ్ నిర్వర్తిస్తుంది. నకలును డిఎన్ఎ పాలిమరైజ్ అనే ఎంజైమ్ ఏర్పరుస్తుంది. ఒక పోగు మొత్తం అంతా ఒకే సారిగా ప్రతిరూపమవగా, మరొక పోగు ముక్కముక్కలుగా కలుస్తూ ఏర్పడుతుంది. వీటిని కొనసాతున్న పోగు, వెనకపడుతున్న పోగులుగా చెపుతారు.

DNA ప్రత్యేక వరుస క్రమము




పటము–7 క్రోమోసోమల్ DNA © The Nobel Committee for Physiology or Medicine 2009

క్రోమోసొమల్ డీఎన్ఏ అణువులలో అడెనిన్ (A), థైమిన్ (T), గ్వానైన్ (G), మరియు సైటోసిన్ (C) వరుస క్రమము జన్య సంకేతాన్ని (genetic code) నిర్వచిస్తుంది.




పటము–8 © The Nobel Committee for Physiology or Medicine 2009



1958 నోబెల్ గ్రహీత ఫ్రిడిరిక్ సాంగా (Frederick Sanger) గారి కేంబ్రిడ్జ్ ప్రయోగశాలలో DNA ప్రత్యేక వరుస క్రమాన్ని తెలిసికొనగలిగే నూతన సాంకేతిక విధానాలు అభివృద్ధి చేసారు. ఎలిజిబత్ హెచ్.బ్లాక్బర్న్ సాంగా గారి దగ్గర తన డాక్టొరల్ పరిశోధన చేసింది. 1975లో ఆమె పోస్ట్ డాక్టొరల్ పరిశోధనకి యు.ఎస్.యేల్ యూనివర్సిటి లో చేరింది. తను కేంబ్రిడ్జ్ ప్రయోగశాలలో నేర్చుకొన్న సరికొత్త పరిజ్ఞానాన్ని వాడుకొంటూ జన్యువుల సంఘటనాన్ని(composition) రాబట్ట దలచింది. కానీ అలా విశ్లేషణ చేయాడానికి ఎక్కువ మొత్తములో జన్యపదార్థం కావాలి. దానిని సంపాదించడం అప్పట్లో సాధ్యంకాని పని. అమెరికా కణజీవ శాస్త్రజ్ఞుడు జోసఫ్ గ్రాఫటన్ గాల్ టెట్రు హైమిన (Tetrahymena ) ఏక కణజీవిలో సాపేక్షంగా తక్కువ పొడవు DNA వరుసక్రమము వుంటుంది అని తన అధ్యయనాలలో గుర్తించారు. ఇవి మిని క్రోమోసోములు; అధిక మొత్తంలో పొందవచ్చు. టెట్రు హైమినా తాజా నీటిలో నివసించే శైలిక (ciliate). ఒకే ఒక ఈ జీవిలో 40.000 దాకా టెలొమియాలు వుంటాయి. టెలొమియా DNA. అధ్యయనాలు చేయడానికి చాలా అనువైన ప్రాథమిక పదార్థంగా శాస్త్రవేత్తలు పరిగణిస్తారు.




పటము-9 Image: Rupal Thazhath/ Jacek Gaertig. Illustration: © The Nobel Committee for Physiology or Medicine 2009

ఎలిజిబత్ హెచ్.బ్లాక్బర్న్ మిని క్రోమోసోముల చివర లను – టెలొమియాల ని విశ్లేషించి చూసింది. CCCCAA వరుస క్రమముతో, అది 20 నుండి 70 సార్ల దాకా పునరావృతమైనట్టుగా గుర్తించింది. ఈ పరిశీలన చాలా ఆసక్తి దాయ కంగావుంది, కానీ DNA వరుసక్రమపు పనితీరు తేలికగా అర్థమయ్యేలా లేదు. ఈ పరిశీలన మరిన్ని ప్రశ్నలకు దారితీసింది. ఒక మినిక్రోమోసోమ్ DNA యొక్క వరుసక్రమపు పునరావృతాలు మరొక మిని క్రోమోసోముల వాటితో పోల్చినప్పుడు ఒకేరీతిలో వుండటంలేదు. ఇది మామూలుగా జరిగే పునరావృతపు వరుస క్రమం కాదు. కణవిభజనలో ఈ DNA వరుసక్రమము క్రోమోసోముల చివరకు తరువాత వచ్చి కలుస్తున్నది. ఇది ఎలా జరుగుతోంది అన్నదే బ్లాక్బర్న్ ముందున్న ప్రశ్న.

## రెండు జీవజాతుల కథ



బ్లాక్బర్న్ 1980లో ఒక వైజ్ఞానిక సమావేశానికి వెళ్లింది. టెట్ర హైమినా పరిశోధనలో తాను పరిశీలించిన కొరుకు పడని ఫలితాలపై మాట్లాడింది. ఆ సమావేశానికి యుఎస్.లోని హార్వర్డ్ మెడికల్ స్కూల్ పరిశోధకుడు జాక్ సోజ్టక్ (Jack Szostak) తన పరిశోధన గురించి చెప్పాడు. అతను కృత్రిమ రేఖీయ DNA వరుసక్రమాన్ని యీస్ట్ (yeast)లో చొప్పించినప్పుడు మినిక్రోమోసోము తెగిపోయింది. అందువల్ల అతని పరిశోధన ముందుకు సాగలేదు. అది అతను ఎదుర్కొన్న సమస్య.

బ్లాక్బర్న్ కూడా DNA వరుసక్రమం పై తాను నిర్వహిస్తున్న పరిశోధనలో సమస్యని ఎదుర్కొంది కనక, అతను ఒక సూచన చేసాడు. తామిద్దరూ పూర్తిగా భిన్నమైన జీవులపై పరిశోధన చేస్తున్నప్పటికీ, ఒక ప్రయోగం చేసి చూద్దాం అన్నాడు. ఆ ప్రయోగము జీవజాతుల మధ్య గల ఎల్లలను అధిగమించేదిగా నిలవవచ్చు అన్నాడు. అదేమిటంటె టెట్ర హైమిన యొక్క టెలొమియాలోని DNA వరుసక్రమం యీస్ట్ లో మినిక్రోమోసోములు తెగిపోకుండా వుంచగలుగు తుందేమో చూడాలన్నడు. సాహసవంతమైన సూచనే అయినప్పటికీ ఈ ప్రయోగం చేయడం సులభమే కాబట్టి, ఓ ప్రయత్నంచేసి చూస్తే సరి! అను

కొన్నారు; ప్రయోగం చేసారు. ఆశ్చర్యకరమైన ఫలితం వచ్చింది. టెట్ర హైమిన యొక్క టెలొమియా DNA వరుసక్రమాన్ని చేర్చినప్పుడు యీస్ట్ లో మిని క్రోమోసోము తెగిపోలేదు. టెట్ర హైమిన యొక్క టెలొమియా DNA వరుస క్రమం చేరి యీస్ట్ మినిక్రోమోసోముకు రక్షణనిచ్చింది. ఈ పరిశీలనవల్ల ఒక ప్రత్యేక మైన DNA వరుసక్రమము టెలొమియా కి రక్షణనిచ్చే లక్షణాన్ని ఇస్తున్నది. ఏకకణ జీవి అయిన టెట్ర హైమిన యొక్క టెలిమియా DNA– దానికి పూర్తిగా భిన్నమైన యీస్ట్ DNAకి రక్షణ నిచ్చిందన్న ఈ ప్రయోగ పరిశీలన వల్ల, ఈ సంవిధానము భిన్న జీవజాతులకు సాధారణమని – అన్నిజీవులకూ వర్తిస్తున్న దన్న విషయము తేటతెల్లమైంది.




పటము–10 ©The Nobel Committee for Physiology or Medicine 2009

అనుకోకుండా ఒక వరుస క్రమం మరొక చోటకి చేరింది.

సోజ్టక్ ప్రయోగాన్ని మెరుగుపరచాడు. యీస్ట్ యొక్క స్వీయ టెలొమియా వరుసక్రమాన్ని గుర్తించగలిగాడు.

బ్లాక్బర్న్ తో కలసి తయారుచేసిన కృత్రిమ క్రోమోసోములలో ఒక టెలొమియా(అనగా కోమోసోము చివరన వున్న భాగము అని ముందు చెప్పుకొన్నాము) తీసివేసి, దానిస్థానంలో యీస్ట్ కణముల యొక్క వేరొక DNA వరుస క్రమపు ముక్కని చేర్చాడు. చాలా మటుక్కు కోమోసోములు

తొందరగా తెగిపోయాయి. కానీ ఒక DNA వరుస క్రమం యీస్ట్ కణాల క్రోమోసోములను తెగిపోకుండా వుంచగలుగుతున్నదని గమనించాడు. యీస్ట్ కణాలలో పునరావృతమవుతున్న పొట్టిగా నున్నDNA వరుస క్రమం వున్నదనీ అది టెట్రహైమిన లోని DNA వరుసక్రమాన్ని పోలి వున్నదని గమనించాడు. తరువాత నిర్వహించిన ప్రయోగాలలో చాలా మొక్కలు, జంతు వుల --అమీబా నుండి మనిషిదాకా – టెలొమియా లకూ ఇది వర్తిస్తుందని తెలియ వచ్చింది. పునరావృతమవుతున్న వరుసక్రమము ప్రత్యేకమైన ప్రోటీనులను ఆకర్షించగా అవి DNA చివర్లకు ఒక రక్షణటోపి ని ఏర్పరుస్తున్నాయని స్పష్ట మైంది. ఈ టోపి లేకపోతే పెళుసైన DNA చివర కొన తెగిపొతుంది. కొసల పొడవు మారుతుంది!

బ్లాక్బర్న్, జాక్ సోజ్టక్ లు తమ ప్రయోగాలలో టెలిమియా లు పొడవు పెరుగుతాయానీ, అలాగే పొట్టిగా కూడా అవుతూ వుంటాయనీ కనుగొన్నారు

దీనివల్ల వారికి మరో ప్రశ్నకు సమాధానాన్ని తెలుసుకోవలసిన పరిస్థితి ఏర్ప డింది. DNA పాలిమరేజ్ ఎంజైమ్ DNAను చదవగలదు, DNA వరుస క్రమపు అసలుసిసలు నకలును తయారు చేయగలదు. కానీ ఇప్పుడు DNA వరుస క్రమానికి మరొముక్కను కలిపి దాని పొడవును ఏ ఎంజైమ్ పెంచుతున్నది? అలా చేయగలిగిన ఇంతవరకూ వారు ఎరగని ఎంజైమ్ ఒకటి వున్నదా?

### టెలిమరైజ్ ఎంజైమ్ ను కనుగొనుట:




పటము–11 కర్ల్ గ్రీడర్ , బ్లాక్బర్న్ ప్రయోగము వివరణ © The Nobel Committee for Physiology or Medicine 2009



కర్ల్ గ్రీడర్, బ్లాక్బర్న్ ప్రయోగశాలలో పనిచేస్తున్నది . ఈమె ఈ సమస్యను చేపడతానని అన్నది. కర్ల్ గ్రీడర్, బ్లాక్బర్న్ యిరువురు టెట్రు హైమిన కణాలకి పొట్టి టెలొమియా యొక్క DNA వరుసక్రమానికి రేడియో క్రియాశీల చీటీని తగిలించిన న్యూక్లియోటైడ్ ల (DNA లొవుండే G &T )మిశ్రమాన్ని కలిపి చూసారు. మిశ్రమంలో కేవలము DNA పాలిమరేజ్ ఎంజైమ్ మాత్రమే వుంటే ఏమీ తేడా రాకూడదు. కానీ వేరే ఏదైనా మరో ఎంజైమ్ వున్నట్లైతే రేడియో క్రియాశీల చీటీ తగిలించిన న్యూక్లియోటైడ్ లతో టెలిమియాలు పెరగాలి. ప్రయోగంలో ముందు వారు వుంచిన వరుస క్రమపు పొడవుకంటే భిన్నమైన పొడవుగలవి వున్నాయి. 1984 డెసెంబర్ 25న కర్ల్ గ్రీడర్ ఈ కొత్త ఎంజైమ్ యొక్క క్రియా కలాపాన్ని(activity) నిర్ధారణ చేసింది. ఈ ఎంజైమ్ కి తరువాత టెలిమరేజ్ (telomerase) అని పేరు పెట్టారు.( పటము –12 ని పరిశీలించండి )

అంతర్నిర్మిత బ్లూ ప్రింట్ తో నిర్మాణ పనితనము కలిగిన టెలిమరేజ్




పటము–12 Photo: Greider and Blackburn, Cell, 43, 405, 1985.
Illustration: © The Nobel Committee for Physiology or Medicine 2009

ఎంజైమ్.

టెలిమరేజ్ ఎంజైమ్ నిర్మాణమును ఎలా నిర్వహిస్తున్నది? న్యూక్లియోటైడులను కలపవలసిన వరుసక్రమాన్ని ఎలా తెలుసుకోగలుగుతున్నది? మరికొన్ని సంవత్సరాల పరిశోధన తరువాత కర్ల్ గ్రీడర్, బ్లాక్బర్న్ వివరణ నమూనాను ప్రతిపాదించారు. దానిని శాస్త్రలోకం ఆమోదంచింది. ఇతర ఎంజైమ్ ల లాగే టెలిమరేజ్ కూడా DNA వరుసక్రమాన్ని సంశ్లేషణ చేసికొనగలదు; ఈ లక్షణం తో పాటూ అదనంగా ఈ ఎంజైమ్ DNA భాగములో నున్న టెలొమియా వరుసక్రమంతో సమానమైన వరుస క్రమం గల RNA భాగమును కలిగి వుంటుంది. అనగా టెలొమియా ను నిర్మించడానికి టెలిమరేజ్ ఎంజైమ్ కి అంతర్నిర్మిత బ్లూ ప్రింట్ ను తీసికొని వస్తుంది. 1989లో టెలిమరేజ్ యొక్క RNA భాగము టెలిమియా యొక్క వరుసక్రమానికి సరిపోలివున్న వరుస క్రమాన్ని తప్పక కలిగి వుంటుంది. సంవత్సరాంతానికి తమ ఈ ప్రతిపాదనకు ఋజువును బ్లాక్బర్న్ శాస్త్రవేత్తల బృందం చూపగలిగింది.

## పొట్టిగా మారుతున్న టెలొమియా; వయసు మీరుతున్న కణాలు




పటము–13 టెలిమ రైజ్ (Telomerase) క్రోమోజోమ్ చివర్ల దగ్గర DNA వరుసక్రమాన్ని పెంచుతుంది .దానికి ప్రోటీన్, RNA వరుసక్రమము వుటుంది. RNA భాగము టెలొమియా DNA నిర్మాణం లొ ఒక అచ్చు .(template) గా వ్యవహరిస్తుంది © The Nobel Committee for Physiology or Medicine2009




పటము–14 మాతృ రూపానికి సమానమైన ప్రతిరూపాన్ని ఏర్పరచడం

ఒక కణజీవితంలో టెలొమియా పాత్ర తెలుసుకోవలసిన అవసరం ఏర్పడింది.

జాక్ సోజ్టక్ బృంద శాస్త్రవేత్తలు టెలిమియాలను క్రమంగా పొట్టిగా చేస్తున్న యీస్ట్ కణాలలో ఉత్పరివర్తనాలను (mutations) గుర్తించారు. కణ పెరుగుదల క్రమక్రమంగా తగ్గిపోతూ చివరగా అవి విభజించుకోవడం మానేసాయి. బ్లాక్బర్న్ బృందం టెట్రహెమినా టెలిమరేజ్ RNAలో ఉత్పరివర్తనాలను జొప్పించారు. జాక్ సోజ్టక్ బృంద శాస్త్రవేత్తలకు లభించిన ఫలితాలే వీరికీ లభించాయి.

ఈ ఫలితాల వల్ల సంపూర్ణంగా వున్న టెలొమియా క్రోమోసోమును భద్రంగా వుంచుతుంది(రక్షణనిస్తుంది) అనీ, కణము వయసు పెరగడాన్ని(ముదుమి వయసును) వాయిదా వేస్తుందని ఈ శాస్త్రవేత్తలు ముగ్గురూ నిర్ధారించారు. ప్రాధమికమైన ఇటువంటి సంవిధానాలను ఏక కణ జీవులలో కనుగొన్నారు. 1988 లో మానవుల టెలొమియాలలో కూడా ఇదే మాదిరి DNA వరుస క్రమాన్ని గుర్తించారు.

### ముసలితనము

మనిషి వయసు మీద పడడానికి, ముదిమికి కారణాలను వెతికే పరిశోధనలు జరుగుతూనే వున్నాయి. ముసలితనం రావడంపై పలు అంశాల ప్రభావం వుంటుంది. వాటిలో టెలొమియా (క్రోమోసోమ్ చివరి భాగము) ఒకటి. ఈ దిశగా టెలొమియా లపై జరిపే పరిశోధన ఎప్పటికీ ఆసక్తికరముగానే వుంటుంది.

టెలిమరేజ్ ఎంజైమ్ ; వ్యాధులు

టెలోమియరా, టెలిమరేజ్ ఎంజైమ్ ల ఆవిష్కరణలకి వైద్యపరమైన అనువర్తనాలు విస్తారంగా వున్నాయి. కేన్సర్, అనువంశిక వ్యాధులు, ముసలితనపు లక్షణాలు మొదలైనవి కొన్ని ఉదాహరణలు.




★★★

## References for further study


- Szostak JW, Blackburn EH. Cloning yeast telomeres on linear plasmid vectors. Cell 1982; 29:245-55.
- Greider CW, Blackburn EH. Identification of a specific telomere terminal transferase activity in Tetrahymena extracts. Cell 1985; 43:405-13.
- Greider CW, Blackburn EH. A telomeric sequence in the RNA of Tetrahymena telomerase required for telomere repeat synthesis. Nature 1989; 337:331-7.
- https://www.nobelprize.org/prizes/medicine/2009/summary
- https://www.nobelprize.org/prizes/medicine/2009/illustrated-information/

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక
సంపుటి 4 | సంచిక 2  ఏప్రిల్-జూన్ 2024

మమత-సమత-మానవత
www.gurajada.org



# ధన్యోస్మి

జులై–సెప్టెంబర్ 2024 సంచికలో ప్రచురణ కోసం మంచి వ్యాసాలు రాసి పంపిన వ్యాసకర్తలకి శతకోటి నమస్సులు.

ఈ సంచిక వెలువరించడంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన వారెందరో, వారందరికీ వందనములు.

ప్రచురణ కోసం కథలు, కవితలు, పరిశోధనా వ్యాసాలు పంపమని రచయితలను కోరుతున్నాము.

ఎప్పటిలాగే పాఠకులు ఈ సంచికను కూడా చదివి ఆనందిస్తారని ఆశిస్తాను.

చదవండి, చదివించండి.

భవదీయుడు
**ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ**
ప్రధాన సంపాదకులు

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక
సంపుటి 4 | సంచిక 3 జులై-సెప్టెంబర్ 2024

మమత-సమత-మానవత
www.gurajada.org

## ?

~ దాశరథి కృష్ణమాచార్యులు



ఆ చల్లని సముద్రగర్భం
దాచిన బడబానలమెంతో?

ఆ నల్లని ఆకాశంలో
కానరాని భానువులెందరో?

భూగోళం పుట్టుక కోసం
కూలిన సురగోళాలెన్నో?

నర మానవరూపం కోసం
జరిగిన పరిణామాలెన్నో?

వొక రాజును గెలిపించుటలో
వొరిగిన నరకంఠాలెన్నో?

శ్రమజీవుల పచ్చి నెత్తురులు
త్రాగని ధనవంతులెందరో?

అన్నార్తులు, అనాథలుండని
ఆ నవయుగమదెంత దూరమో?

కరువంటూ కాటక మంటూ
కనుపించని కాలాలెప్పుడో?

అణగారిన అగ్ని పర్వతం
కని పెంచిన "లావా" యెంతో?

ఆకలితో చచ్చే పేదల
శోకంలో కోపం యెంతో?

పసిపాపల నిదుర కనులలో
మురిసిన భవితవ్యం యెంతో?

గాయపడిన కవి గుండెల్లో
వ్రాయబడని కావ్యాలెన్నో?

కుల మతముల సుడిగుండాలకు
బలిగాని పవిత్రులెందరో?

భరతావని బలపరాక్రమం
చెర వీడేదింకెన్నాళ్ళకో?